వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే..
**13న సమ్మె నోటీస్**

‘జనగణన -2027’లో భాగంగా
**మే 11వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్**

03

‘క్యూర్’లో ఇంజనీరింగ్ సిబ్బంది కొరత

సంపుటి 09, సంచిక: 94 | బుధవారం | 04-03-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## మనోళ్లొచ్చేస్తున్నారు

- యుఎఇ నుంచి భారత్‌కు తొలి విమానం
- ఢిల్లీ విమానాశ్రయంలో 149 మంది ప్రయాణికులకు ఘన స్వాగతం

**న్యూఢిల్లీ :** ఎట్టకేలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) గగనతలం పాక్షికంగా తెరుచుకుంది. దీంతో అక్కడి నుంచి భారత్‌కు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 149 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో కూడిన ఎయిర్ ఇండియా విమానం దుబాయ్ నుంచి న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ జరుగుతున్న వేళ గత 24 గంటల్లో భారత్‌లోకి ప్రవేశించిన తొలి అంతర్జాతీయ విమాన సర్వీసు ఇదే. ఇక యుఎఇలో ఇరుక్కుపోయిన భారతీయులను తీసుకొచ్చేందుకు ఫుజైరా నుంచి ఢిల్లీ, ముంబయి, కొచ్చిలకు తరువాయి 2లో



## బంకర్లలో తెలంగాణ వాసులు

ఇజ్రాయెల్‌లో సైరన్ల మధ్య వలస కార్మికుల ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్

అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. రాకెట్ దాడులు, ప్రతిదాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిన వేళ, ఇజ్రాయెల్‌లో ఉపాధి కోసం ఉన్న తెలంగాణ పౌరులు ప్రత్యేక భూగర్భ బంకర్లలో తలదాచుకుంటున్నారు. సైరన్ మోగగానే బంకర్లకు పరుగులు తీస్తున్నారు.ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న కార్మికులు చెబుతున్న ప్రకారం, ప్రమాద హెచ్చరిక సైరన్ మోగగానే 30 నుండి 60 సెకన్లలో సమీప బంకర్‌కు చేరుకోవాలి. నిర్మాణ తరువాయి 2లో

18,139 మెగావాట్లు

## రికార్డు స్థాయి డిమాండ్

### రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం మరోసారి తన అప్రతిహత ప్రగతిని చాటుకుంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు మంగళవారం ఉదయం 11:01 గంటలకు నమోదైన 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాయి. ఇది తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్‌గా నమోదైంది. రాష్ట్ర విద్యుత్ సంస్థ తరువాయి 12లో

కాంగ్రెస్‌లోకి వస్తామంటే

## మావోయిస్టులను ఆహ్వానిస్తాం

### టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్



నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రజల పక్షాన దశాబ్దాలుగా పని చేసిన లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ తామైనా మావోయిస్టులైనా పేద ప్రజల కోసమే పోరాటం చేశామన్నారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తరువాయి 12లో

క్షిపణులు, డ్రోనుల దాడులు, ప్రతిదాడులతో

# పశ్చిమాసియా దద్దరిల్లుతోంది



- ఇరాన్ అధ్యక్ష, సుప్రీం కౌన్సిల్ కాంప్లెక్స్‌పై ఇజ్రాయెల్ దాడి • రివల్యూషనరీ గార్డ్స్ కేంద్ర కార్యాలయం ధ్వంసం • 11 మంది సైనికులు, 85 పౌరులు మృతి • ఇరాన్ దాడులతో బెంబేలెత్తిన ఇజ్రాయెల్ • రియాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయం ధ్వంసం • కువైట్‌లో మూతడిన యుఎస్ దౌత్యకార్యాలయం : ఆరుగురు అమెరికా సైనికులు హతం • నాలుగు రోజుల యుద్ధంలో 787 మంది ఇరానియన్లు మృతి • పశ్చిమాసియా వదిలిరావాలని 12 దేశాల్లో అమెరికన్లకు వైట్ హౌస్ ఆదేశం



హోర్ముజ్ జలసంధి మూసివేత: నౌకలొస్తే ధ్వంసమే 02

**టెహ్రాన్:** పశ్చిమాసియా బాంబు పేలుళ్ళు, క్షిపణులు, డ్రోన్ల దాడులు ప్రతిదాడులతో దద్దరిల్లుతోంది. భారీ దాడులు చేస్తామని అమెరికా పాలకులు హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఇరాన్ అధ్యక్ష కార్యాలయ నాయకత్వ భవనాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేందుకు రంగం సిద్ధం చేసిన క్యామ్‌లోని అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ బిల్డింగ్‌పై గగనతల దాడులు చేసింది. ఇరాన్‌లో పలుచోట్ల పేలుళ్ళ సంభవిస్తున్నాయి. ఇరాన్ ప్రతీకార దాడులు విస్తృతమయ్యాయి. మరోవైపు సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని ఇరాన్ ధ్వంసం చేసింది. దీంతో ఆ కార్యాలయం మూత పడింది. కువైత్‌లో కూడా అమెరికా దౌత్యకార్యాలయం మూతపడింది. ఖతార్‌లో ఇరాన్ దాడులతో ప్రభుత్వ లిక్విఫైడ్‌గ్యాస్ ఇంధన ఉత్పత్తి సంస్థ మూత పడింది. పశ్చిమాసియాలో ఉన్న అనేక అమెరికా కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. రియాద్‌లో దౌత్యకార్యాలయ ధ్వంసానికి ప్రతీకారం తీర్చుకుంటామని ట్రంప్ ప్రకటించారు. అనేకచోట్ల ఇరాన్ దాడులు ఉద్ధృతం కావడంతో ఇజ్రాయెల్ బెంబేలెత్తింది. క్షిపణి దాడుల్లో 12 మంది గాయపడ్డారు. దుబాయ్, ఖతార్, కువైత్, బహ్రైన్‌లలో అమెరికా స్థావరాలపై దాడులుచేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. బహ్రైన్‌లోని తరువాయి 2లో

### చర్చిద్దామన్నారు.. ఆలస్యమైందని చెప్పా : ట్రంప్



ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు.

ఖమేనీ హత్యకు వ్యతిరేకంగా

## వామపక్షాల నిరసన

- కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్
- ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులకు వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు
- ఇరాన్‌కు సంఘీభావం తెలపాలని దేశ ప్రజలకు పిలుపు



**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడిని, ఇస్లామిక్ రిపబ్లిక్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ హత్యను నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్ష పార్టీలు మంగళవారం తరువాయి 2లో

ఖమేనీ హత్యపై మోదీ మౌనం

## తటస్థం కాదు.. పరాజయం



- భారత విదేశ విధానం దిశ, విశ్వసనీయతపై సందేహాలను లేవనెత్తుతుంది • బడ్జెట్ సమావేశాల రెండో సేషన్‌లో అంతర్జాతీయ సమస్యలపై చర్చించాలి • కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై కాంగ్రెస్ మాజీ ప్రెసిడెంట్ సోనియాగాంధీ నిప్పులుచెరిగారు. ఇరాన్ ‘సుప్రీం’ లీడర్ అయతుల్లా ఖమేనీ హత్యపై మోదీ ప్రభుత్వ మౌనం తటస్థం కాదని, అది తన పదవిని వదులుకోవడమేనని, ఈ ధోరణి భారత విదేశాంగ విధానం దిశ, విశ్వసనీయతపై సందేహాలు లేవనెత్తుతుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ మంగళవారం తీవ్రస్థాయి విమర్శలు చేశారు. బడ్జెట్ రెండవ సెషన్‌లో భాగంగా పార్లమెంట్ తిరిగి సమావేశం అయినప్పుడు అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వం అనుసరిస్తున్న ‘కలవరపరిచే నిశ్శబ్దం’ గురించి ఎలాంటి దాటవేత ధోరణి లేకుండా బహిరంగ చర్చ జరపాలని మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలైన సోనియా గాంధీ తరువాయి 2లో



ప్రతి ప్రభుత్వ పథకంలో

## లబ్ధిదారులకు ముఖ గుర్తింపు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు • విద్యా వ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన • ప్రభుత్వ ఆసుపత్రుల పటిష్టానికి సమీప మెడికల్ కాలేజీల అనుసంధానం • 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక అమలులో ప్రజాపతినిధుల భాగస్వామ్యం ఉండాలి • కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం • పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం జరిగితే యాజమాన్యాలే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

‘రాష్ట్రంలోని నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి. విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేసేందుకు సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలి. 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి గ్రామ సభల్లో సంక్షేమ పథకాల వారీగా ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలి. ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధి దారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి’ అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ల సదస్సు మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారులు తరువాయి 12లో

మామునూరు ఎయిర్ పోర్టుకు

## షార్ట్ రన్ వే?

- 3.9 కిలోమీటర్ల నుండి 2.5 కిలోమీటర్లకు కుదింపు • దీంతో డొమెస్టిక్ విమానాలకే పరిమితం • నిరసన వ్యక్తం చేస్తున్న వరంగల్ ప్రజలు




ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి మామునూరు విమానాశ్రయానికి ఆది నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. భూసేకరణ విషయంలో రైతులను ఒప్పించేందుకు రెవెన్యూ అధికారులు పెద్ద యుద్ధమే చేశారు. మొత్తానికి భూసేకరణ పూర్తి చేసి పనులు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్త చిక్కు వచ్చి పడింది. ఎయిర్ పోర్ట్ రన్‌వే ను కుదిస్తున్నారనే ప్రచారం వరంగల్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ఇది ఆరంభ శూరత్వమేనా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలలోకి వెళితే వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేస్తున్నామని భారీస్థాయిలో ప్రచారం చేసుకున్న రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బిజెపి సర్కార్లు.. చివరికి రన్ వే సైజును కేవలం 2.5 కిలోమీటర్లకే కుదిస్తున్నారనే ప్రచారంతో వరంగల్ ప్రజలను నిరుత్సాహానికి గురిచేశాయి. కనీసం 2.9 కిలోమీటర్ల రన్ వే ఉంటే తప్ప పెద్ద విమానాలు, అంతర్జాతీయ తరువాయి 12లో

## భారత్ స్టాక్ మార్కెట్.. గుండు గీసిన యుద్ధం

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం భారత్ స్టాక్‌మార్కెట్ గుండుగీసింది. యుద్ధ ఉద్రిక్తత కారణంగా 11 లక్షల కోట్ల రూపాయలు ఆవిరై గాలిపో కలిసిపోయాయి. ప్రపంచంలో ప్రాదేశిక భౌగోళిక ఉద్రిక్తలు భయాందోళనకు గురిచేస్తూ ఉండటంలో ఇండియన్ ఇన్వెస్టర్లు ఎటూ పాలుపోక తమ పెట్టుబడులు కాపాడుకునేందుకు తలో దిక్కుకీ పరుగులు తీశారు. ఇటీవలి సెషన్స్‌లో భారత్ ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఒత్తిడులకు గురవుతోంది. గడచిన రెండు రోజుల్లో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 2.5 శాతం స్థాయిలో క్షీణించింది. సెన్సెక్స్ 1000 పాయింట్ల కంటే ఎక్కువగా పతనమై 81,000 కంటే దిగువస్థాయికి క్షీణించింది. నిఫ్టీ 50 కూడా గణనీయంగా పతనమైంది. ఐతే దేశ స్థూల ఆర్థిక మౌలిక విధానాలకు నష్టం కలగలేదు. 2026 జనవరి నాటికి జిఎస్‌టి వసూళ్ళు రూ.1.71లక్షల కోట్ల వద్ద నిలబడి ఉంది. 2027లో ఎర్నింగ్స్ రికవరీ జరుగుతుందని స్టాక్‌మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వరంగ బ్యాంకుల త్రైమాసిక పని తీరు ఫలితం కూడా బాగానే ఉంది. స్వల్పకాలిక సవాళ్ళు ఎదురైనప్పటికీ భారత్‌లో ఆర్థిక వ్యవస్థ తన కాళ్ళమీద నిలదొక్కుకుంటుందని ప్రపంచ వ్యాప్తంగా నిపుణులందరూ అంగీకరిస్తున్న విషయమేనని పి.ఎల్. క్యాపిటల్ అడ్వైజరీ హెడ్ విక్రమ్ కాసత్ వ్యాఖ్యానించారు.

# హోర్ముజ్ జలసంధి మూసివేత : నౌకలొస్తే ధ్వంసమే

ఇరాన్ హెచ్చరికతో మలుపు తిరిగిన యుద్ధం

స్థంభించిన వందలాది నౌకలు

రోజుకు నాలుగు లక్షల డాలర్లు రవాణా ఛార్జీలు నష్టం




**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది! ఇక ఇటువైపు ఏ నౌక వచ్చినా ధ్వంసం చేస్తామని ఇరాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో మూడు రోజులుగా పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నాలుగోరోజైన మంగళవారం కొత్త మలుపు తీసుకుంది. ఇరాన్ చేసిన ఈ హెచ్చరికలో ప్రపంచదేశాలలో ఇక చమురు సంక్షోభం ప్రారంభమయ్యే పరిస్థితి మొదలైంది. దీంతో వందలాది నౌకలు ఎక్కడికక్కడ స్థంభించిపోయాయి. ఈ కారణంగా వాటి రవాణా ఛార్జీలు రోజుకు నాలుగులక్షల డాలర్ల మేరకు భారం పేరుకుపోతుంది. దీంతో సంక్షోభం తలెత్తింది. భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ సహా ప్రపంచంలో అనేక చిన్నా పెద్దా దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ మార్గంలో వచ్చే ఇంధన వనరులే మనుగడకు ప్రాణాధారంగా ఉంటున్నాయి. చైనా మిత్రదేశంగా ఉన్నప్పటికీ ఇరాన్ హెచ్చరికలు ఇప్పుడు అన్ని దేశాలకు వర్తిస్తాయి. ఐతే సౌదీ అరేబియాలో ఎర్ర సముద్రతీరం యంబు నౌకాశ్రయం వరకూ ఉన్న పైపులైను ద్వారా యూరప్, అమెరికా దేశాలకు, అబుదాభి నుండి ఒమన్ వరకూ పైపులైను ద్వారా తీసుకువెళ్ళి నౌకల్లో మళ్ళీ ఆసియా దేశాలకు చమురు సరఫరా వంటి ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయి. హోర్ముజ్ జలమార్గం ద్వారా ప్రతి రోజూ 2.10 కోట్ల బ్యారెళ్ళ చమురు నౌకల్లో వివిధ ప్రపంచ దేశాలకు రవాణా అవుతూ ఉంటుంది. ప్రపంచ అవసరాల నిమిత్తం 30 శాతం సహజవాయువు ఈ మార్గం నుండే వెళుతుంది. యుద్ధ పరిస్థితుల్లో రవాణా చర్యలు అనిశ్చితంగా ఉన్నాయి. మరో నాలుగు వారాలు యుద్ధం కొనసాగకతప్పదన్ని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఎర్ర సముద్రంలో ఇక మీదట వాణిజ్య నౌకలపై దాడులు పునరుద్ధరిస్తామని ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థలు హెచ్చరికలు చేయడంతో అనేక చమురు రవాణా కంపెనీలు నౌకలను నిలిపివేయాలని నిర్ణయించాయి. భారతదేశానికి అవసరమైన దాదాపు 20.60లక్షల మిలియన్ బ్యారెల్స్ పెట్రోలు, దేశంలో ఒకరోజు ఉపయోగించే 19.60 కోట్ల క్యుబిక్ మీటర్ల సహజవాయువు కూడా ఈ మార్గం నుండే వస్తుంది. బంగ్లాదేశ్ కూడా యాభై శాతం ఎల్ఎన్‌జి అంటే 30.60 టన్నుల ఎల్ఎన్‌జిని ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌నుండే దిగుమతి చేసుకుంటోంది. ప్రపంచదేశాల అవసరాలకు అనుగుణంగా ప్రతిరోజూ 50 శాతం సహజ వాయువు ఈ మార్గంలోంచే వస్తుంది. యుద్ధం ప్రారంభం కాకముందునుండీ ప్రపంచ నిపుణులు, వాణిజ్యవేత్తలు హోర్ముజ్ జలసంధి ప్రాధాన్యత గురించి, యుద్ధం సంభవిస్తే వచ్చే పరిణామాల గురించీ హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఐనప్పటికీ ట్రంప్ చర్చలు చివరిదశలో సానుకూల దృక్పథంలో వెళుతున్న తరుణంలో ఆకస్మిక దాడులు చేసి ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ, ఆయన ముఖ్య మంత్రివర్గం, కమాండర్లుసహా 48మంది నాయకులను బాంబు పేలుళ్ళతో భూస్థాపితం చేయడంతో ఇరాన్ ఆగ్రహం సునామీలా పశ్చిమాసియాను తాకింది. ఈ ప్రమాదం ఇప్పుడు యావత్ ప్రపంచానికి వచ్చి చుట్టుకుంది. యుద్ధం మొదలైన తర్వాత ఈ మూడు రోజుల్లోనూ నాలుగైదు చమురు నౌకలపై ఇరాన్ ప్రొజెక్టైల్స్ దాడులు చేశాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకను డ్రోన్ బోటుతో పేల్చివేయడంతో అందులో ఉన్న 21 మంది కార్మికుల్లో ఒక భారతీయ కార్మికుడు మరణించారు. మరో నాలుగురు బంగ్లాదేశీ, 15 మంది భారతీయ కార్మికులను రక్షించారు.

## 70 హెజ్బొల్లా స్థావరాలపై గగనతల దాడులు

దక్షిణ లెబనాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం

80 పట్టణాలు,గ్రామాలు ఖాళీచేయాలని హుకుం

**జెరూసలెం :** దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా ఉగ్రవాదసంస్థ స్థావరాలపై ఇజ్రాయెల్ వరుస దాడులు కొనసాగించింది. రెండోరోజు మంగళవారం 70 హెజ్బొల్లా స్థావరాలపై దాడులు చేసినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. బీరూట్‌లో హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపింది. హెజ్బొల్లా కమాండ్ సెంటర్, ఆయుధ నిల్వల కేంద్రాలపై దాడి చేసినట్లు పేర్కొంది. హెజ్బొల్లా అధికారిక టీవీ ఛానల్ కార్యాలయాన్ని ధ్వంసం చేసింది. అదేవిధంగా భౌతికంగా ఇజ్రాయెల్ సైన్యం కూడా బీరూట్‌లో ప్రవేశించింది. దాదాపు 80 పట్టణాలు, గ్రామాల ప్రజలు ఇళ్ళు ఖాళీ చేయాలని లేకపోతే తీవ్ర దాడుల ప్రభావానికి గురవుతారని హెచ్చరించింది. మొదటిరోజు దాడుల్లో 52 మంది మరణించగా, మరో 150 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. మొదటిరోజు మరణించిన ప్రముఖులలో లెబనాన్ పార్లమెంటులోని హెజ్బొల్లా విభాగాధిపతి మహ్మద్ రాడ్ ఈ దాడుల్లో మరణించారు. ఆయనతోపాటు అనేకమంది సీనియర్ నాయకులు మరణించారు. దాడుల ఫలితంగా రాజధాని బీరూట్‌లో పలుచోట్ల భారీపేలుళ్ళు సంభవించాయి. హెజ్బొల్లా బలమైన కేంద్రాలపై దాడులు చేశామని, హెజ్బొల్లా అగ్ర నాయకత్వంలోని సీనియర్ సభ్యులను నిర్మూలించామని ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్ ఇజ్రాయెల్‌ను మట్టుపెడతామని హెజ్బొల్లా ప్రతిజ్ఞ చేసింది. అమెరికన్, జియోనిస్టు (ఇజ్రాయెల్) నేరపూరిత చర్యలవల్ల మన నాయకుడు ఖమేనీ మరణించారని, అమాయకులైన కుమారులను లక్ష్యంగా చేసుకోవడం వారి నేరాలకు పరాకాష్ఠ అనీ ఈ దాడులకు ప్రతీకారంతో తమ విధి నిర్వహిస్తామని హెజ్బొల్లా పేర్కొంది.

## ప్రాణభయమున్నా బంకర్‌కు వెళ్ళని ఖమేనీ!


**టెహ్రాన్:** ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీకి ట్రంప్ వల్ల ప్రాణభయం ఉందని తెలిసినాగానీ ఆయన ప్రాణాలు దక్కించుకోవడానికి కంచుకోట లాంటి బంకరులోకి వెళ్ళలేదు. ఆయన భయపడలేదు. ఆయన మిత్రుడు, హెజ్బొల్లా ప్రధాన కార్యదర్శి హస్సన్ నజ్రల్లా చాలా సంవత్సరాలు భయంతో బంకర్‌లో గడిపారు. చివరకు 2024 సెప్టెంబరులో బీరూట్‌లో హత్యకు గురయ్యారు. కానీ ఖమేనీబాహాటంగా ఉండేందుకే ఇష్టపడ్డారు. ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక ఈ నివేదిక వెల్లడించింది. వాస్తవానికి అనేక సంవత్సరాలుగా ఆయనపై నిఘా ఉంది. అమెరికాకు బలమైన సిఐఎ గూఢచారి వ్యవస్థ గడచిన మూడు నెలలుగా చాలా నిశితంగా ఖమేనీ కదలికలను కనిపెట్టి ఉన్నాయి. అన్ని డెవైజ్‌ల ద్వారా ఆయనకు సంబంధించిన కదలికలను ట్రాకింగ్‌లో ఉంచాయి. ఇరాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. చివరి వరకూ అంటే ఫిబ్రవరి చివరి వారంలో కూడా ఆయన ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఇరాన్ కోసం ఆయన ఆత్మ బలిదానం చేయడానికి సిద్ధపడ్డారు. అనేకసార్లు ఆయన తన బలిదానం గురించి ప్రకటనలు చేశారు. అమెరికా తనను దారుణంగా హత్య చేస్తుందని ఖమేనీకి తెలుసు. అందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు. ఐఆర్‌జిసి ఆయనకు బలమైన బంకర్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. కానీ ఆయన రహస్యంగా దాక్కునేందుకు సిద్ధపడలేదు. టెహ్రాన్‌లో తన కార్యాలయంలో రంజాన్ పవిత్రమాసంలో తెల్లారుజామున కీలక నాయకులతో ఆయన సమావేశం నిర్వహిస్తున్న విషయం ట్రంప్ గూఢచారులకు తెలిసింది. వెంటనే ఆ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రికి తెలియజేశారు. దాంతో నెతన్యాహూ బలగాలు లక్ష్యంపై దాడులు చేసి ఆయనను ఆయన కుటుంబాన్ని దాడుల్లో భూస్థాపితం చేసింది. 1979లో ఇరాన్ చివరి షా ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత మొదట ఇరాన్‌తో అమెరికాకు కొంత సఖ్యత ఉన్నా తర్వాత సంబంధాలు చెడాయి. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు అనేక సంవత్సరాలుగా అక్కడ ప్రజా తిరుగుబాటుకోసం అమెరికా ప్రభుత్వాలు ఎదురుచూస్తున్నాయి.

# శాశ్వత దాడులకు సరిపడా ఆయుధాలున్నాయ్ : ట్రంప్

పశ్చిమాసియాకు భారీగా ఆయుధాల తరలింపు

**వాషింగ్టన్ :** ఇరాన్‌పై శాశ్వతస్థాయిలో దాడులు చేయడానికి సరిపడినన్ని ఆయుధాలు తమ వద్ద ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా ప్రకటనలో తెలియజేశారు. భారీ ఎత్తున ఆయుధాలు, ఆయుధ సామాగ్రిని పశ్చిమ ఆసియాకు తరలిస్తామని, ఈ విషయంలో ఎలాంటి లోటూ లేదన్నారు. రాబోయే రోజుల్లో భారీస్థాయిలో ఇరాన్‌పై దాడులు జరుగుతాయని మరో సారి ముందస్తు హెచ్చరిక చేశారు. అవసరమైతే అపరిమితస్థాయిలో పశ్చిమాసియాకు ఆయుధాలు తరలిస్తామన్నారు. ఇతర దేశాల్లో కూడా ఉన్నతశ్రేణి ఆయుధాలను నిల్వచేసి ఉంచామన్నారు. ఇరాన్ శరవేగంగా క్షిపణులను తయారు చేస్తోందని, ఈ క్షిపణి సామర్థ్యాన్ని నాశనం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని, వారిని బలహీన పరుస్తామని అన్నారు. రియాద్‌లో అమెరికా దౌత్య కార్యాలయంపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. యుద్ధం అనివార్యంగా నాలుగైదువారాలు కొనసాగుతుందన్నారు.

జోబైడెన్ పాలనలో అమెరికా సైనిక వ్యవస్థ అస్తవ్యస్థగా మారిందని, తాను వచ్చిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దానని, ఇప్పుడు భారీస్థాయిలో ఆయుధాలు, ఆయుధ సామాగ్ర ఉందన్నారు. ఇరాన్ ప్రజలు తిరుగుబాటు చేయాలని అధికారాన్ని తమ సొంతం చేసుకోవాలని కోరారు. ఇదేసమయంలో అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ మాట్లాడుతూ, ఇరాన్‌లో ప్రతిపక్షాలతో కలిసి పనిచేయడం ట్రంప్‌కు ఎంతో కీలకమైన విషయమన్నారు. దేశంలో ఎవ్వరూ ప్రజలకు వెండిపళ్ళెంలో అధికారాన్ని తెచ్చి ఇవ్వరని, అధికారం ప్రజలపరం కావాలంటే వారికి దేశంలోనే అంతర్గతంగా సహాయ సహకారాలు లభించాల్సి ఉంటుందని అన్నారు. అసలు అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ విషయాలపై దృష్టి పెట్టే ఓపికా, సమయం ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు.



**బ్రిటన్ ప్రధాని స్టార్‌మర్‌పై ధ్వజమెత్తిన ట్రంప్**

బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్‌పై డోనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కలిసి రావడంలేదని విమర్శించారు. సైప్రస్‌లో ఉన్న బ్రిటన్ స్థావరాన్ని దాడులకోసం పరిమితంగా అమెరికా ఉపయోగించుకోవచ్చునని తొలుత ప్రకటించిన స్టార్‌మర్ ఆ తర్వాత ఇరాన్ భీకరదాడులతో వెనక్కు తగ్గారు. సైప్రస్ స్థావరాన్ని బ్రిటన్ బృందం ఖాళీ చేసి వెళ్ళిపోయింది. ఈ పరిస్థితుల్లో స్టార్‌మర్ తాజా ప్రకటన చేస్తూ, ఇరాన్ యుద్ధంలో తాము జోక్యం చేసుకోవడంలేదని స్పష్టం చేశారు. అమెరికాతో కలిసి యుద్ధంలో పాల్గొనకూడదన్న నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఐతే తాము ఆత్మరక్షణ చర్యలు మాత్రం తీసుకుంటామన్నారు. దీంతో ట్రంప్ తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని తాను అనుకోలేదని, ఈ సంబంధాలు సరిగ్గా ఉన్నట్లు లేదన్నారు.

## తెలంగాణ వాసులు (మొదటి పేజీ తరువాయి)

కార్మికులు, వ్యవసాయ కూలీలు, కేర్‌గివర్స్‌గా పనిచేస్తున్న పలువురు తెలంగాణ వాసులు ప్రస్తుతం ఈ నియమాలను కచ్చితంగా పాటిస్తున్నారు. కొంతమంది తమ పని ప్రదేశాల దగ్గరే ఏర్పాటు చేసిన భద్రతా గదుల్లో ఆశ్రయం పొందుతున్నారు. సైరన్ శబ్దం వినగానే గుండె దడ పెరుగుతోంది. కానీ బంకర్‌లోకి చేరాకే ఊపిరి పీలుస్తాం, అని వరంగల్‌కు చెందిన ఒక కార్మికుడు ఫోన్‌లో తన కుటుంబానికి తెలిపిన మాటలు హృదయాన్ని తాకుతున్నాయి. తెలంగాణలోని వారి కుటుంబ సభ్యులు రోజూ టెలిఫోన్, వీడియో కాల్స్ ద్వారా పరిస్థితి తెలుసుకుంటున్నారు. ప్రతి సారి కాల్ రాగానే అక్కడ పరిస్థితి ఎలా ఉంది? అనే ఒక్క ప్రశ్నే ముందుంటోంది. గ్రామాల్లో, పట్టణాల్లో తల్లిదండ్రులు, భార్యలు, పిల్లలు టీవీ వార్తలు చూస్తూ ఆందోళన చెందుతున్నారు.ఇజ్రాయిల్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి నివాస సముదాయం లో భద్రతా గదులు, భూగర్భ బంకర్లు ఏర్పాటు చేసింది. తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు, కొన్నిచోట్ల ఇంటర్నెట్ కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో బంకర్ నిర్మాణం తప్పనిసరి. ఈ బంకర్లలో ఎసితో పాటు హీట్ మిషన్‌లను కూడా ఏర్పాడు చేశారు.

**భారత దౌత్య కార్యాలయం అప్రమత్తం..**

ఇజ్రాయిల్‌లోని భారత రాయబారి కార్యాలయం పరిస్థితిని సమీక్షిస్తూ భారత పౌరులకు భద్రతా సూచనలు జారీ చేసింది. అత్యవసర సంప్రదింపు నంబర్లు, సమీప సురక్షిత ప్రాంతాల వివరాలు అందిస్తోంది. అవసరమైతే తరలింపు చర్యలు చేపట్టే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

**యుద్ధం – సాధారణ ప్రజల బాధ :** దేశాల మధ్య జరిగే యుద్ధం కేవలం రాజకీయ లేదా సైనిక అంశం మాత్రమే కాదు; విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన సాధారణ ప్రజల జీవితాలను కూడా కుదిపేస్తుంది. ఒకవైపు రాకెట్ సైరన్లు, మరోవైపు కుటుంబాల ఆందోళన – ఈ రెండింటి మధ్య తెలంగాణ కార్మికులు ధైర్యంగా నిలబడేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆకాంక్ష ఒక్కటే – పరిస్థితి త్వరగా శాంతించాలి, భద్రంగా తిరిగి తమ కుటుంబాల వద్దకు చేరుకోవాలి.

## మనోళ్లొచ్చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు ప్రత్యేక విమానాలను నడుపుతామని స్పైస్ జెట్ ప్రకటించింది. యుఎఇ నుంచి భారత్‌కు పాక్షికంగా విమాన సర్వీసులు ప్రారంభమైన విషయాన్ని తెలుపుతూ భారత విదేశాంగ శాఖకు చెందిన ప్రవాస భారతీయుల తరలింపు విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది.

**దుబాయ్ ఎయిర్‌పోర్టుల నుంచి పరిమిత విమాన సర్వీసులు : కేంద్రం**

భారత్ యుఎఇ మధ్య నడిచే రెగ్యులర్ విమాన సర్వీసుల్లో చాలావరకు ఇప్పటికీ సస్పెన్షన్ దశలోనే ఉన్నాయని భారత విదేశాంగ శాఖకు చెందిన ప్రవాస భారతీయుల తరలింపు విభాగం పేర్కొంది. మార్చి 2వ తేదీ సాయంత్రం నుంచి యుఎఇ,భారత్ మధ్య పరిమిత సంఖ్యలో విమాన సర్వీసు లు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. యుఎఇలోని దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, దుబాయ్ వరల్డ్ సెంట్రల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుల నుంచి భారత్‌కు విమాన సర్వీసులు నడుస్తున్నాయని తెలిపింది. దుబాయ్‌లోని ఈ రెండు ఎయిర్‌పోర్టులను పూర్తిగా మూసివేయలేదని, కానీ వాటిలోకి ప్రవేశించే ప్రయాణికులను కఠినంగా స్క్రీనింగ్ చేస్తున్నారని విదేశాంగ శాఖ చెప్పింది. ఇక భద్రతాపరమైన ముప్పు కారణంగా యూఏఈలోని మిగతా ఎయిర్‌పోర్టులను మూసివేసి ఉంచారని తెలిపింది. ఇక ఇవే వివరాలతో దుబాయ్‌లోని రెండు ఎయిర్‌పోర్టులు కూడా అధికారిక ప్రకటనలు విడుదల చేశాయి.

**నేను ఇంటికి చేరుకున్నా- వాళ్లందరికీ థ్యాంక్స్: పివి సింధు**

యుఎఇ గగనతలం మూసివేత కారణంగా కొన్ని రోజులు దుబాయ్‌లో ఇరుక్కుపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు స్వదేశానికి చేరుకున్నారు. తాను సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నాను అంటూ ఆమె ట్వీట్ చేశారు. దుబాయ్‌లో కొన్ని రోజుల పాటు అనిశ్చితిలో, ఆందోళనతో గడపాల్సి వచ్చిందన్నారు. ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నందుకు సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. విమానాశ్రయాల గ్రౌండ్ టీమ్స్, దుబాయ్ అధికార వర్గాలు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ విభాగాలు, కష్టకాలంలో తన బాగోగులను చూసిన వ్యక్తులందరికీ పివి సింధు థ్యాంక్స్ చెప్పారు. ప్రస్తుతానికి రెస్ట్ తీసుకోవడం, తదుపరి పోటీలకు సిద్ధం కావడం, భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకోవడంపై ఫోకస్ చేస్తానన్నారు.

## తటస్థం కాదు... పరాజయం

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రచురితమైన తన ఆర్టికల్‌లో సోనియాగాంధీ నైతిక బలాన్ని 'మనం తిరిగి కనుగొనాల్సిన' అవసరం ఉందని, అంతేకాకుండా స్పష్టత, నిబద్ధతతో దానిని వ్యక్తపరచాల్సిన ఆవశ్యకత కూడా ఎంతైనా ఉందని ఆమె నొక్కిచెప్పారు. 'మార్చి 1న ఇరాన్ 'సుప్రీం లీడర్' అయతుల్లా ఖమేనీ సయ్యద్ అలీ హుస్సేనీ అంతకుముందు రోజు అమెరికాఇజ్రాయెల్ దేశాలు రెండూ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో హత్య చేయబడ్డారని ధృవీకరించబడింది. కొనసాగుతోన్న చర్చ ల మధ్యలో ఒక ప్రస్తుత దేశాధినేతను చంపడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాలలో చీలికను తెస్తుంది' అని సోనియాగాంధీ చెప్పారు. ఈ సంఘటన దిగ్భ్రాంతికి గురిచేసిన నేపథ్యంలో న్యూఢిల్లీ నిశ్శబ్దం కూడా అంతే స్పష్టంగా ఉందని సోనియాగాంధీ చెప్పారు. భారత ప్రభుత్వం ఖమేనీ హత్యను లేదా ఇరాన్ సార్వభౌమాధికార ఉల్లంఘనను ఖండించడం మానుకుందని ఆమె గుర్తుచేశారు. 'ప్రారంభంలో అమెరికాఇజ్రాయెల్ మూకుమ్మడి నరమేధాన్ని విస్మరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ యుఎఇపై ప్రతీకార దాడిని ఖండించడానికి మాత్రమే పరిమితం అయ్యారు. దానికి ముందు జరిగిన క్రమాన్ని కూడా ప్రస్తావించలేదు. ఆ తర్వాత ఆయన లోతుగా ఆందోళన, సంభాషణ, దౌత్యం గురించి చాలా స్పష్టంగా మాట్లాడారు. అమెరికాఇజ్రాయెల్ ప్రారంభించిన భారీ మూకుమ్మడి రెచ్చగొట్టని దాడులకు అదే సరైన కారణం' అని గాంధీ చెప్పారు. ఒక విదేశీ నాయకుడిని లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం వల్ల మన దేశం వైపు నుంచి సార్వభౌమత్వాన్ని లేదా అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా సమర్థించుకోలేనప్పుడు, అది మన విదేశాంగ విధానం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతుందని సోనియాగాంధీ తన ఆర్టికల్‌లో ప్రస్తావించారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం నుంచి సూత్రప్రాయమైన అభ్యంతరం లేకుండా ఇలాంటి చర్యలు జరిగితే,అంతర్జాతీయ నిబంధనల కోతను సాధారణీకరించడం సులభతరం అవుతుందని ఆమె అన్నారు. ఖమేనీ హత్య జరగాడానికి కొన్నిగ ంట ల సమయానికి ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ నుంచి తిరిగి వచ్చారని, అక్కడ బెంజమిన్ నెతన్యాహూ ప్రభుత్వానికి తన స్పష్టమైన మద్దతును ఆయన పునరుద్ఘాటించారని ఆమె గుర్తుచేశారు. ప్రపంచంలోని దక్షిణాదిలో ఎక్కు భాగం ప్రధాన శక్తులుగా ఉన్న రష్యా, చైనా వంటి బ్రిక్స్‌లో భాగస్వామ్యదేశాలు దూరం పాటించిన సమయంలో భారతదేశం నైతిక స్పష్టత లేకుండా భారత దేశం ఉన్నత స్థాయి రాజకీయ ఆమోదం కనిపించే ఇబ్బందికరమైన నిష్క్రమణను సూచిస్తున్నదని సోనియాగాంధీ అన్నారు. ఈ సంఘటన పరిణామాలు భారతదేశ వైఖరి ఈ విషాదానికి నిశ్శబ్ద ఆమోదాన్ని సూచిస్తోందని మోదీ అవలంభించిన వైఖరిని సోనియాగాంధీ ఎత్తిచూపారు. గ్లోబల్ సౌత్ దేశాలు తమ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి భారతదేశాన్ని ఎందుకు విశ్వసించాలని సోనియాగాంధీ ప్రశ్నించారు. నేటికీ ఆ సూత్రాన్ని సమర్థించడానికి వెనకాడుతోందన్నారు. దీనిపై పార్లమెంట్ సమావేశాలలో చర్చించాల్సిన అవసరం ఉందని సోనియాగాంధీ తెలిపారు. ఒక విదేశీ దేశాధినేతను లక్ష్యంగా చేసుకుని హత్యచేయడం అంతర్జాతీయ నిబంధనలను తుడిచిపెట్టడం, పశ్చిమ దేశాలలో పెరుగుతున్న అస్థిరత పరిధీయ విషయాలపైనే కాదు, అవి భారతదేశ వ్యూహాత్మక అంతర్భాగం, నైతిక నిబద్ధతలను నేరుగా తాకుతున్నాయని సోనియాగాంధీ నొక్కిచెప్పారు.

## దద్దరిల్లుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా బేస్ కమాండ్ బిల్డింగ్‌ను ఐఆర్‌జిసి ధ్వంసం చేసింది. కువైత్‌లో ఉన్న ఆరిఫ్ జాన్ సైనిక స్థావరంపై ఇరాన్ చేసిన 10 డ్రోన్ల దాడుల్లో ఆరుగురు అమెరికా సైనికులు మరణించినట్లు అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ధృవీకరించారు. ఒక శక్తిమంతమైన ఆయుధం అమెరికా స్థావరాన్ని దెబ్బతీసిందని మాత్రమే ఆయన చెప్పారు. వివిధ నౌకలపై ఇరాన్ ఇప్పటివరకూ చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. మరో వైపు మక్కా, మదీనా యాత్రకు వెళ్ళిన 9000 మంది ఇరాన్ యాత్రికులను వెనక్కు తీసుకువచ్చేందుకు ఇరాన్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. యాత్రికులను సురక్షితంగా వారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేసిందని సౌదీఅరేబియాలో ఇరాన్ దౌత్యవేత్త అలిరెజా ఎనయతి మంగళవారం చెప్పారు.

టెహ్రాన్ హకిమియేహ్ పారిశ్రామిక వాడ ప్రాంతంలో ప్రజలు ఖాళీచేసి వెళ్ళాలని ఐడిఎఫ్ ముందస్తు హెచ్చరికలు చేసింది. ఇరాన్ సుప్రీం కౌన్సిల్ భవన సముదాయంపైన, ప్రభుత్వటీవీ కార్యాలయంపైన భారీ దాడులు చేసినట్లు తెలిపింది. సైనిక శిక్షణాసంస్థ, ఇతర అదనపు మౌలిక సదుపాయయాలపై దాడులతో బీభత్సం సృష్టించింది. ఇరాన్ నాయకత్వ కార్యాలయ భవన సముదాయంపై దాడులు చేసినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. గతంలో ఖమేనీ ఈ కార్యాలయ కాంపౌండ్‌ను ఉపయోగించారని తెలిపింది. ఐతే ఖమేనీ తన సొంత కార్యాలయ భవనంలోనే దాడుల్లో హతులయ్యారు. కాగా హమ్‌దాన్ నగరంలో ఐడిఎఫ్ దాడుల్లో ఐదుగురు ఇరాన్ పౌరులు మరణించారు.

టెహ్రాన్ తూర్పున పార్డిస్ ప్రాంతం పేలుళ్ళతో దద్దరిల్లింది. గడచిన 48 గంటల్లో ఇరాన్‌లోని 1250 కేంద్రాలను ధ్వంసం చేశామని, ఇందులో రివల్యూషనరీ గార్డ్స్ కేంద్ర కార్యాలయం కూడా ఉందని తెలిపింది. ఈ శాటిలైట్ ఇమేజస్ అన్నీ పాశ్చాత్య పత్రికలు ప్రచురించాయి. అదేవిధంగా ఒక ఆయుధ కంపెనీపైసహా సెంట్రల్ ఇరాన్‌లో దాడులు చేసింది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలపై దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. ఒక్క మంగళవారం నాడే ఇరాన్‌లో 11 మంది సైనికులు, మరో 85 మంది సామాన్య పౌరులు మరణించారు. నాలుగు రోజుల యుద్ధంలో మొత్తం 787 మంది ఇరానీయులు మరణించారు. 172 ఇరాన్ క్షిపణులు కూల్చేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రటించింది. 79 క్షిపణులను, 59 డ్రోన్లను కనిపెట్టి అడుకున్నట్లు బహ్రైన్ ప్రకటించింది.

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై దాడులను పెంచింది. విమానాల రాకపోకలు నాలుగోరోజు కూడా నిలిచిపోయాయి. పశ్చిమాసియాను వదిలిపెట్టి రావాలని ప్రత్యేకించి 12 దేశాలలో ఉన్న అమెరికాపౌరులకు విదేశీమంత్రిత్వశాఖ విజ్ఞప్తి చేసింది. 15 దేశాలలో ఉన్న అన్ని వాణిజ్య మార్గాలను ఉపయోగించుకుని స్వదేశం చేరుకోవాలని కోరింది. అదేవిధంగా ఒమన్ నుండి ప్రత్యేక ఛార్టర్ విమానాన్ని ఏర్పాటు చేస్తున్నామని దానిని ఉపయోగించుకోవాలని కోరింది.జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో ఉన్న దౌత్యకార్యాలయాన్ని కూడా అమెరికా ప్రభుత్వం ఖాళీ చేసింది. ఒక అమెరికా సైనికులు అత్యవసరంగా కువైత్‌లో పార్యాచ్యూట్ ద్వారా కిందికి దిగాడు. దీంతో స్థానిక ప్రజలు వచ్చి అతడితో వాగ్వాదానికి దిగారు. తన ప్రాణరక్షణకోసం తాను ప్యారాఛూట్‌లో దిగానని ఆ సైనికుడు వాదించాడు. చివరకు అతడు స్థానికులకు క్షమాపణచెప్పి మోకరిల్లి ఆశ్రయం పొందాడు. ఐతే భారత్ జెండా ఉన్న నౌకలపై ఇరాన్ దాడులలు చేసిన దాఖలాలు లేవు. ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులను నివారించడంలో ఇజ్రాయెల్ గగనతలానికి పెట్టుకున్న ఐరన్ డోమ్ విఫలమైంది. ఇజ్రాయెల్‌లో పలు ప్రాంతా లు విధ్వంసాలను చవిచూశాయి.పలువురు పౌరులు గాయపడ్డారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని ప్రభుత్వం కోరింది. బాగ్దాద్ విమానాశ్రయం సమీపంలో అమెరికా బలగాలపై ఇరాన్ అనుకూల ఉగ్రవాద గ్రూపు దాడులు చేసింది. సోమవారం రాత్రి నుండీ మంగళవారం తెల్లారులూ బాంబుదాడులు జరుగుతూనే ఉన్నాయి.

**దాడులఖర్చు 210 బిలియన్ డాలర్లు**

ఈ దాడుల వ్యయాన్ని 210 బిలియన్ డాలర్లుగా నిపుణులు అంచనావేసినట్లు నివేదికలు వెల్లడించాయి.ఒక్క అమెరికా దేశమే మిలిటరీ ఆప్షన్స్‌కు 65 బిలియన్ డాలర్లు ఖర్చుచేసిందని అంచనా.

ఆర్మీకి ట్రంప్ ఖర్చుపెట్టే ప్రతిరూపాయి అమెరికా టాక్స్‌పేయర్లు చెల్లించే సొమ్మే. ఈ రూపేణా చూస్తే అమెరికాకు 115 బిలియన్ డాలర్లు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని అంచనా. ఐతే ఇప్పుడు ట్రంప్ పాలనా యంత్రాంతం మరిన్ని నిధులకోసం అమెరికా కాంగ్రెస్‌ను ఆశ్రయించాల్సి ఉంది.

## వామపక్షాల నిరసన (మొదటి పేజీ తరువాయి)

నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని మండిపడ్డాయి. ఈ ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్; సిపిఐ ఢిల్లీ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి, జాతీయ కార్యనిర్వాహక సభ్యురాలు ప్రొఫెసర్ దినేష్ వర్ష్నే; సిపిఐ(ఎం) సీనియర్ నాయకురాలు బృందా కారత్; సిపిఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా; సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య; ఆర్‌ఎస్‌పి కార్యదర్శి ఆర్ఎస్ డాగర్; ఎస్‌యుసిఐ కార్యదర్శి ప్రాణ్ శర్మ; సిజిపిఐ బిర్జు నాయక్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసంగించారు. సిపిఐ ఢిల్లీ రాష్ట్ర నాయకులు, ఎఐటియుసి, ఎఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు వంటి ప్రజా సంఘాల ప్రతినిధులు కూడా సంఘీభావం తెలిపారు. వందలాదిమంది వామపక్ష కారకర్తలు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దాడికి వ్యతిరేకంగా నిలబడాలని, ఇరాన్ ప్రజలకు సంఘీభావం తెలియజేయాలని వారు ప్రజలను కోరారు. ఇరాన్‌పై దాడి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద గూండాయిజంపై భారత ప్రభుత్వం మౌనం వహిస్తుందని, నరేంద్ర మోదీ ఎందు కు మౌనంగా ఉన్నారు? అని సిపిఐ(ఎం) నాయకురాలు బృందా కారత్ ప్రశ్నించారు. అతను నెతన్యాహూ రక్తంతో తడిసిన చేతులను పట్టుకుని, ఇది భారత ప్రజల గొంతు అని అన్నారని, మరి ఇది ప్రజల గొంతు ఎలా అవుతుందని నిలదీశారు. ఆయన జాతి నిర్మూలనకు సహాయం చేయడానికే ఇజ్రాయెల్‌కు వెళ్లారని మండిపడ్డారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ నుండి తిరిగి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్‌పై దాడి జరిగిందని కరత్ అన్నారు. మీరు దాడిపై ఆమోదముద్ర వేయడానికి అక్కడికి వెళ్లారా?' ఇజ్రాయెల్ ప్రధానమంత్రి గాజాను పూర్తిగా నాశనం చేయాలనుకుంటున్నారా' అని ఆమె ప్రశ్నించారు. అమెరికా, జియోనిస్ట్ ఇజ్రాయెల్ బెదిరింపులకు వ్యతిరేకంగా తాము తమ గొంతులను లేవనెత్తుతున్నామని, నరేంద్ర మోదీ భారతదేశ ప్రధానమంత్రి తమ డిమాండ్ అని, భారతదేశ విదేశాంగ విధానానికి కొన్ని సూత్రాలు ఉన్నాయన్నారు. విదేశీ సంబంధాలను జాతీయ సార్వభౌమాధికారం కోణం నుండి మోదీ చూడాలని అన్నారు. మీరు ట్రంప్‌కు తలవంచి, ఈ అంశంపై మౌనంగా ఉంటే జాతీయ సార్వభౌమాధికారం గురించి ఏమిటి అని, ఇది సామ్రాజ్యవాద అనుకూల విదేశాంగ విధానమని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సైనిక ఉధృతికి వ్యతిరేకంగా, జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని డిమాండ్ చేయడానికి ఆందోళన చెందుతున్న పౌరులు, కార్యకర్తలు, పౌర సమాజ సభ్యులను ఈ నిరసన ఏకతాటిపైకి తీసుకువస్తుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నిరసనలో పాల్గొన్న సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య భారత ప్రజలు ఈ యుద్ధాన్ని కోరుకోవడం లేదని ఉద్ఘాటించారు. 'గత నాలుగు రోజులుగా ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతోంది. చర్చలు జరుగుతున్నాయి, కానీ అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేశాయి. గత సంవత్సరం 12 రోజుల యుద్ధాన్ని మనం చూశాము, ఇప్పుడు అది ప్రాంతీయ యుద్ధంగా మారే దిశగా కదులుతోంది అని ఆయన అన్నారు. యుద్ధాన్ని ఆపడానికి, శాంతిని పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మోదీ జీ ఇజ్రాయెల్‌కు తిరిగి వచ్చిన తర్వాత యుద్ధం ప్రారంభమైందని, ఈ యుద్ధంలో భారతదేశానికి ఎటువంటి పాత్ర లేదని నిర్ధారించుకోవడం తమ బాధ్యత అని భట్టాచార్య అన్నారు. భారత ప్రజలు యుద్ధం కోరుకోరని, ఇరాన్‌లో అత్యున్నత నాయకుడు దారుణ హత్యకు గురికావడాన్ని అందరం చూశామని, ఆయన ఇరాన్ అత్యున్నత నాయకుడు మాత్రమే కాదు; షియా (ముస్లింలు)ల అతిపెద్ద మత నాయకుడు కూడా అని చెప్పారు. ఒక ప్రాథమిక పాఠశాలపై బాంబు దాడి జరిగింది; అమెరికా, ఇజ్రాయెల్ అమాయక పిల్లలను దారుణంగా చంపేశాయని మండిపడ్డారు. 'ఇది భారతదేశంపై కూడా ప్రభావం చూపుతుంది. ఎందుకంటే చాలామంది భారతీయులు పశ్చిమాసియా దేశాలలో పనిచేస్తున్నారు. ఇరాన్‌కు స్నేహపూర్వక, సాంస్కృతిక సంబంధాలతో కూడిన పురాతన నాగరికత ఉంది. ఇజ్రాయెల్ పాలస్తీనాతో యుద్ధం చేసింది, ఇప్పుడు ఇరాన్‌తో కూడా చేస్తుంది. ఇరాన్ తిరిగి పోరాడటానికి సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలుస్తుంది' అని ఆయన అన్నారు, భారత ప్రజలు ఇరాన్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ శనివారం ఇరాన్‌పై పెద్ద దాడిని ప్రారంభించాయి.

### ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే..

## 13న సమ్మె నోటీస్ : ఆర్‌టిసి జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై సర్కార్ తక్షణమే స్పందించాలని లేకపోతే ఈనెల 13న సమ్మె నోటీసు ఇస్తామని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిసికార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే అన్నారు.

జెఎసిఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 న కని విని ఎరుగని రీతిలో చేపట్టిన ఛలో సెక్రటరియేట్ కార్యక్రమంలో ఆర్‌టిసి కార్మికుల, కష్టాలుబాధలను చూసినా ప్రభుత్వం స్పందిస్తుందనే నమ్మకం మాకు ఉందని ఇంకా 10 రోజుల సమయం ఉందని ఈ లోపు ప్రభుత్వం పంతాలు పట్టింపులు విడనాడి ఇచ్చిన హామీలను అమలు చేయాలనిడిమాండ్ చేశారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనంతో పాటు 2021 వేతన సవరణ, 30శాతం ఫిట్మెంట్ తో 2025 పిఆర్‌సికూడ అమలు చేయాలన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల స్థానంలో ఆర్‌టిసి బస్సులు ప్రవేశ పెట్టడంతోపాటు ప్రైవేటు బస్సులకు ఆర్‌టిసి డిపో స్థలాలు ఇవ్వకూడదని, బ్రేడ్ విన్నర్ స్కిం వారిని రెగ్యులర్ చేయాలిలని ఈ ఉద్యోగాలను రెగ్యులర్ పోస్ట్ లల్లో నియమించాలన్న తదితర పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కారంచేయాలన్నారు.

తాము రెండున్నర ఏళ్లుగా పట్టిన తమ ఓపిక నశించిందని తెలిపారు. దీంతో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 13 న జెఎసి సమ్మె నోటిస్ ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. జెఎసిలో లేని సంఘాలకు తెలియజేసి సమ్మె లో భాగస్వామ్యం కావాలని కోరుతూ వారికి జెఎసి లేఖలు వ్రాయడం జరిగిందని తెలిపారు.. తాము సమ్మె వైపు వెళ్లకుండా ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని, ఆర్‌టిసి కార్మికులను దూరం చేసుకోవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# ‘జనగణన -2027’లో భాగంగా

# మే 11వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘జనగణన 2027’లో భాగంగా హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ కార్యక్రమం మే 11వ తేదీ నుంచి ప్రారంభం కానుందని, డిజిటల్ కార్యక్రమంలో భాగంగా, హౌస్ లిస్టింగ్ ప్రారంభానికి 15 రోజుల ముందు నుంచే ‘సెల్ఫ్ ఎన్యుమరేషన్’ ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు తెలిపారు. పౌరులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ వేదిక ద్వారా తమ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి గృహం, నివాస ప్రాంతం, దూర గ్రామాలు, గిరిజన తండాలు, పట్టణ మురికివాడల ప్రాంతాలు ఎవ్వరూ మినహాయింపు కాకుండా పూర్తి స్థాయిలో కవరేజీ కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ప్రత్యేకంగా దుర్భేధ్య, సున్నిత ప్రాంతాలపైన కూడా దృష్టి సారించాలని సూచించారు. డిజిటల్ విధానంలో చేపట్టనున్న ‘జనగణన 2027’ దేశ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలువనుందన్నారు. హైదరాబాద్‌లని బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు అధ్యక్షతన మంగళవారం జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మే 11వ తేదీ నుండి ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సాధారణ పరిపాలన ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్ ప్రియాంకతో పాటు తెలంగాణ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రామకృష్ణ రావు మాట్లాడుతూ ఫీల్డ్ స్థాయిలో డేటా సేకరణ పూర్తిగా ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా చేపట్టనున్నారని, తద్వారా రియల్‌టైమ్ డేటా నమోదు, ఖచ్చితత్వం, పారదర్శకత, వేగవంతమైన ప్రాసెసింగ్ సాధ్యమవుతాయని, ఇది తొలి జనగణనగా నిలుస్తుందని వివరించారు. ఫీల్డ్ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించడం అత్యంత కీలకమని, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని సూచించారు. పూర్తి స్థాయి డిజిటల్ జనగణన విజయవంతం కావాలంటే ఫీల్డ్ సిబ్బంది సన్నద్ధత అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. కాలపట్టికను కచ్చితంగా పాటించాలని, డేటా నాణ్యత ప్రమాణాలను పాటించడం, పారదర్శకత, సాంకేతిక సమన్వయం ప్రతి దశలో నిర్ధారించుకోవాలని సూచించారు. ముందస్తుగానే ఏర్పాట్లను సమీక్షిస్తూ, లాజిస్టిక్ లేదా నిర్వహణ సమస్యలను ముందుగానే పరిష్కరించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**డేటా సేకరణ సజావుగా, సురక్షితంగా జరుగుతుంది : భారతి హోలికేరి**

సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి జనగణన కార్యాచరణ సమగ్ర వివరించారు. రాష్ట్ర స్థాయి నుంచి ఫీల్డ్ స్థాయి వరకు శిక్షణను క్రమబద్ధంగా అందించే ‘ట్రైనింగ్ కాస్కేడ్ మోడల్’ వివరాలను వెల్లడించారు. మొబైల్ ఆధారిత అప్లికేషన్లు, బ్యాక్‌ఎండ్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా సురక్షితంగా, సజావుగా డేటా సేకరణ జరుగుతుందని ఆయన వివరించారు. ఫీల్డ్ స్థాయిలో ఎన్యుమరేషన్ బ్లాకుల ఖరారు, పరిపాలనా సరిహద్దుల ధృవీకరణ, పరికరాల సిద్ధత, స్థానిక అధికారులతో సమన్వయం వంటి ముందస్తు చర్యలపై కూడా కలెక్టర్లకు అవగాహన కల్పించారు.

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి


సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తక్షణమే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల కంటే ముందే వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో నిధులు లేవంటూనే,మరోవైపు కాంగ్రెస్ పార్టీ అవసరాల కోసం రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సుమారు రూ.12లక్షల కోట్ల నిధులను కేటాయించిందని కిషన్‌రెడ్డి తన లేఖలో వివరించారు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలుసుకునే హక్కు ఉందని, అందుకే ప్రభుత్వం వెంటనే ఆర్థిక పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని కిషన్ రెడ్డి తన లేఖలో సిఎంను డిమాండ్ చేశారు.

### అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని

## ప్రధాని మోదీ ఖండించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తక్షణమే ఖండించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాద ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా బెంబేలెత్తే పరిస్థితి దాపురించిందని, ప్రత్యేకించి గల్ఫ్ దేశాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నరన్నారు. యుద్ధం కారణంగా గల్ఫ్‌దేశాల్లో నివసిస్తూ దాదాపు 1 కోటి మంది భారతీయులు యుద్ధ భయంతో ఆందోళన చెందుతున్నారు. మన దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ యుద్ధోన్మాద చర్యలను ఖండించకుండా, పరోక్షంగా దీన్ని సమర్థించే వైఖరి అవలంభించడం సరైంది కాదన్నారు. ఇటీవల్లే ప్రధాని మోదీ ఇజ్రాయెల్లో పర్యటించి, అక్కడి పార్లమెంటులో మాట్లాడడం, వెనువెంటనే యుద్ధం ప్రారంభం కావడం పలు అనుమాలకు తావిస్తోందని రామకృష్ణ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్రమోదీ స్పందించి అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని భారతదేశం తరపున ఖండించాలని సిపిఐ డిమాండ్ చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా ఇకనైనా అమెరికా యుద్ధాన్ని ఆపి, తన యుద్ధోన్మాద చర్యలను ఉపసంహరించుకోవడంతో పాటు తక్షణమే వివిధ దేశాల సార్వభౌమత్వాలను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలంతా గళమెత్తి అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దుశ్చర్యలను ఖండించాలని కోరారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావాలని రేవంత్ ప్రతిపాదనకు మల్లు రవి మద్దతు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశానికి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎంపి మల్లు రవి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన డిసిసి శిక్షణా ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీని ప్రధానిగా ప్రతిపాదించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. రాహుల్ గాంధీకి గతంలో రెండు సార్లు ప్రధానమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆసక్తి చూపలేదని తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని తరువాత పాలకుడిగా బాధ్యతలు స్వీకరించాలని ఆయన భావించారని చెప్పారు. పార్లమెంట్‌లో అనేక జాతీయ సమస్యలపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని తాము సమీపంగా గమనిస్తున్నామని మల్లు రవి అన్నారు. ప్రతిపక్ష నేతగా దేశ సమస్యలపై ఆయన అద్భుతంగా పోరాడుతున్నారని కొనియాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో, న్యాయ యాత్రల ద్వారా దేశమంతా పాదయాత్ర చేసి సామాజిక సమస్యలపై పూర్తి అవగాహన తెచ్చుకున్నారని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి వారి వాటా మేరకు ఫలాలు అందాలనే ఆశయంతో ఆయన ఉద్యమిస్తున్నారని తెలిపారు.రాహుల్ గాంధీ ఆశయాలను అమలు చేయాలనే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేపట్టి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని మల్లు రవి వెల్లడించారు. రాహుల్ గాంధీ కుటుంబం పేదరిక నిర్మూలన కోసం కృషి చేసిందని గుర్తు చేస్తూ, ఆయన తండ్రి, నానమ్మ, ముత్తాతలు ప్రధాన మంత్రులుగా సేవలందించినప్పటికీ రాహుల్ గాంధీకి వ్యక్తిగతంగా పదవిపై ఆసక్తి లేదని తెలిపారు. ఇప్పటి పరిస్థితుల్లో దేశానికి రాహుల్ గాంధీ సేవలు అత్యంత అవసరమని పేర్కొంటూ, ఆయనను ప్రధానిగా ప్రతిపాదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంపీల ఫోరమ్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

### అవాస్తవాలు మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు

జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ నేతలు అవాస్తవాలు మాట్లాడొద్దని లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల గ్రామంలో 10 ఏళ్లగా అక్కడ నివసిస్తున్న దాదాపు 700 కుటుంబాలను బయటికి పంపించి వేలాది మంది పోలీసులతో, బుల్డోజర్లతో వారి ఇళ్లను ఇండ్లను కూల్చివేయడం వాస్తవం కాదాని ఆయన భువనగిరి ఎంపి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్ రాజ్యాన్ని నడుపుతోందని ప్రస్తావించడంలో తప్పేందన్నారు.

ఈ ఘటను నిరసిస్తూ నిరుపేద బాధితులు ఉద్యమాలుకొనసాగించడం ఈ పోరాటాలు ఎంపికి కనిపించకపోవడం, వినిపించడం లేదా అన్ని అన్నారు. ఇకనైనా అవాస్తవాలు మాని బాధితులకు న్యాయం చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

### ‘‘వెల్ డన్’’ మహేశ్ అంటూ

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశంసలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘‘వెల్ డన్ ’’ మహేశ్ అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ప్రశంసలు అందుకున్నారు. వికారాబాద్‌లో 10 రోజుల పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ శిబిరాన్ని విజయవంతం నిర్వహించడంతో మంగళవారం ముగింపు కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడి కృషిని రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ప్రశంసించడంతో సభలో చప్పట్ల వర్షం కురిపించింది.

డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం నిర్వహణలో మహేశ్ గౌడ్ స్వయంగా పాల్గొని, 10 రోజుల పాటు అన్ని కార్యక్రమాలను సమన్వయం చేస్తూ దగ్గరుండి పర్యవేక్షించిన విధానం పార్టీ శ్రేణుల్లో స్ఫూర్తి నింపింది. శిబిరం ప్రతి రోజు కార్యక్రమాల రూపకల్పన నుంచి అమలు వరకు ఆయన చూపిన పట్టుదల, క్రమశిక్షణ నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.

ముగింపు కార్యక్రమం సందర్భంగా సంఘటన సృజన్ ప్రోగ్రామ్ చైర్మన్ సచిన్ రావ్ మాట్లాడుతూ, మహేశ్ కుమార్ గౌడ్ 10 రోజుల పాటు పూర్తిగా శిబిరానికి హాజరై ప్రతి సెషన్‌ను సమర్థంగా నిర్వహించారు అని ప్రశంసించారు. వెంటనే స్పందించిన రాహుల్ గాంధీ వెల్ డన్ మహేష్ అంటూ అభినందించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరపాలి

హెచ్‌సిఎకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్ వద్ద ధర్నా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో జరిగిన రూ.68.73 కోట్ల భారీ నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, విశాఖ ఇండస్ట్రీస్ నుంచి సొమ్మును వెనక్కి తీసుకుని గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టిడిసిఎ) అధ్యక్షుడు, మాజీ స్పోర్ట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రూ. 4 కోట్లు ఇచ్చి.. రూ.68.73 కోట్లు కొల్లగొట్టిన దొంగల ముఠాను హెచ్‌సిఎ నుంచి తరిమికొట్టాలని అల్లీపురం అన్నారు. మంగళవారం జింఖానా గ్రౌండ్‌లో హెచ్‌సిఎ అధ్యక్షుడి సమావేశం జరుగుతున్న సమయంలో.. అల్లీపురం ఆధ్వర్యంలో టిడిసిఎ శ్రేణులు మెరుపు ధర్నాకు దిగాయి. హెచ్‌సిఎ నిధులు వెనక్కి రాకుంటే, రాష్ట్ర వ్యాప్తంగా టిడిసిఎ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

# విషపూరిత ‘పారాక్వాట్’ గడ్డి మందును నిషేధించండి

దేశంలో కేంద్రం పూర్తిగా నిషేధించాలి

అప్పటి వరకు తమ పరిధిలో ఉన్న 60 రోజుల నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం విధించాలి

‘ఐఎంఎ రౌండ్ టేబ్ల్ సమావేశం తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అత్యంత ప్రాణాంతకమై, విషపూరితమైన ‘పారాక్వాట్ గడ్డి మందు’ను దేశ వ్యాప్తంగా నిషేధించాలని, అప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న 60 రోజుల పాటు నిషేదాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంఐ) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌లేబుల్ సమావేశం తీర్మానం చేసింది. పారాక్వాట్‌ను నిషేధించే అంశాన్ని పార్లమెంట్‌లో, ఎంపిలు, తెలంగాణ శాసనసభలో ఎంఎల్‌ఎలు ప్రస్తావించాలని విజ్ఞప్తి చేసింది. పారాక్వాట్ గడ్డిమందును సేవించినవారికి ఎంత చిక్సిత చేసినా ప్రయోజనం ఉండబోదని, ఈ రసాయనల ద్వారా శరీరంలోని అవయవాలు అత్యంత వేగంగా దెబ్బతింటాయని, ఆ తర్వాత పేషంట్‌ను రక్షించడం అసాధ్యమైన విషయమని పలువురు వక్తలు, వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐఎంఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదకరమైన ‘పారా క్వాట్ డైక్లోరైడ్ ’ పురుగుల మందు నిషేధంపైన కోఠిలోని ఐఎంఎ కార్యాలయంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, బిజెపి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, కాంగ్రెస్ వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మనకొండూరు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు బి.సురేష్ రెడ్డి, బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ , తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సలహాదారు దుంతి నర్సింహారెడ్డి హాజరయ్యారు. అత్యంత ప్రమాకరమైన పారాక్యాట్ డైక్లోరైడ్‌ను నిషిధించే వరకు అందరూ కలిసికట్టుగా ప్రయత్నించాలని, ఈ విషయాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని వారు తెలిపారు. పారాక్వాట్ గడ్డి మందు వంద శాతం విషపూరితమని, దీనికి ఎటువంటి ప్రత్యామ్నాయ విరుగుడు మందు (యాంటీడోస్ ) లేదని వైద్యులు వివరించారు. ఇప్పటికే 70కి పైగా దేశాలలో పారాక్వాట్ మందును నిషేధించాయని, దక్షిణ కొరియాలో నిషేధించిన తర్వాత ఆత్మహత్యలతో మరణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని వెల్లడించారు. రసాయనాలను రాష్ట్రంలో కేవలం ఆరు నెలలపాటు మాత్రమే నిషేధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నదని, ఇందులో భాగంగానే ఇప్పటికే కేరళ, ఒడిశా రాష్ట్రాలు ఈ మందును నిషేధించాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ టి.దయాల్ సింగ్, డాక్టర్ డి. ద్వారకనాథ రెడ్డి, కరీంనగర్ ఎస్‌యుడిఎ చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గంగాధర్, గాంధీ ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ టి. కృపాల్ సింగ్, టిజిఎంసి వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్, డిఎపిపి అధ్యక్షుడు డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి , ఉపాధ్యక్షుడు డాక్టర్ రాకేష్ చెన్నా,డాక్టర్ సన్నీ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం: కోదండరెడ్డి :**

పారాక్వాట్ గడ్డి మందును నిషేధించే అంశాన్ని తెలంగాణ వ్యవసాయ, రైతుకమిషన్ తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని కోదండరెడ్డి తెలిపారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిణామలన్నీ రాజకీయాలు, రాజకీయ పార్టీల చుట్టే తిరుగుతున్నాయని, సమాజం, సామాజిక, సమాజ అంశాలపైన కూడా దృష్టి పెట్టాల్సిన అసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. కడియం కావ్య మాట్లాడుతూ పారాక్వాట్‌పైన నిషేధం విధించే అంశాన్ని రాష్ట్రంలోని బిజెపి, ఇతర ఎంపిలను కలుపుకుని కేంద్ర వ్యవసాయ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తామన్నారు. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పారాక్వాట్ మందును నిషేధించే అంశాన్ని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆరు నెలల పాటు నిషేధించే జివోను విడుదల చేసేందుకు తన వంతు ప్రయత్నిస్తానని హామీనిచ్చారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పారాక్వాట్ మందును నిషేధించే అంశంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాస్తే,8 రాష్ట్రాలు స్పందించలేదని వివరించారు.

# ‘క్యూర్’లో ఇంజనీరింగ్ సిబ్బంది కొరత

### ప్రాజెక్ట్‌ల అభివృద్ధి పనులకు బ్రేక్?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) పరిధిలోని మూడు కార్పొరేషన్ ప్రాంతంగా రూపుదిద్దుకున్న కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బంది కొరత నెలకొనడంతో కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై అనిశ్చితి నెలకొంది. అవసరానికి అనుగుణంగా కొత్త నియామకాలు చేపట్టకపోవడం, విస్తరించిన భౌగోళిక పరిధికి అనుగుణంగా సిబ్బంది పెంపు జరగకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

**విస్తరించిన పరిధి – పెరగని సిబ్బంది**

పాత జిహెచ్‌ఎంసి పరిధి మాత్రమే కాకుండా, ఇటీవల విలీనం చేసిన 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లతో కలిపి విస్తరించిన ప్రాంతమంతా ఇప్పుడు క్యూర్ పరిధిలోకి వచ్చింది. అయితే, ఈ విస్తరణకు తగిన విధంగా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నియామకాలు జరగలేదు. ప్రస్తుతం మూడు కార్పొరేషన్లు, జిహెచ్‌ఎంసి, మల్కాజిగిరి, సైబరాబాద్ కలిపి కేవలం 500 మందికి పైగా ఇంజనీరింగ్ సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో 300 మందికి పైగా ఎఈ, ఎఈఈ స్థాయిలో ఉండగా, దాదాపు 170 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డిఈఈ) ఉన్నారు. నిపుణుల అంచనాల ప్రకారం, మొత్తం క్యూర్ ప్రాంతానికి కనీసం 600 మందికి పైగా ఇంజనీర్లు అవసరం.

**కొత్త బాధ్యతలు – పాత వనరులు**

ఇటీవలి పరిపాలనా మార్పులతో సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం), వీధి దీపాల నిర్వహణ వంటి విభాగాలను కూడా ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. గతంలో చెత్త సేకరణ, రవాణా పనులను ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షించగా, ఎలక్ట్రికల్ విభాగాన్ని విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు నిర్వహించేవారు. ప్రస్తుతం మొత్తం 200 మంది ఇంజనీర్లలో సుమారు 60 మందిని కేవలం ఎస్‌డబ్ల్యూఎం బాధ్యతలకే కేటాయించాల్సి రావడంతో, ఇతర కీలక విభాగాల్లో సిబ్బంది కొరత మరింత తీవ్రతరమైంది.

**14 ఏళ్ల నియామకాల నిలిపివేత ప్రభావం**

దాదాపు 14 సంవత్సరాలుగా ఇంజనీర్ల నియామకాలపై మోరటోరియం అమలులో ఉండటంతో శాఖలో ‘నైపుణ్య శూన్యత’ ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. సీనియర్ అధికారులు పదవీ విరమణ దశలో ఉండగా, మధ్యస్థాయి అధికారులకు తగిన అనుభవం లభించకపోవడం ఆందోళన కలిగించే అంశంగా ఉంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి ఇచ్చినా, బాధ్యతలను పూర్తిగా అవగాహన చేసుకునేలోపు తదుపరి పదోన్నతి లేదా రిటైర్‌మెంట్ సమయం దగ్గరపడుతోంది, అని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

**భారీ ప్రాజెక్టులు – తగిన సిబ్బంది లేదు**

2013లో ఉన్నతాధికారి ఎం.ప్రసాదరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ సిఫార్సుల ప్రకారం, ప్రతి రూ.5 కోట్ల వార్షిక వ్యయ పనులకు కనీసం ఒక అసిస్టెంట్ ఇంజనీర్ లేదా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అవసరం. ప్రస్తుతం ఎస్ఆర్‌డిపి, ఎస్ఎన్‌డిపి, హెచ్ సిటీ వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల కింద వందల కోట్ల రూపాయల పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుల సమర్థవంతమైన అమలుకు తగిన ఇంజనీరింగ్ సిబ్బంది లేకపోవడం ప్రధాన అవరోధంగా మారిందనే చర్చ జరుగుతోంది.

**ఎనిమిది కీలక విభాగాల్లో తీవ్ర లోటు**

ప్రస్తుతం నిర్వహణ, ప్రాజెక్టులు, డిజైన్స్, క్వాలిటీ కంట్రోల్, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రికల్, ఎస్ఎన్‌డిపి వంటి ఎనిమిది విభాగాల్లో సిబ్బంది అత్యవసరం. ప్రధాన కార్యాలయంలోనే మెయింటెనెన్స్ విభాగానికి దాదాపు 50 మంది ఇంజనీర్లు అవసరమని అంచనగా ఉంది.

**తక్షణ చర్యల అవసరం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, తక్షణమే ఇంజనీరింగ్ నియామకాలు చేపట్టకపోతే మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఆలస్యమవడంతో పాటు, సాంకేతిక నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. క్యూర్ ప్రాంతం నగరాభివృద్ధిలో కీలక కేంద్రంగా ఉన్న నేపథ్యంలో, సిబ్బంది కొరత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కనుగొనాలని అధికారులు సూచిస్తున్నారు.

### సామూహిక హోలీ వేడుకలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని యువతతో కలిసి రంగుల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతతో కలిసి ఇలాంటి పండుగలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇలాంటి సామూహిక వేడుకలు యువతలో ఐకమత్యంతో కూడిన సామూహిక భావాన్ని పెంపొందిస్తాయన్నారు. భారతీయ సంస్కృతిలో పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని, విభేదాలను మరిచి అందరూ కలిసిమెలిసి ఉండాలనే సందేశాన్ని ఇస్తాయని రాంచందర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు బండ కార్తీక చంద్రా రెడ్డి, నాయకులు మేకల సారంగపాణి, పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.





## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి):** మండలంలో ఆనంద వాతావరణం నెలకొంది. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా రెండోసారి నియమితులైన కె.శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామమైన పల్లెపహాడుకు విచ్చేసిన సందర్భంగా మండల పరిసర గ్రామాల సర్పంచులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పల్లెపహాడ్ సర్పంచ్ సంగిశెట్టి రాణమ్మ,అమ్మనబోలు సర్పంచ్ కొంపెల్లి సైదులు,బాజ కుంట సర్పంచ్ పల్లగొర్ల రాజు కలిసి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.గ్రామ ప్రజలు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్ కుమార్,మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,సిపిఐ నాయకులు వాసుదేవ్, వనం శీను, పులసాని శ్రీనివాస్ రెడ్డి, దుబ్బ నరసింహ, తీగల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మీడియా రంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని, ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధిగా అకాడమీ పనిచేస్తుందని తెలిపారు.గ్రామ ప్రజలు తనపై చూపుతున్న ప్రేమ,విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 31 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 4వ తేదీ నుండి 31.03.2026 వరకు వైద్య ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య శిభిరాలలో మహిళల, పిల్లల, జనరల్, ఆర్థోపెడిక్, కంటి, పంటి వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ శిభిరాలు మన జిల్లాయందు గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిభిరాలకు మహిళలు, వయోవృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, కంటి, పంటి సమస్యలతో బాధపడుతున్న వారు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఆవాసాల దగ్గరగా ఉన్న శిభిరాలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, పారామెడికల్ సూపర్‌వైజర్ అధికారులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తమకు కేటాయించిన ప్రాంతాల నుంచి చికిత్స అవసరమైన వారిని శిభిరాలలో చికిత్స పొందేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ గల ప్రభుత్వ లక్ష్యం కోసం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ శిభిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## కులగణనలో బిసిలను చేర్చాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఏప్రిల్ 1 నుంచి దేశ వ్యాప్తంగా జరగనున్న కులగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 1931లో జరిగిన కులగణన తరువాత బీసీల మూడు దశాబ్ధాల పోరాట ఫలితంగా గత సంవత్సరం ఏప్రిల్ 30న జనగణనతో పాటు కులగణన కూడా చేపడ్తామని నిర్ణయం తీసుకున్నారని, కాని జనవరి 22, 2006 రోజున కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 33 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఈ నోటిఫికేషన్‌లో 12వ ప్రశ్నలో మీరు ఎస్సీ, ఎస్టీనా లేదా ఇతరులా అని అడిగిందని ఇతరులు అన్న చోట ఓబీసీనా అని ప్రశ్నావళిలో పొందుపరచాలన్నారు. ఓబీసీ కాలాన్ని ప్రత్యేకంగా చేర్చకపోవడం మూలంగా దేశవ్యాప్తంగా ఉన్న 70కోట్ల మంది బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో తేలకుంటే బడ్జెట్, విద్యా, ఉద్యోగ రంగాల్లో రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా ఒక హక్కుగా చట్టబద్ధంగా దక్కకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులగణన కూడా చేర్చాలని లేకపోతే దేశ వ్యాప్తంగా జరిగి కులగణన బహిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, దొనేటి శేఖర్, నక్క నాగరాజు, బొమ్మకంటి హరి, మహేష్, వంశీ, శ్రీనివాస్‌యాదవ్, రాంబాబుయాదవ్ పాల్గొన్నారు.

## మా పంట పొలాలకు దారేది..?

### కన్నీరు మున్నీరైన రైతులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అన్నం పండించే రైతు...ఈరోజు తనే పండించిన పంట దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో రైతుల పరిస్థితి ప్రస్తుతం ఇదే.పానగల్లు ఉదయసముద్రం ప్రాజెక్టుకు చెందిన డీ39 కాలువలో పూడికతీత పేరుతో తీసిన మట్టి,చెత్తాచెదారాన్ని రాత్రికి రాత్రే కాలువ ఎడమవైపు ఉన్న దారికి అడ్డంగా పోయడంతో దాదాపు 60 ఎకరాల పంట పొలాలకు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయింది. ఉదయం ఆశలతో పొలాల వైపు నడిచిన రైతులకు ఎదురైన దృశ్యం గుండెను కలిచివేసింది.కాలి నడకనైనా వెళ్లే వీలులేకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.మేమే కలిసి కష్టపడి వేసుకున్న దారి ఇది. కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా ఇలా మూసేయడం ఎంతవరకు న్యాయం అని రైతులు బండ చినపిచ్చిరెడ్డి,బండ కరుణాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా పది,పదిహేను రోజుల్లో వరి పంట చేతికొస్తోంది. మార్కెట్‌కు తరలించాల్సిన సమయంలో దారి మూసుకుపోవడంతో రైతుల గుండెల్లో ఆందోళన ముదురుతోంది. పంటను ఎలా తీసుకెళ్తాం? మా శ్రమ ఫలితం ఏమవుతుంది అంటూ కన్నీటి కళ్లతో ప్రశ్నిస్తున్నారు. అధికారులను అడిగితే నిర్లక్ష్య సమాధానాలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అన్నదాతల ఆవేదనను గుర్తించి జిల్లా అధికారులు తక్షణమే స్పందించి దారికి అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి రైతులకు న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

## పేకాట రాయుళ్ల ముఠాపై పోలీసుల దాడి

### 9 మంది అరెస్ట్: రూ.3,200 స్వాధీనం

**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్:** మండలంలోని రంగుండ్ల గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్న ముఠాపై తిరుమలగిరి సాగర్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మిక దాడి నిర్వహించారు. స్థానిక ఎస్ఐ కె. వీరశేఖర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,డబ్బులను బెట్టింగ్‌గా పెట్టి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో అంగోతు హనుము,పీపీఎం,అంగోతు దీప్లా,అంగోతు నాగ, రమావత్ హతీరం ఉన్నారు. ఘటనాస్థలంలోనుంచి అంగోతు బాలు, అంగోతు పాండు,అంగోతు చిట్టిబాబు, కాత్రోతు రమేశ్,అంగోతు నాగు పరారయ్యారు.నిందితుల వద్ద నుంచి రూ.3,200 నగదు,రెండు సెల్ ఫోన్లు,ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మండలంలో అక్రమ జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని,ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.



## బుద్ధవనం ఆధ్యాత్మిక క్షేత్రంగా మరో మైలురాయి

### థాయిలాండ్ రాజకుటుంబంతో బౌద్ధ భిక్షువులు బుద్దవనం సందర్శన



**ప్రజాపక్షం /నందికొండ:** కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా బుద్ధ విహారం నుండి ప్రారంభమైన దమ్మ పాదయాత్ర ఘనంగా బుద్ధవనం చేరుకుని మంగళవారం చివరి రోజు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్ అధ్యక్షతవహించారు.థాయిలాండ్ దేశం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పూజా సామగ్రితో బౌద్ధ భిక్షువులు విశిష్ట ప్రార్థనలు నిర్వహించారు.గౌతమ బుద్ధుని స్మరణార్థం బుద్ధ జ్యోతులను వెలిగించి అనంతరం ధ్యాన మందిరంలో సామూహిక ధ్యానం చేశారు. దమ్మయాత్రలో పాల్గొన్న థాయిలాండ్,భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు ఇతర బౌద్ధ మతస్తులు థాయిలాండ్ రాజకుటుంబ ప్రతినిధులతో కలిసి నాగార్జునకొండ మ్యూజియం ను సందర్శించారు.మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ భిక్షువులకు అక్కడ భద్రపరిచిన బుద్ధ ధాతువులను వీక్షించే అవకాశాన్ని కల్పించారు.బుద్ధ ధాతువుల దర్శనం అనంతరం భిక్షువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారు నాగార్జునకొండలోని పునర్నిర్మిత మహాస్థూపం, సింహల విహారాన్ని సందర్శించి బౌద్ధ చరిత్ర వైభవాన్ని స్మరించుకున్నారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుంద ర్ రావు,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. దమ్మయాత్ర ము గింపు ఉత్సవాలు బుద్ధవనాన్ని అంతర్జాతీయ బౌద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా మరోసారి ప్రతిష్ఠింపజేశాయి.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### శాస్త్రీయ ఆధారాలతో న్యాయం సాధించిన పోలీసులు

### అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 డిసెంబర్ 12న జరిగిన సంచలన హత్య కేసులో నిందితుడు రామాపురం మల్లేశ్వర్ రావుకు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది.ఈ విషయాన్ని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని తులసి నగర్ ప్రాంతానికి చెందిన రామావత్ బాల(35) హత్యకు గురైనట్లు తెలిపారు.మృతుడి సోదరితో నిందితుడికి అక్రమ సంబంధం ఉండగా, మృతుడు అడ్డుగా వస్తున్నాడనే కారణంతో పథకం ప్రకారం 2018 డిసెంబర్ 12న ఉదయం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సమీపంలో హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నా రు. ఘటన అనంతరం మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి శాస్త్రీయంగా దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో స్వాధీనం చేసి వాటివి నిర్ధారణ అయిందని ఎస్పి వివరించారు.అదే విధంగా 164 పిసి ప్రకారం కీలక సాక్షుల వాం గ్మూలాలు మేజిస్ట్రేట్ సమక్షంలో నమోదు చేయ డం జరిగింది. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు, వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం కోర్టు నిందితుడిపై నేరాన్ని నిర్ధారించింది ఐపీసీ సెక్షన్ 302 కింద జీవిత ఖైదు,రూ.10వేలు జరిమానా ఎస్‌సి,ఎస్‌టి చట్టం సెక్షన్ 3(2)(వి) కింద మరో జీవిత ఖై దు, రూ.10వేలు జరిమానా,ఐపీసీ సెక్షన్ 201 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా మొత్తం రూ. 30,000 జరిమానా విధించగా,అన్ని శిక్షలు సమాంతరంగా అమలులో ఉంటాయని కోర్టు స్పష్టం చే సింది.ఈ కేసును సమర్థవంతంగా ద ర్యాప్తు చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేసిన అప్పటి దర్యాప్తు అధికారులు డిఎస్‌పి వెంకటేశ్వర రెడ్డి, సీఐ మహబూబ్ బాషా,ఎస్ఐ నరసింహులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిలతో పాటు ప్రస్తుత అధికారులు డిఎస్‌పి శివరాం రెడ్డి, సీఐ రాఘవరావు,ఎస్ఐ సైదులు, సీడీఓ సుమన్, కోర్టు లైజనింగ్ అధికారు లు నరేందర్,మల్లికార్జున్‌లను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

## నవాబ్ పేట రిజర్వాయర్ ద్వారా గుండాల రైతులకు సాగునీరందిస్తాం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/గుండాల :** నవాబ్ పేట రిజర్వాయర్ ద్వారా గుండాల మండలంలోని ప్రతి రైతుకు సాగునీరు అందించి, పొలాలను సస్యశ్యామలం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని సాగునీటి కాల్వలతో పాటు నవాబ్ పేట రిజర్వాయర్ ప్రాజెక్టును ఆయన స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల మండలానికి గరిష్ట స్థాయిలో నీటిని మళ్లించడమే తమ లక్ష్యమని, రిజర్వాయర్ నుండి కాల్వల ద్వారా నీరు వచ్చే క్రమంలో పలు గ్రామాల్లోని గేట్ వాల్వ్ వద్ద ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం సుద్దాల, అనంతారం గ్రామ సమీపంలో అసంపూర్తిగా ఉన్న కాల్వ మరమ్మతు పనులను పరిశీలించి ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కావడం వల్ల అనంతారం చెరువుతో పాటు చుట్టుపక్కల ఉన్న సుద్దాల, వెల్మజాల, బ్రాహ్మణపల్లి, సీతారాంపురం గ్రామాల్లోని మరికొన్ని చెరువులు నిండుతాయని, తద్వారా ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరుతాయని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పనులను వేగవంతం చేస్తున్నామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని బీర్ల అయిలయ్య తెలిపారు.



### చెరువులు నింపి రైతులకు సాగునీరందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/ఆలేరు :** గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం ఆయన ఆలేరు మండలంలోని శారజిపేట, గోలనుకొండ ప్రాంతాల్లో పర్యటించి, అశ్వారావుపల్లి నుండి వచ్చే కాల్వల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న రెండు మూడు చోట్ల వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు కొండరాజు వెంకటేశ్వరాజు, సర్పంచ్ కంతి మధు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అందె అఖిల్, నర్సింగ్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లకు కొమ్ముకాస్తున్న అధికారులు

### రైతుల పేర్లపై బుకింగ్ చేసి షాపుల్లో అమ్మకాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** తుంగతుర్తి మండల కేంద్రంలోని యూరియా సరఫరాపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రైతులకు అందాల్సిన యూరియాను యాప్‌లో వారి పేర్లపై బుక్ చేసి, షాపుల్లోనే లింక్ చేసి అమ్ముతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని గమనించిన రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. రైతుల ఆవేదన ప్రకారం అష్టకష్టాలు పడుతుండగా, కొందరు ఫెస్టిసైడ్స్ దుకాణాల్లో రైతుల పేర్లపై యూరియా బుకింగ్ చేసి, అధించకుండా వివిధ పురుగు మందులతో కలిపి విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన తుంగతుర్తి వ్యవసాయ సంచాలకులు గతంలో ఓ అన్నారం ఫెస్టిషైడ్ షాపులో యజమానిపై ఒక నెల రోజుల లైసెన్స్ రద్దు చేశారు. ఇదే తతంగం తుంగతుర్తి మండల కేంద్రంలోని రెండు షాపుల్లో దాడులు జరగ్గా నామమాత్రంగా వెళ్లి, వారి రికార్డులను స్వాదీనం చేసుకుని డిటివో కార్యాలయానికి అప్పగించారు. అంతటా, అంతటితో ఆగకుండా జిల్లా అధికారి కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు, ఏదీ ఏమైనా తుంగతుర్తి ఎడిఎ డబ్బులకు దాసోహపుడుతూ ఇటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపు యాజమానిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీ నాయకులు, రైతులు కోరుతున్నారు. మండలంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండలంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ఇది వరకు కూడా జరిగినట్లురైతులు చెబుతున్నారు. అప్పట్లో సంబంధిత షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ మళ్లీ అదేపరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితిని పునరావృతం కావడం బాధకరమని, కేవలం నోటీసులతో సరిపెట్టుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా యూరియాను నిల్వలు చేసిన వారిపై చర్యలు తప్పవని తుంగతుర్తి వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు హెచ్చరించారు. రైతుల పాస్‌బుక్‌లు ఇతరులకు ఇవ్వవద్దని, మండల కేంద్రంలో యూరియా బస్తాల్లో తారతమ్యాలు వచ్చిన షాపులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## మరణాలకు దారి 565 రహదారి

### అతివేగం..నిర్లక్ష్యం ..హెచ్చరికల లేమి.. రక్తసిక్తమవుతున్న రోడ్లు

### చందనపల్లి వద్ద నిత్యం ప్రమాదాలే చర్యలు ఇంకెప్పుడు?

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రహదారులు అభివృద్ధికి ప్రతీకలు కావాలి..కానీ నల్లగొండ జిల్లాలోని 565 రహదారి మాత్రం ప్రాణాలు బలిగొంటున్న ప్రమాదకర మార్గంగా మారింది.రోజూ ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం ఎవరో ఒకరి ఇంట్లో విషాదం. ఈ పరిస్థితి ప్రజల్లో భయాందోళన కలిగిస్తోంది. 2023లో నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ వరకు 565 రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించారు. రోడ్డు వెడల్పు పెరగడంతో వాహనదారులు అతివేగంగా దూసుకెళ్తున్నారు. అయితే సెంటర్ డివైడర్ లేకపోవడం, సర్వీస్ రోడ్లు లేకపోవడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.

**చందనపల్లి వద్ద విషాదం**

సోమవారం నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు చందనపల్లి గ్రామం వద్ద స్కూల్ బస్సును ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒకరు నార్కట్‌పల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి, మరొకరు శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

మూడు సంవత్సరాల్లో 250300 మంది మృతి?

పానగల్ నుంచి నకిరేకల్ వరకు గత మూడు సంవత్సరాల్లో సుమారు 250 నుంచి 300 మంది వరకు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా టూవీలర్ వాహనదారులు, పాదచారులే ఎక్కువగా బలవుతున్నారు.



ప్రమాదాలకు ప్రధాన కారణాలు:

అతివేగం ఓవర్‌టేకింగ్ హెల్మెట్ వినియోగం లోపం సెంటర్ డివైడర్ లేకపోవడం సర్వీస్ రోడ్లు లేకపోవడం హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ లేమి గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు దాటాలంటే ప్రాణాలు పోతున్నాయి. రోడ్డు విస్తరణ మాత్రమే అభివృద్ధి కాదు. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే అది ప్రాణాంతకంగా మారుతుంది. ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు స్పందించి సెంటర్ డివైడర్, సర్వీస్ రోడ్లు, సిగ్నల్ లైట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.రోడ్డు ఎక్కిన మనిషి సురక్షితంగా ఇంటికి చేరాలని ప్రతి కుటుంబం ఆకాంక్ష.

**ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి :సురిగి రమేష్ గౌడ్ (మాజీ సర్పంచ్ భర్త, సామాజిక కార్యకర్త)**


నకిరేకల్ నుంచి పానగల్ వరకు సెంటర్ డివైడర్, సర్వీస్ రోడ్లు,ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చందనపల్లి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

**సిగ్నల్స్ లేకపోవడం వల్లే ప్రమాదాలు:ఆర్ఎంపి డాక్టర్ రామాచారి (చందనపల్లి)**

రోడ్డు వెంట హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ లేకపోవడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అనుమానాస్పదంగా వివాహిత, ఇద్దరు పిల్లలు మృతి





**ప్రజాపక్షం/బీబీనగర్ :** అనుమానాస్పదంగా ఇద్దరు పిల్లలు, తల్లి మృతి చెందిన సంఘటన బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోని వెలితే గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల ఐశ్వర్య 2020లో మేకల మహేష్ యాదవ్ అనే వ్యక్తిని వివాహమాడారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు చెలరేగడంతో వలిగొండ మండలంలోని వేముల కొండ గ్రామంలో ఇద్దరు పిల్లలతో తల్లిగారి ఇంటి వద్ద ఉంటున్న ఐశ్వర్యను భర్త మహేష్ ఫోన్ చేసి ఇద్దరు కలిసి ఉందాం అని పిలవడంతో సోమవారం ఐశ్వర్య పెద్దనాన్న పెద్దమ్మలు కలిసి సోమవారం అత్తగారి ఇంటి వద్ద వదిలి వెళ్లారు. అత్తగారింటికి వచ్చిన మరుసటి రోజున అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇరుగుపొరుగు వారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేకల ఐశ్వర్య తన ఇద్దరి కూతుర్లను చంపి తాను ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకురేసుకుని మృతి చెందినట్లు సమాచారం. సంఘటన తెలిసిన వెంటనే భువనగిరి డిఎస్పి రవీందర్ గ్రామాన్ని సందర్శించి మృతురాలు తన కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోవడంలేదని సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. ఐశ్వర్య తండ్రి ఎరుపుల యాదయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాలను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిఐ ప్రభాకర్ రెడ్డి ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి ప్రమాదం

**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం) :** తాటి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు క్రింద పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఊట్కూరు గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఊట్కూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు భూపతి వెంకటయ్య వృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం యధావిధిగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టు మీద నుంచి కింద పడ్డారు.తీవ్ర గాయాలయ్యి కాళ్ళు చేతులు విరగడం తో గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందజేయడంతో నల్లగొండకి తరలించారు.ఈ సందర్భంగా వెంకటయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమది పేద కుటుంబమని,కల్లు గీత వృత్తి పైననే తమ కుటుంబం ఆధారపడి జీవిస్తున్నదని,తమని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## అగ్ని ప్రమాదంలో షాపు దగ్ధం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి హార్డ్వేర్ షాపు దగ్ధమైన సంఘటన మంగళవారం భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుజాత హార్డ్‌వేర్ దుకాణం బంద్ ఉన్న సమయంలో ఉదయం పదిన్నర గంటలకు షాప్ నుండి పగలు రావడంతో గమనించిన కొందరు మంటలు ఆర్పడానికి ప్రయత్నించిన పూర్తిగా అదుపురాక షాపు దగ్ధమైంది. షాపులో ఎలక్ట్రికల్ సామానులు ఇంజనీరింగ్ కరెంటు మోటారు సామాన్లు హార్డ్‌వేర్ సామాన్లతో పాటు సానిటరీ ఐరన్ సామాన్లు మంటల్లో కాలిపోవడంతో సుమారు ఆరు లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

## శ్రీ నీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని శివన్నగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చర్లగూడెం శ్రీ నీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వాహకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ సిరిప్రగడ ఆనందరావు ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవాన్ని పురోహితుల సమక్షంలో కదిలించారు.అదేవిధంగా సర్పంచ్ రాపోలు యాదగిరి అన్నదాన కార్యక్రమం చేశారు.ఈసందర్భంగా దేవాదాయ శాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి జయరామయ్య ముఖ్య అతిథిగా హాజరై బ్రహ్మోత్సవాలను తిలకించారు.నిర్వాహకుల సమక్షంలో స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.అదే విధంగా దేవాలయ అభివృద్ధిని ప్రాజెక్టు నిర్మాణంలోగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి సమక్షంలో మరింత అభివృద్ధి చేసేందుకు చర్చించుకున్నారు.ఈ కార్యక్రమంలో సిరి ప్రగడ వినోద్ రావు,రాహుల్ శ్రీధర్ రావు,సుధీర్ రావు,గోపాల్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కడుపు నొప్పి భరించలేక ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని దిలావర్పూర్‌లో వివాహిత మహిళ కడుపునొప్పి బరించలేక ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలలోకి వెలితే మృతురాలు చత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ ధూర్వాటి బాయి(38) తన భర్త, పెద్ద కొడుకు మరియు వారి గ్రామానికి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులతో గత మూడు సంవత్సరాల క్రితం కూలి పని కోసం వచ్చి దిలావర్పూర్‌లో నివాసం ఉంటున్నారు. గత మూడు రోజుల నుంచి మృతురాలు కడుపు నొప్పి, ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ మంగళవారం భర్త, కొడుకు పనికి వెళ్ళగా ఎవరు లెని సమయంలో రూములో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని చనిపోయిందని కుటుంబ సభ్యులు చూసి వెంటనే గ్రామ సర్పంచ్ పెద్దమనుషుల ద్వారా పోలీసులకు సమాచారం అందించగా మోటకొండూర్ ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో వెళ్ళి పంచనామా నిర్వహించి, శవాన్ని పోష్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మృతి పై ఎలాంటి అనుమానాలు లేవని మృతురాలు బందువు చెలిమి బాయి పిర్యాదులో తెలిపినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.



### సిఏఏ పౌరసత్వ దరఖాస్తుల ప్రాసెస్ కోసం...

# మరో రెండు సాధికారిత కమిటీలు

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడి




**న్యూఢిల్లీ :** ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం..పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) కింద భారత పౌరసత్వం కోరుతూ వచ్చే దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి పశ్చిమబెంగాల్‌లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) సోమవారం మరో రెండు సాధికారిత కమిటీలను ఏర్పాటు చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఇప్పటికే రెండు కమిటీలు ఉన్నాయి. అయితే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన కారణంగా అదనపు ప్యానెల్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఈ సాధికారిత కమిటీకి భారత ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ హోదా కంటే తక్కువ స్థాయి అధికారి నేతృత్వం వహించనున్నారు. వీరిని భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ నామినేట్ చేస్తారు. సోమవారం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ ప్రతీ సాధికారిత కమిటీకి భారత ప్రభుత్వ అండర్ సెక్రటరీ హోదాకు తక్కువ కాని సబ్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి, సంబంధిత అధికార పరిధికి చెందిన విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ అధికారి నామినేట్ చేసే భారత ప్రభుత్వ అండర్ సెక్రటరీ హోదాకు తగ్గని , పశ్చిమబెంగాల్‌లోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి నామినేట్ చేసే భారత ప్రభుత్వ అండర్ సెక్రటరీ హోదాకు తగ్గని అధికారి కూడా ఉంటారు. ఈ కమిటీలో పశ్చిమబెంగాల్ పోస్ట్ మాస్టర్ జనరల్ లేదా భారత ప్రభుత్వ అండర్ సెక్రటరీ హోదా కంటే తక్కువ స్థాయి పోస్ట్ మాస్టర్ జనరల్ నామినేట్ చేసిన పోస్టల్ అధికారి కూడా ఉంటారని అది తెలిపింది. నోటిఫికేషన్ ప్రకారం ఇద్దరు ఆహ్వానితులు ఉంటారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రతినిధి, రైల్వేల అధికార పరిధిలోని డివిజనల్ రైల్వే మేనేజర్, ప్రిన్సిపల్ సెక్రటరీ (హోం) కార్యాలయం నుంచి ఒక ప్రతినిధి లేదా అడిషనల్ చీఫ్ సెక్రటరీ (హోం) కార్యాలయం నుంచి ఒక ప్రతినిధి ఉంటారు. 2024 మార్చి 11న జారీచేయబడిన ఒక నోటిఫికేషన్ ప్రకారం, పౌరసత్వం (సవరణ) చట్టం కింద సాధికారిత కలిగిన కమిటీకి డైరెక్టర్ (సెన్సస్ ఆపరేషన్స్) నాయకత్వం వహిస్తారు. ఏడుగురు ఇతర సభ్యులు ఉంటారు. కేంద్రం పౌరసత్వం (సవరణ) చట్టాన్ని అమలు చేసింది. 2014 డిసెంబరు 31కి ముందు భారతదేశంలోకి ప్రవేశించిన పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన పత్రాలులేని ముస్లింయేతర వలసదారులకు పౌరసత్వాన్ని వేగవంతం చేయడానికి కంటెన్షియస్ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. నాలుగు సంవత్సరాల తర్వాత 2019 మార్చి 11, 2024న రూల్స్‌ను నోటిఫై చేసింది.

### ప్రధాని మోదీ మౌనం

# భారత గౌరవాన్ని తగ్గిస్తోంది!

ఒక దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి : రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న వేళ, ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ హత్యపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా ఒక దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, ఇతర మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలన్నారు. మోదీ సర్కార్ మౌనం పాటించడం వల్ల ప్రపంచ వేదికపై భారత్‌కు ఉన్న గౌరవం తగ్గిపోతుందని రాహుల్‌గాంధీ అభిప్రాయం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇరాన్‌కు ఇజ్రాయెల్, అమెరికాలకు మధ్య ఘర్షణలు మరింత విస్తృతమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఇది మధ్య ప్రాచ్యాన్ని మరింత అస్థిరతలోకి నెడుతుందని చెప్పారు. భారతీయులతో సహా అక్కడ కోట్లాది మంది అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. 'భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులను, అలాగే ఇతర మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. హింస హింసను పుట్టిస్తుంది. చర్చలు, సంయమనం శాంతికి ఏకైక మార్గం' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలని, అంతర్జాతీయ చట్టం, మానవ జీవితాల రక్షణలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలన్నారు. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాల శాంతియుత పరిష్కారంలో పాతుకుపోయిందని, అది స్థిరంగా ఉండాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను ఆయన సమర్థిస్తారా అని గాంధీ ప్రశ్నించారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ప్రజలను తమ విధిని నియంత్రించాలని, 1979 నుండి తమ దేశాన్ని పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వానికి వ్యతిరేకంగా లేవాలని పిలుపునిచ్చారు.

### డిఎంకె-కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాలు

# సిఎం స్టాలిన్‌తో చిదంబరం భేటీ



**చెన్నై :** త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార డిఎంకె, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాల్లో ప్రతిష్టంభన నెలకొంది. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, టిఎన్‌సిసి చీఫ్ కె. సెల్వపెరుంతగైతో కలిసి ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌తో ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. గంట పాటు వారు చర్చలు జరిపారు. రెండు పార్టీలను ప్రభావితం చేసే వివిధ అంశాలపై చర్చించారు. త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. రెండు పార్టీలు పొత్తు కొనసాగించాలని కోరుకుంటున్నాయని, అయితే కాంగ్రెస్‌కు కేటాయించే సీట్ల సంఖ్యపై కొంత భిన్నాభిప్రాయాలు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. తొలుత డిఎంకె కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ స్థానాన్ని ఆఫర్ చేయగా, కాంగ్రెస్ 39 సీట్లను డిమాండ్ చేసింది. కాగా, ఆ పార్టీకి కేటాయించాల్సిన సీట్ల సంఖ్యపై చర్చలు ఆధారపడి ఉన్నాయి. అయితే 28 సీట్లు, రెండు రాజ్యసభ సీట్లకు సరిపెట్టుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. 'డిఎంకె పొత్తు కొనసాగాలని కోరుకుంటోంది. చర్చలు కొనసాగుతున్నాయి. మా నాయకుడు మంచి నిర్ణయానికి వస్తారు' అని డిఎంకె ప్రతినిధి టి కె ఎస్ ఎలంగోవన్ రాష్ట్రంలోని వెల్లూరులో విలేకరులతో అన్నారు. తమ నాయకుడు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలనుకుంటున్నారన్నారు. తొలుత సెల్వపెరుంతగై చిదంబరాన్ని కలవగా, చర్చ తర్వాత ఆ ఇద్దరూ సిఎం నివాసానికి వెళ్లారు. తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీష్ చోడంకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ సీట్ల భాగస్వామ్య కమిటీ ప్రారంభ చర్చలు నిర్వహించి, గత వారం కోశాధికారి టి ఆర్ బాలు నేతృత్వంలోని డిఎంకె కమిటీకి జాబితా సమర్పించింది. ప్రారంభ చర్చ తర్వాత, డిఎంకె 25 సీట్ల ఆఫర్ ఆమోదయోగ్యం కాదని, పార్టీ ఇంకా ఎక్కువ ఆశించిందని చోడంకర్ అన్నారు. అయితే, ఆసక్తికరమైన పరిణామాలలో పార్టీ హైకండ్ సీనియర్ నాయకుడు పి చిదంబరాన్ని డిఎంకె నాయకత్వంతో నేరుగా చర్చలను తిరిగి ప్రారంభించి, సామరస్యపూర్వక పరిష్కారం తీసుకురావాలని కోరింది.

## బిహార్ నుంచి రాజ్యసభకు నితన్ నబీన్

9 మంది పేర్లను ప్రకటించిన బిజెపి



**న్యూఢిల్లీ:** బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బిహార్ నుండి రాబోయే రాజ్యసభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థిగా నామినేట్ అయ్యారు. రాజ్యసభ ఎన్నికలకు అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) తొమ్మిది మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. బిజెపి పశ్చిమ బెంగాల్ యూనిట్ మాజీ చీఫ్ రాహుల్ సిన్హా, ఛత్తీస్‌గఢ్ యూనిట్ ఉపాధ్యక్షుడు లక్ష్మీ వర్మ ఆయా రాష్ట్రాల నుండి పోటీ చేస్తున్నారు. అసోం పిడబ్ల్యుడి మంత్రి జోగెన్ మోహన్, ఎమ్మెల్యే తేరాష్ గోవాల్లా రాజ్యసభకు జరిగే ఎన్నికలకు కాషాయ పార్టీ అభ్యర్థులుగా ఉండనున్నారు. బిజెపి తన ఒడిశా యూనిట్ అధ్యక్షుడు మన్మోహన్ సమల్, ప్రస్తుత రాజ్యసభ ఎంపి సుజీత్ కుమార్‌లను రాబోయే ఎన్నికలకు రాష్ట్రం నుండి అభ్యర్థులుగా నామినేట్ చేసింది. బిజెపి నాయకుడు శివేష్ కుమార్ బిహార్ నుండి బరిలోకి దిగనున్నారు. పార్టీకి చెందిన మాజీ లోక్‌సభ ఎంపి సంజయ్ భాటియా హర్యానా నుండి తమ అభ్యర్థిగా ఉంటారు. కుమార్ బిహార్ బిజెపి ప్రధాన కార్యదర్శి. అభ్యర్థుల పేర్లను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదించిందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తెలిపారు.

## 1.2 కోట్ల విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ పూర్తి




**న్యూఢిల్లీ :** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) కీలక మైలురాయిని చేరుకుంది. దేశంలో ఉన్న లక్షకు పైగా పాఠశాలల్లో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తయినట్లు అధికారికంగా వెల్లడించింది. గత ఏడాది నుంచి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబియు)ను ఉడాయ్ ప్రారంభించింది. ఏడాదిపాటు ఈ కార్యక్రమం సాగనుంది. ఇందులో భాగంగా 7 నుంచి 15 ఏళ్ల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయనుంది. ఆరు నెలల్లో 1,03,000 పైగా పాఠశాలల్లో ఎంబియు చేపట్టింది. దాదాపు 1.2 కోట్ల విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్‌లను పూర్తిచేసినట్లు ఉడాయ్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ లేదా బ్లూ ఆధార్ జారీ చేస్తారు. ఫొటో, పేరు, పుట్టిన తేదీ, చిరునామా వివరాలతో ఈ గుర్తింపు కార్డును జారీ చేస్తుంటారు. ఆ సమయంలో ఫింగర్‌ప్రింట్ గానీ, ఐరిస్ బయోమెట్రిక్స్ గానీ సేకరించరు. నిబంధనల ప్రకారం ఐదేళ్లు దాటితే ఫింగర్‌ప్రింట్స్, ఐరిస్, ఫొటో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీన్ని ఫస్ట్ తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌గా (ఎంబియు) పేర్కొంటారు. 5 నుంచి 15 ఏళ్ల మధ్య చిన్నారుల వివరాల అప్‌డేషన్‌కు ఏడాదిపాటు ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు.

## 4 విమానాశ్రయాల నుంచి 250కి పైగా విమానాలు రద్దు



**ముంబయి :** పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా మంగళవారం ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల్లో 250కి పైగా విమానాలు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న వివాదం నేపథ్యంలో విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేయడంతో నాల్గవ రోజు కూడా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో 80 విమానాలు రద్దు చేయగా, ముంబయి విమానాశ్రయంలో 107 సర్వీసులు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. బెంగళూరులో దాదాపు 42 విమానాలు రద్దు చేశారు. చెన్నై విమానాశ్రయం 30 విమానాలు రద్దు చేసినట్లు ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా సంక్షోభం తలెత్తినప్పటి నుండి, గత మూడు రోజుల్లో భారత విమానయాన సంస్థలు 1,117 అంతర్జాతీయ విమానాలను రద్దు చేశాయి. మధ్యప్రాచ్యంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, పశ్చిమానికి వెళ్లే కొన్ని అంతర్జాతీయ విమానాలు ఆలస్యం లేదా కార్యాచరణ సర్దుబాట్లకు లోనవుతాయని ఢిల్లీ విమానాశ్రయ నిర్వాహకుడు డిఐఎఎల్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## యుపిలో ఘోర రోడ్డు ప్రమాదం

**హత్రాస్:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై డబుల్ డెక్కర్ బస్సు వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు మృతిచెందారు, పలువురు గాయపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. 13 మంది ప్రయాణికులతో, ఢిల్లీలోని ప్రేమ్‌నగర్ నుంచి రాజస్థాన్ లోని ధోల్ పూర్‌కు వెళ్తున్న వ్యాన్‌ను ఓవర్ చేసే క్రమంలో డబుల్ డెక్కర్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. గాయపడ్డవారిని ఆగ్రాలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడని, బస్సు డ్రైవర్, ఆపరేటర్, కండక్టర్ ను అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.




### రూ.5,083 కోట్ల విలువైన హెలికాప్టర్లు, క్షిపణుల కొనుగోలు కోసం...

# హెచ్ఎఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం



**న్యూఢిల్లీ :** ఆరు అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు (ఎఎల్‌హెచ్), ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణుల కొనుగోలు కోసం రక్షణ శాఖ రూ.5083 కోట్ల విలువైన ఒప్పందాలను హిందుస్థాన్ ఏరోనాటికల్స్‌తో కుదుర్చుకుంది. ఈ విషయాన్ని మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎఎల్‌హెచ్ ఎంకెII హెలికాప్టర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ కొనుగోలు చేస్తుండగా, ష్టిల్ క్షిపణులను ఇండియన్ నేవీ యుద్ధ నౌకలపై మోహరించనున్నారు. ఎఎల్‌హెచ్III (మారిటైం రోల్)తో పాటు ఆపరేషనల్ రోల్ పరికరాలు, ఇంజనీరింగ్ సపోర్ట్ ప్యాకే, పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ సపోర్ట్ కోసం రూ.2,901 కోట్ల విలువైన ఒప్పందం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో కుదుర్చుకున్నామని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ జంట ఇంజన్ హెలికాప్టర్లు ప్రస్తుతం పనిచేస్తున్న ఎయిర్ బోర్న్ ప్లాట్‌ఫామ్‌ల కంటే మెరుగైన లక్షణాలను కలిగి ఉన్నాయని, ఇవి తీర ఆధారిత ఎయిర్ ఫీల్డ్‌లతోపాటు సముద్రంలోని ఓడల నుంచి కూడా విస్తృత శ్రేణి సముద్ర భద్రతా చర్యలను చేపట్టగలవని తెలియజేసింది. ఉపరితలం నుంచి ప్రయోగించగల ష్టిల్ క్షిపణులు, అనుబంధ క్షిపణి హోల్డింగ్ ఫ్రేమ్‌ల కొనుగోలు కోసం రూ. 2,182 కోట్ల విలువ కలిగిన ఒప్పందంపై సంతకం చేయడం జరిగిందని, రష్యాకు చెందిన జెఎస్‌సి రోసోబోరోనెక్స్‌పోర్ట్‌తో ఈ ఒప్పందం కుదుర్చుకున్నామని అధికారులు చెప్పారు. ఈ కొనుగోలు విస్తృత శ్రేణి యుద్ధ నౌకలకు వ్యతిరేకంగా ఫ్రంట్‌లైన్ యుద్ధ నౌకల రక్షణ సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి ఉద్దేశించబడిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ వ్యవస్థ భారత నావికాదళం ప్లాట్‌ఫామ్‌లపై లేయర్డ్ ఎయిర్ డిఫెన్స్‌ను బలోపేతం చేస్తుందని, అన్ని వాతావరణాలను తట్టుకునే సామర్థ్యాన్ని, మెరుగైన మనుగడ సాగించే సముద్ర వాతావరణాలను అందిస్తుందని తెలియజేసింది.

## సుమత్రా దీవిలో పెను భూకంపం



**జకర్తా:** ఇండోనేసియా సుమత్రా దీవుల్లో మంగళవారం ఉదయం పెనుభూకంపం సంభవించింది. రిచ్టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత 6.1 పాయింట్లుగా నమోదైనట్లు యునైటెడ్ జియోలాజికల్ సర్వే తెలియజేసింది. అనేక టెక్టోనిక్ ప్లేట్లు సమన్వయంతో ఒక్కచోట ఏకమయ్యే భూభాగం కావడంతో ఈ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతమైన ఇండోనేసియా,సుమత్రా దీవులలో తరచు భూకంపాలు, అగ్ని పర్వతాల పేలుళ్ళు సంభవిస్తాయి. తాజా భూకంపంలో ఆస్తి,ప్రాణ నష్టం వివరాలు ఇంకా వెలుగులోకి రాలేదు. గత ఏడాదిలో కూడా రెండు సార్లు ఇండోనేసియాలో భారీ తీవ్రతతో భూకంపాలు సంభవించాయి.

## ఇరాన్‌లో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడాలి


భారత్‌లో ఇరాన్ నటి మందనా కరిమి డిమాండ్



**ముంబై:** మంతఛాందసవాదంతో రగిలిపోతున్న ఇరాన్‌దేశంలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందని భారత్‌లో స్థిరపడిన ఇరాన్ జాతీయురాలు, ప్రముఖ నటి మందనా కరిమి డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆయన గట్టిగా సమర్థించారు. ఇరాన్ ప్రభుత్వంపై తరచు విమర్శలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెడుతూ ఉంటారు. ఇరాన్‌లో ఖమేనీ ప్రభుత్వం కేన్సర్ లాంటిదని, అది ప్రపంచాన్ని చుట్టేస్తుందంటూ మందనా కరిమి ట్రంప్ దాడులను సమర్థించారు. ట్రంప్‌ను ఆమె ప్రశంసల్లో ముంచెత్తుతూ ఆయనను పర్షియన్ చక్రవర్తి "సైరస్ ద గ్రేట్"తో పోల్చారు. ట్రంప్ ఆయనతో సమానమైనవాడన్నారు. ఇరాన్ ప్రజలు ట్రంప్‌ను సైరస్ ద గ్రేట్‌గా ఎల్లకాలం గుర్తుంచుకుంటారన్నారు. సైరస్ ద గ్రేట్‌ను ఇరాన్ ప్రజలు జాతీయ హీరోగా ఆరాధిస్తారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పుట్టిన మందనా కరిమి 2010లో మోడల్‌గా, నటిగా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. భారతదేశంలో స్థిరపడ్డారు. టెహ్రాన్‌లో పుట్టినప్పటికీ ఆమెకు భారత్ మూలాలు ఉన్నాయి. ఆమె తండ్రి భారత్‌కు చెందిన ఇరానియన్ కాగా, తల్లి పర్షియన్. ఎయిర్ హోస్టెస్‌గా జీవితం ప్రాంభించిన మందనా కరిమి మోడలింగ్ వృత్తి చేపట్టింది. తర్వాత బాలివుడ్ నటిగా ఎదిగింది.

### నేపాల్ యువతరం ఆశలు నెరవేరేనా?

# రేపు పార్లమెంటు ఎన్నికలు



**కాఠ్మండు:** పేదరికం చిక్కగా పేరుకుపోయిన నేపాల్‌లో తమ కష్టాలు తీర్చే ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో గురువారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంకోసం మూడు రోజులు జాతీయ సెలవులు ప్రకటించారు. చెబుతున్నారు. 3,400 మంది పైగా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 1.90 కోట్లమంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. వీరిలో ఎనిమిది లక్షలమందికి మొదటిసారి ఓటు హక్కు వచ్చింది. కాగా 50 లక్షలమంది నేపాలీయులు వివిధ దేశాల్లో ప్రవాస జీవితం గడుపుతున్నారు. అత్యంత ఖరీదైన విమాన ఛార్జీలవల్ల వారంతా స్వస్థలాలకు వచ్చి ఓటువేసే అవకాశం చాలా తక్కువ. దేశంలోకి రాకపోకలు చేసే 20 నుండి 40 ఏళ్ళు వయసుగల నేపాలీ ఓటర్లు కూడా మంచి ప్రభుత్వం కావాలిన మార్పు కోరుకుంటున్నారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రవాసీయులు టెక్నాలజీ పద్ధతుల్లో ఓటు వేశారు. నేపాల్‌కు ఆ అవకాశం లేదు. దాదాపు 50 లక్షలమంది ప్రవాసీ ఓటర్లు ఓటు హక్కుకు దూరంగా ఉండటం దేశాభివృద్ధి లేకపోవడమేనని మానవహక్కుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏది అధికారంలోకి వచ్చినా పెట్టుబడులు ఆకర్షించడం దేశంలో ఉపాధి అవకాశాలు పెంచడంవైపు దృష్టిసారించాలి. లేకపోతే నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి చెప్పినట్లుగా దేశంలో మరోసారి జెనరేషన్ జెడ్ ఉద్యమం వచ్చే ప్రమాదం వస్తుంది. గురువారం ఓటింగ్ సందర్భంగా దిగువ సభలో ఉన్న 275 స్థానాలలో 165 నియోజకవర్గాల్లోనే ప్రజలు ప్రత్యక్షంగా ఓట్లు వేసి అభ్యర్థులను ఎన్నుకుంటారు. మిగిలిన 110 మంది సభ్యులను నిష్పత్తి ప్రాతిపదికపై ఎన్నుకుంటారు.

### కోటిమంది భారతీయుల భద్రత, సంక్షేమంపై

# గల్ఫ్ దేశాల నాయకులతో మోదీ మంతనాలు



**న్యూఢిల్లీ:** గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటిమంది భారతీయులు నివాసం ఉంటూ ఉండటంతో వారి సంక్షేమం, భద్రత గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మధ్యాహ్నం పలు దేశాల నాయకులతో ఫోన్ సంభాషణలు చేశారు. ముఖ్యంగా ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, ఖతార్, కువైత్, జోర్డాన్ దేశాల నాయకులతో మాట్లాడారు. ఆ దేశాలపై దాడులను ఆయన ఖండిస్తూ సంఘీభావం ప్రకటించారు. భారతీయుల క్షేమసమాచారాలను తెలుసుకున్నారు. యుద్ధం త్వరగా ముగియాలని ఆకాంక్షించారు.సమస్యాత్మక ప్రాంతాల్లో చిక్కుల్లో ఉన్న భారతీయులను వెనక్కు రప్పించే విషయాలను కూడా పరిశీలించారు. ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్, కువైత్ యువరాజు షేక్ సబాహ్ అల్-ఖలిద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సబాహ్, ఖతార్ పాలకుడు షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీలతో మోదీ ఫోన్‌లో సంభాషించారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూలతో సంభాషించారు. ఆయా దేశాలపై ఇరాన్ దాడులపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ నివసిస్తున్న భారత కార్మికులు, ఉద్యోగుల భద్రత గురించి ప్రధానంగా మాట్లాడారని అధికారులు ఓక ప్రకటనలో తెలియజేశారు. గడచిన రెండు రోజులుగా ప్రధానమంత్రి ఇతర నాయకులతో కూడా సంభాషించారు. బహ్రైన్ రాజు, సౌదీఅరేబియా యువరాజులతో మాట్లాడారు. ఇరాన్ చేస్తున్న దాడులను ఖండించారు. ఈ సంక్లిష్ట సమయంలో వారికి భారత్ సంఘీభావం ప్రకటిస్తోందని వారికి తెలియజేశారు. యుద్ధంలో తలమునకమైన ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా ఆ దేశంలోని పలు ప్రాంతాలలో భారతీయులు ఆందోళనతో ఉన్నారు. పెద్ద సంఖ్యలో భారతీయులు టెహ్రాన్, దుబాయ్, దోహా విమానాశ్రయంలో చిక్కుకున్నారు. పశ్చిమ దేశాల నుండి భారతీయులను వెనక్కు రప్పించేందుకు పరిమితస్థాయిలో విమానాలు నడుపుతోంది. జెడ్డా నుండి 10 విమానాలు నడుపుతామని ఇండిగో ప్రకటించింది. ఇప్పటికే దుబాయ్ నుండి ముంబై, చెన్నైలకు కొన్ని విమానాలలో భారతీయులు వచ్చారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ కూడా పరిమితస్థాయిలో పశ్చిమ ఆసియాలో ఎంపిక చేసిన ప్రాంతాలకు రాకపోకలను పునరుద్ధరిస్తారు. పశ్చిమ ఆసియా నుండి భారతీయులను తిరిగి రప్పించేందుకు ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలను పునరుద్ధరిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిరెణ్ రిజుజు చెప్పారు. 90 లక్షలమంది భారతీయులు ప్రవాసీయులుగా ఉండగా, మరో 10,000 వేలమంది భారత పౌరులున్నారు. విద్యాభ్యాసం, పనులమీద ఇజ్రాయెల్‌లో మరో 40,000 మంది నివసిస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా గగనతలాన్ని యుద్ధం కారణంగా దాదాపుగా మూసివేశారు. దీంతో అనేక విమానాశ్రయాల్లో భారతీయులు చిక్కుకుని ఉండటంతో క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ కమిటీ ఆదివారం సమావేశమై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలవల్ల నష్టపోయిన భారతీయులకు న్యాయం చేసేందుకు సిసిఎస్ సంబంధిత విభాగాలకు ఆదేశాలు ఇచ్చింది. గతంలో కూడా ఇలాంటి సమస్యే వచ్చినప్పుడు భారతదేశం చాలా విజయవంతంగా భారతీయులను దేశానికి తీసుకువచ్చింది.

## నేపాల్‌లో రోడ్డు ప్రమాదాలు.. 15 మంది మృతి

**నేపాల్:**నేపాల్‌లో పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 15 మంది మరణించారు. రాజధాని కాఠ్మండులో మంగళవారం ఉదయం బద్రి కొయిరాల అనే 48 ఏళ్ళ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చెత్తను తీసుకువెళ్ళే వాహనం ఆయన స్కూటర్‌ను ఢీకొట్టడంతో కొయిరాల మరణించారు. తీవ్రంగా గాయపడిన కొయిరాల ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించినట్లు పోలీసు ఉన్నతాధికారి చెప్పారు.



# మౌనం.. పలాయనవాదం!

ఉచితానుచితాలు మరచి మాట్లాడడం తప్పు. అయితే, అత్యవసర సమయాల్లో మౌనం వహించడం మహాతప్పు. అది పలాయనవాదానికి నిదర్శనం. రాజనీతిలో మాటలు ఆయుధాలంత శక్తివంతమైనవి. తుపాకులు, బాంబులు, ఆంక్షలు, ఒప్పందాలతో మాత్రమే కాదు... మాటలు, చర్చలు, సంఘీభావ సూచనల ద్వారా కూడా దేశాలు తమతమ స్థానం, విలువలు, నైతికతను వ్యక్తపరుస్తాయి. ఒక దేశ నాయకుడి మరణంపై సంతాపం వ్యక్తం చేయడం అనేది ఆ నాయకుడి విధానాలకు మద్దతు ఇవ్వడం కాదు. అది మానవీయతకు సంకేతం. అయితే ఇటీవల ప్రపంచ రాజకీయాల్లో చోటుచేసుకున్న ఒక ఘటన, ముఖ్యంగా భారత సమాజంలో కనిపించిన ప్రతిస్పందనలు, మనం ఈ ప్రాథమిక సత్యాన్ని మరిచిపోయామా అనే ప్రశ్నను తెరపైకి తెచ్చాయి. అమెరికా బాంబు దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. దీనిని ఒక వ్యక్తి మరణంగా కొందరు చూడవచ్చు. కానీ, అది అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమత్వం, ప్రపంచ శాంతి, భారత విదేశాంగ విధానాలకు సంబంధించిన పెద్ద ప్రశ్నలను లేవనెత్తిన కీలక సంఘటన. ప్రపంచ దేశాల స్పందనలు విభిన్నంగా ఉండగా, భారతదేశంలో కొంత మంది ఈ ఘటనను ఓ సంబరంగా చూడటం మరింత ఆందోళనకరం. ఇక్కడ చర్చ ఒక వ్యక్తి గురించి కాదు. ప్రపంచ వ్యవస్థ తీరుతెన్నుల గురించి. శక్తి ఆధారిత వ్యవస్థ ఉండాలా లేక నిబంధనల ప్రకారం నడిచే వ్యవస్థను కోరుకోవాలా? అనే ప్రశ్న గురించి. ఈ ఘటనలో ఒక సార్వభౌమ దేశాధినేతను లక్ష్యంగా చేసుకుని సైనిక దాడి జరిగింది. కానీ, ఆ వ్యక్తి చేసిన నేరం ఏమిటో అమెరికా ఇప్పటి వరకూ స్పష్టం చేయనేలేదు. అణ్వస్త్రాల తయారీకి సన్నాహాలు చేస్తున్నారనే అనుమానాలు తప్ప ఖమేనీపై తీవ్రమైన నేరారోపణలు ఏవీ చేయలేదు. అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణ జరగలేదు. శిక్ష పడలేదు. చివరికి, ఖమేనీపై చర్యకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అనుమతి కూడా ఇవ్వలేదు. ఇన్ని రకాలుగా అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘనలు జరిగినప్పటికీ, ఇదేమిటని భారత్ ప్రశ్నించకపోవడంలో ఔచిత్యం ఏమిటి? అనాదిగా భారతదేశం తనను తాను శాంతి, అహింస, నైతికతకు ప్రతీకగా ప్రపంచానికి పరిచయం చేసుకుంటూ వచ్చింది. ఇది యుద్ధాలకాలం కాదనే భావనను భారత నాయకత్వం పలుమార్లు వ్యక్తం చేసింది. అయితే ఒక సార్వభౌమ దేశ అత్యున్నత నాయకుడు బాంబు దాడిలో మరణించినప్పుడు భారత స్పందన ఏమిటి? రాజనీతిలో సంతాపం ప్రకటించడం రాజకీయ మద్దతు అనిపించుకుంటుందా? ప్రతి సంఘటనను వ్యూహాత్మక సంబంధాల లెక్కలతో మాత్రమే కొలిస్తే, విదేశాంగ విధానంలో నైతికతకు స్థానం ఎక్కడ? మన దేశ విదేశాంగ విధానం వ్యూహాత్మక స్వతంత్రతపై నిర్మితమైంది. కానీ మన స్పందనలు మిత్రదేశాల అభిప్రాయాలపై ఆధారపడుతున్నట్లు కనిపిస్తే, ఆ స్వతంత్రత ఎంతవరకు నిలుస్తుంది? భారత్–ఇరాన్ మధ్య సంబంధాలు నిన్నమొన్నటివి కావు. శతాబ్దాల సాంస్కృతిక, వాణిజ్య, వ్యూహాత్మక భాగస్వామ్యాల ఫలితం. అటల్ బిహారీ వాజ్‌పేయి కాలంలో సైతం రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. తరువాతి కాలంలో కూడా ఈ సంబంధాలు మరింత బలపడ్డాయి. అనేక రకాలు గా భారత్‌ను ఇరాన్ సమర్థించింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరిగిన వేళ, చాబహార్ పోర్ట్ వినియోగానికి అనుమతిచ్చింది. అమెరికా ఆంక్షలు విధించినప్పుడు, భారత్‌కు ఇరాన్ అండగా నిలిచింది. ఇంధన సరఫరాలో సౌలభ్యాలు ఇచ్చింది. డాలర్లకు బదులుగా రూపాయిల్లో వాణిజ్యం కొనసాగించిన అరుదైన దేశాల్లో ఇరాన్ ఒకటి. భారత బ్యాంకుల్లో ఇరాన్ నిధులు నిల్వ ఉండటం ఆర్థిక వ్యవస్థకు కూడా సహాయపడింది. అలాంటి దేశ నాయకుడు హత్యకు గురైనప్పుడు కనీస మానవీయ స్పందన అవసరం కాదా? ఇక, ఇరాన్ యుద్ధం తరువాత వచ్చిన అస్తవ్యస్త పరిస్థితులు యావత్ ప్రపంచానికి ప్రమాదకరమైన హెచ్చరికలు చేస్తున్నాయి. ఒక బలసంపన్నమైన దేశం ఇతర దేశ ప్రభుత్వాల చెల్లుబాటును నిర్ణయించడం ప్రారంభిస్తే, అంతర్జాతీయ వ్యవస్థ సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్లిపోతుందనే చేదు నిజాన్ని తెరపైకి తెచ్చింది. ఒక నాయకుడి విధానాలపై విమర్శ చేయడం ప్రజాస్వామ్య హక్కు. ఇరాన్ అంతర్గత రాజకీయాలు, మానవహక్కుల అంశాలపై విమర్శలు ఉండవచ్చు. కానీ విమర్శకు, హత్య మధ్య స్పష్టమైన అంతరం ఉంది. ఆ గీత చెరిగిపోతే అంతర్జాతీయ నైతిక వ్యవస్థ కుప్పకూలుతుంది. బలాన్ని, బలగాన్ని అడ్డం పెట్టుకొని ఒక దేశం తనకు తానుగానే ప్రపంచ పోలీసుగా వ్యవహరించి శిక్షలు విధించే హక్కు ఎక్కడి నుంచి వచ్చింది? అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను పక్కనబెట్టి తీసుకున్న చర్యలు భవిష్యత్తులో ప్రమాదకర నమూనాగా మారతాయి. ఇదే సమయంలో, ఒక దేశాధినేత మరణాన్ని సిద్ధాంత విజయంగా చూడడం మరింత పతనానికి నిదర్శనం. వసుధైవ కుటుంబకం అని చెప్పే నాగరికతగా మనం ప్రపంచాన్ని కుటుంబంగా భావించాలి. కానీ ఒక నాయకుడు ముస్లిం దేశానికి చెందినవాడని కారణంగా ఆనందించడం జరిగితే, సామాజిక విలువలకు అర్థం ఏమిటి? రేపటి భవిష్యత్తుకు స్పష్టత ఎక్కడ? జాతీయత అంటే ఇతర దేశాలకు జరిగే అన్యాయాలపై మౌనం వహించడమా లేక న్యాయం కోసం గళమెత్తడమా? సమాధానం చెప్పి తీరాలి. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశం మనది. రాజ్యాంగ స్ఫూర్తి గా ప్రపంచ శాంతిని కోరుకునే దేశం మనది. ఇప్పుడు ఒక బలమైన దేశానికి భయపడి మౌనం వహించిన దేశంగా కూడా భారత్ చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. బలాధిక్య ప్రపంచానికి మద్దతునిస్తూ, చట్టాలు, నైతిక విలువలను నట్టేట ముంచడానికి సిద్ధమైన దేశంగా ముద్ర వేయించుకుంటుంది. వెనిజులా అధ్యక్షుడు మదురోను, ఆయన నివాసంపై దాడి చేసి మరీ అపహరించినప్పుడు మన ప్రభుత్వానిది మౌనమే. ఇప్పుడు ఖమేనీ మరణం పట్ల కూడా అదే మౌనం. ఇది భయం, బలం, ఆధిపత్యం ఆధారంగా నడిచే ప్రపంచాన్ని అంగీకరించే మనస్తత్వం. న్యాయం, శాంతి, మానవీయత ఆధారంగా నడిచే ప్రపంచాన్ని నిజంగానే కోరుకుంటే, కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకురాలు సోనియా గాంధీ డిమాండ్ చేసినట్టు, అమెరికా అరాచకాలపై భారత్ పెదవి విప్పాలి. మధ్య ఆసియా పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలి. దేశం మొత్తం ఒకటిగా నిలిచి, ప్రపంచానికి విస్పష్టమైన సందేశం ఇవ్వాలి. లేకపోతే, పలాయన వాదులుగా, చరిత్రహీనులుగా మిగిలిపోతాం.



## అంతర్- మంత్రిత్వ బృందం ఏర్పాటు

**పశ్చిమ ఆసియాలో పరిణామాలను రోజువారీగా పర్యవేక్షించడానికి, షిప్పింగ్, లాజిస్టిక్స్, ఎగుమతులు, కీలకమైన దిగుమతులలో సంభావ్య దుర్బలత్వాలను అంచనా వేయడానికి ప్రభుత్వం ఒక అంతర్- మంత్రిత్వ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన తరువాత పశ్చిమ ఆసియా ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు షిప్పింగ్ మార్గాలకు అంతరాయం కలిగించవచ్చు. రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలను పెంచుతాయని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతి సంబంధిత అధికారాలలో విధాన పరమైన ఆవశ్యకత; సజావుగా క్లియరెన్స్ ఉండేలా కస్టమ్స్, పోర్ట్ అధికారులతో సమన్వయం; ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడటానికి ఆర్థిక, బీమా సంస్థలతో నిమగ్నమవ్వడం వంటి చర్యల ద్వారా వాణిజ్య కార్యకలాపాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది.**

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి
పియూష్ గోయల్




## గాల్లో దీపాలు.. పని ప్రదేశాల్లో కార్మికులు

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనుల్లో నిమగ్నమై ప్రమాదం జరగడంతో ఎనిమిది మంది విగత జీవులు అయ్యారనే వార్త విని అందరం షాక్‌కు గురి అయ్యాం. భద్రీనాథ్ సమీపాన మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 55 మంది సిబ్బంది గ్రేసియర్ విరిగిపడిన ఘటనలో 55 మంది మంచులో చిక్కుకున్నట్లు, అందులో 50 మందిని కాపాడినట్లు, నలుగురు మరణించి ఉంటారని, మరో ఐదుగురి ఆచూకీ దొరకలేదని తెలిసి విచారం వ్యక్తం చేశాం. ఈ విధమైన దుర్ఘటనలు తరుచుగా జరగడం సర్వసాధారణం కావడం సోచనీయం. ఇలా పని ప్రదేశాల్లో లేదా పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రామికులు భద్రత కొరవడిన కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురికావడం లేదా ప్రాణాలు సహితం కోల్పోవడం జరుగుతున్నది.

**జాతీయ భద్రతా దినోత్సవం––2026 ఇతివృత్తం:**
పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రాణాపాయ సంఘటనలను నివారించడానికి వృత్తిపరమైన భద్రతా అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భావించి 04 మార్చి 1966న నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పడటానికి గుర్తుగా 1972 నుంచి ప్రతి ఏటా జాతీయ భద్రత దినోత్సవం లేదా నేషనల్ సేఫ్టీ డేను 04 మార్చిన నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ భద్రత దినోత్సవం ఇతివృత్తంగా భద్రత పెంపొందించడానికి అవగాహన, సాధికారత కల్పన, భద్రతలో నిమగ్నం చేద్దాం అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వృత్తిపరంగా పనిచేసే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు జరిగినపుడు స్వల్ప నష్టాలు కూడా నమోదు కాకుండా ఉండడానికి కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహన కల్పించడం, భద్రతా చర్యలను పెంచడం, ఉద్యోగులు, పౌర సమాజానికి కనీస అవగాహన కల్పించడమే లక్ష్యంగా జాతీయ భద్రత దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. జాతీయ భద్రత దినోత్సవంతో పాటు జాతీయ భద్రత వారోత్సవాల(నేషనల్ సేఫ్టీ వీక్)ను కూడా 04 మార్చి నుంచి 10 మార్చి వరకు నిర్వహిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి వృత్తిపరమైన భద్రత కనీస అవసరం అని తెలుసుకుందాం.

వృత్తిపరమైన భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, సంబంధిత వర్గాలకు అవగాహనతో పాటు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను చర్చించడానికి జాతీయ భద్రతా దినోత్సవ వేదికలు గత 55 ఏండ్లుగా ఉపయోగపడుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో పని ప్రదేశాలను సురక్షిత కేంద్రాలుగా మార్చడానికి నడుం బిగిద్దాం, స్వల్ప గాయాలు కూడా నమోదు కాని పరిస్థితులను కల్పిద్దాం. *(04 మార్చి జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా)*

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కొత్త లేబర్ కోడ్‌లు... గ్రాట్యుటీ చిక్కులు..

డా. జ్ఞాన్ పాఠక్

దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి పూర్తిస్థాయిలో అమల్లోకి రావడానికి సిద్ధమవుతున్న కొత్త కార్మిక కోడ్లు ప్రకారం భారతదేశంలోని ఎక్కువమంది కార్మికులకు గ్రాట్యుటీ అందని ద్రాక్షగానే మారనుంది. దానితోపాటు సెలవు నగదు (సెలవుల్లో పనిచేసినందుకు పొందే నగదు)నిబంధనలు కూడా అత్యధిక శాతం మందికి వర్తించవని తాజా అధ్యయనం వెల్లడించింది. భారతదేశంలో మూడీస్ అనుబంధ సంస్థ ఐసిఆర్‌ఎ (ICRA) విడుదల చేసిన అంచనా ప్రకారం దేశంలోని సుమారు 85 శాతం కార్మికులు గ్రాట్యుటీ, సెలవు నగదీకరణ ప్రయోజనాలకు అనర్హులు. 2025 నవంబర్ 21 న కొత్త కార్మిక కోడ్లను ప్రకటించిన తర్వాత, అవి చట్టబద్ధంగా అమల్లోకి వచ్చాయి. అనేక కంపెనీలు వాటి అమలు ప్రక్రియను ప్రారంభించాయి. ఈ కొత్త కోడ్లు కారణంగా ఈనెల 31వ తేదీతో ముగిసే ఆర్థిక సంవత్సరంలోని మూడవ త్రైమాసికంలో ఒకసారి మాత్రమే చెల్లించాల్సిన గ్రాట్యుటీతోపాటు, సెలవు నగదీకరణ కూడా జరపాల్సి అవసరం ఏర్పడింది. కానీ, దేశంలో చాలా మంది స్వయం ఉపాధి పొందుతున్నారు లేదా చిన్న సంస్థల్లో పనులు చేస్తున్నారు. ఫలితంగా, 56 కోట్ల మంది కార్మికుల్లో కేవలం 15 నుంచి 20శాతం మందికే గ్రాట్యుటీ అర్హత పరిమితమవుతుందని ఐసిఆర్‌ఎ పేర్కొంది.

ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఒకసారి చెల్లించాల్సిన ఖర్చులు చేరినప్పటికీ, కార్పొరేట్ రంగ ఆదాయాలపై కొత్త కార్మిక కోడ్లు ప్రభావం పరిమితంగానే ఉందని తెలిపింది. ముఖ్యంగా ఐటి, సాఫ్ట్‌వేర్, మానవ వనరుల సేవలు, వినియోగదారులపై ఆధారపడే కొన్ని రకాల ఇతర రంగాల్లో మాత్రమే ప్రభావం ఎక్కువగా కనిపించింది. దేశవ్యాప్తంగా చూస్తే, కార్పొరేట్ రంగంలో ఈ కోడ్ల వల్ల కలిగే ఆర్థిక ప్రభావం తక్కువగానే ఉంది. లిస్టెడ్ కంపెనీలపై వార్షిక ప్రభావం పది బేసిస్ పాయింట్ల కంటే కూడా తక్కువగా ఉంటుందని అంచనా. మూడో త్రైమాసికంలో గ్రాట్యుటీ ఖర్చులు ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో వీటి ప్రభావం పరిమితంగానే ఉంటుందని అంటున్నారు. సిబ్బందికి ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండే రంగాల్లో కొత్త కోడ్ల వల్ల గ్రాట్యుటీ, సెలవు నగదుకు కొంత ఎక్కువ మొత్తం ఖర్చవుతుంది. దీనిని ఐటి, సాఫ్ట్‌వేర్, మానవ వనరుల సేవలు, వినియోగదారుల సేవలు తదితర రంగాల్లో ప్రముఖంగా చూడవచ్చు. కాబట్టి ఈ రంగాల్లోని కంపెనీలపై కొత్త నిబంధనల ప్రభావం ఎక్కువ. పెద్దపెద్ద ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీల విషయంలో ఈ ప్రభావం వార్షిక ఆపరేటింగ్ లాభాల్లో (ఒపిబిఐటిడిఎ) సుమారు 3.5–4.0 శాతం వరకు మాత్రమే ఉండగా, మానవ వనరుల సేవా సంస్థల్లో అకౌంటింగ్ విధానాల తేడాల కారణంగా ఇలాంటి ప్రత్యేక ఖర్చులు 0 నుండి 43 శాతం వరకు ఎంతైనా ఉండవచ్చు. కొత్త కోడ్ల కారణంగా, భవిష్యత్తులో కూడా గ్రాట్యుటీ చెల్లింపు సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ఖర్చులను పునర్వ్యవస్థీకరించడం, సేవల ధరల్లో మార్పులు చేయడం వంటి చర్యల ద్వారా కంపెనీలు ఈ ప్రభావాన్ని సులభంగానే ఎదుర్కొంటాయని ఐసిఆర్‌ఎ అభిప్రాయపడింది.

భారతదేశంలో అతిపెద్ద కార్మిక శక్తి ఉన్నప్పటికీ, గ్రాట్యుటీ ప్రయోజనాలు మాత్రం కొద్ది మందికి మాత్రమే పరిమితమై ఉన్నాయని ఐసిఆర్‌ఎ అధ్యయనం గుర్తించింది. దేశంలో మొత్తం 56 కోట్ల మంది కార్మికుల్లో సుమారు 25 కోట్ల మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారు. 16 కోట్ల మంది ఐటి, ఆర్థిక సేవలు, కమ్యూనికేషన్, విద్య, ఆరోగ్యం, వాణిజ్యం, ఆతిథ్య, రవాణా వంటి రంగాల్లో సేవారంగాల్లో ఉన్నారు. 7 కోట్ల మంది నిర్మాణ రంగంలో, 6.5 కోట్ల మంది తయారీ రంగంలోనూ పనిచేస్తున్నారు. వ్యవసాయేతర రంగాల్లో పని చేసే కార్మికుల్లో కూడా అత్యధిక శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నారు లేదా 10 మందికంటే తక్కువ ఉద్యోగులు ఉన్న చిన్న సంస్థల్లో పనిచేస్తున్నారు. సామాజిక భద్రత కోడ్ 2020 ప్రకారం గ్రాట్యుటీ నిబంధనలను నవీకరించినప్పటికీ, అవి 10 లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. అంటే ఇది, 1972 గ్రాట్యుటీ చెల్లింపు చట్టంతో సమానంగా ఉంది. ఫలితంగా ప్రస్తుతం భారతదేశ మొత్తం కార్మిక శక్తిలో కేవలం 15 నుంచి 20 శాతం మందికే గ్రాట్యుటీ వర్తిస్తుందని అంచనా. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను సామాజిక భద్రత నిబంధనల్లో చేర్చినప్పటికీ, అధికారిక యజమాని–ఉద్యోగి సంబంధం లేకపోవడం వల్ల వారికి గ్రాట్యుటీ ప్రయోజనాలు వర్తించవు.

2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చిన సామాజిక భద్రత కోడ్ 2020 ప్రకారం గ్రాట్యుటీ నియమాల్లో రెండు ప్రధాన మార్పులు చోటుచేసుకున్నాయి. ఉద్యోగులు ఒక సంవత్సరం పాటు స్థిరంగా సేవలు అందించిన తర్వాత, గ్రాట్యుటీకి అర్హులవుతారు. అయితే పర్మనెంట్ ఉద్యోగుల కోసం ఐదు సంవత్సరాల కనీస సేవా నిబంధన కొనసాగుతుంది. ప్రాథమిక వేతనం, డిఎ, రిటైనింగ్ అలవెన్స్ కలిపి మొత్తం వేతనంలో కనీసం 50 శాతం ఉండాలి. దీనివల్ల గతంలో తక్కువ బేసిక్ వేతనం చూపిన కంపెనీలపై గ్రాట్యుటీ బాధ్యత పెరిగింది. కాగా, కొత్త వేతన నిర్వచనం కార్పొరేట్ భారతదేశ ఆర్థిక ఫలితాలపై స్వల్ప ప్రభావం చూపిందని అధ్యయనం పేర్కొంది. తప్పనిసరి సెలవు నగదీకరణ, స్పష్టమైన ఓవర్‌టైమ్ నియమాలు కూడా అదనపు ఆర్థిక ప్రభావాన్ని కలిగించాయి. ముఖ్యంగా ఎక్కువ గంటలు పనిచేసే సహాయక ఉద్యోగాల్లో ఇది అధికం.

గ్రాట్యుటీ అర్హతను విస్తరించిన కొత్త కోడ్లు, గిగ్ కార్మికులకు సామాజిక భద్రత పరిరక్షణను కూడా పెంచాయి. దీని వల్ల దీర్ఘకాలంలో సంస్థలపై సామాజిక భద్రత బాధ్యతలు పెరిగే అవకాశం ఉంది. ఫ్రీలాన్సర్లు లేదా ప్రాజెక్ట్ ఆధారిత ఉద్యోగులను నియమించే కంపెనీలు కొత్త నిధుల కేటాయింపు, నివేదిక విధానాలను అనుసరించాల్సి రావచ్చు. ఫలితంగా కొత్త సంస్థల నమోదు విధానాలు, వలస కార్మికులపై కఠిన నియమాలు, ఆరోగ్యం, భద్రత ప్రమాణాల పెంపు వంటి నిబంధనలను పాటించడం కంపెనీలకు సులభసాధ్యం కాకపోవచ్చు. అదే సమయంలో, మహిళలు రాత్రి పూట పనిచేయడానికి అనుమతి ఇవ్వడం వల్ల భద్రత, రవాణా ఏర్పాట్లపై సంస్థలు అదనపు దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కార్మికుల నైపుణ్యాలను పెంచుకోవడానికి వీలుగా, వారు చివరిలో పొందిన వేతనంలో 50 శాతం మొత్తాన్ని 'రీ స్కిల్లింగ్ ఫండ్'కు విరాళంగా ఇవ్వాలన్న నిబంధన ఉంది. విస్తృత స్థాయిలో ఉద్యోగ నియమావళిని అమలు చేయడం, అధికారిక ఫిర్యాదు కమిటీల ఏర్పాటు వంటి అంశాలు సంస్థల నిర్వహణ వ్యయాలను పెంచవచ్చు. ఈ నిబంధనలు మరింత వ్యవస్థీకృత మానవ వనరుల నిర్వహణ అవసరాన్ని పెంచుతాయి.

ఇక గ్రాట్యుటీ విషయానికి వస్తే, దాని అమలు అనేది అర్హత అంశాలపై ఆధారపడదు. పర్మనెంట్ ఉద్యోగిగా ఉన్నాడా? లేదా? సదరు ఉద్యోగానికి వేతనం పొందుతున్నాడా? లేదా? అనే అంశాలు గ్రాట్యుటీ అర్హతను నిర్ణయిస్తాయి. వీటితోపాటు సదరు కంపెనీ లేదా సంస్థలో కనీసం పదిమంది ఉద్యోగులు ఉన్నారా? లేదా? అనేది కూడా గ్రాట్యుటీ విషయంలో కీలకం. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో కేవలం 15 నుంచి 20 శాతం మాత్రమే వేతన ఉద్యోగాల్లో ఉండగా, మిగిలిన వారిలో 55 నుంచి 60 శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. 15 నుంచి 20 శాతం మంది కుటుంబ ఆధారిత పనుల్లో నిమగ్నమై, ప్రచ్ఛన్న నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు.

కొత్త కార్మిక కోడ్లు అమలు కారణంగా లిస్టెడ్ కంపెనీల నిర్వహణా లాభాలు వార్షికంగా కనీసం 10 బేసిస్ పాయింట్లు తగ్గుతాయని అంచనా. ఐసిఆర్‌ఎ పరిశీలించిన 1,650 కంపెనీల నివేదికలను అనుసరించి ఇది సుమారు రూ. 8,000 కోట్లకు సమానం. ఈ సమస్య నుంచి బయటపడేందుకు కంపెనీలు భవిష్యత్తులో ఈ అదనపు ఖర్చును వినియోగదారులుకు బదిలీ చేస్తాయి. లేదా వ్యయ విధానాలను మార్చుకుంటాయి. తద్వారా ఖర్చులను తగ్గిస్తాయి. మానవ వనరుల రంగం పూర్తిగా మానవ శ్రమపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, ఇందులో ఉద్యోగుల ఖర్చులు అధికంగా ఉంటాయి. భారీ స్థాయిలో నియామకాలు జరుగుతాయి. అదే స్థాయిలో వారి సేవలను వినియోగించుకుంటారు. కాబట్టి, సేవా రంగాల్లో ఉద్యోగి వ్యయం ప్రధాన ఖర్చుగా ఉంటుంది. భారీ కార్పొరేట్ కంపెనీలపై కొత్త కోడ్ల కారణంగా వచ్చే సమస్య చెప్పుకోదగినది కాకపోవచ్చుగానీ, చిన్నాచితకా కంపెనీలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటాయి. టీమ్‌లీజ్ సర్వీసెస్ సంస్థ ప్రకారం, కొత్త కార్మిక కోడ్లు ఆయా కంపెనీలకు లభించే లాభాలపై ప్రభావం చూపవు. ఎందుకంటే, ఆ కంపెనీలు తాము చెల్లించాల్సిన గ్రాట్యుటీ, సెలవు నగదీకరణ వంటి అదనపు చట్టబద్ధ ఖర్చులను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తాయి. ఎన్‌ఐఎస్ మేనేజ్‌మెంట్ సంస్థ కూడా, దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. లాభాలను తగ్గించుకోకుండా, గ్రాట్యుటీ, సెలవు నగదు వంటి ఖర్చులను వినియోగదారులపైకి నెట్టేస్తాయి. ఈ కోణంలో చూస్తే, కొత్త లేబర్ కోడ్స్ వల్ల కార్పొరేట్ కంపెనీలకు పోయేదేమీ లేదు.

*(ఐపిఎ సర్వీసు)*

## విప్లవాత్మక మార్పులతోనే 'విద్యారంగం' పటిష్ఠం

తెలంగాణ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టడం శుభపరిణామం. ధనికులకే కాకుండా సామాన్యులకు సైతం కార్పోరేట్ విద్యను ఉచితంగా అందించేందుకు గాను ప్రభుత్వం విద్యా వ్యవస్థ లో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం (2026–27) నుండే రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లోని 100 మండలాల్లో 200 పాఠశాలలను అత్యున్నత ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'గా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు సిఎం ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం నిరుపేద విద్యార్థుల పాలిట వరంగా మారనుంది. సచివాలయంలో తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని బృందం సమర్పించిన 'తెలంగాణ విద్యా విధానం 2026 సమగ్ర విద్యా దృక్పథం' నివేదికపై సిఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ చర్చచేసి, నూతన విధానం కింద, ఎంపిక చేసిన పాఠశాలల్లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌళిక సదుపాయాలు, బోధనా పద్ధతులతో కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, నిరుపేదలకు ఉచితంగా విద్యను అందించనున్నట్లు తెలిపారు. వీటికి అవసరమైన బడ్జెట్‌ను రాబోయే ఆర్థిక సంవత్సరంలో కేటాయించనున్నట్లు సిఎం హామీ ఇచ్చా రు.

**12 అధ్యయనాలతో 'సమగ్ర' నివేదిక**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2000 పాఠశాలలను అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాఠాలను దృశ్య రూపంలో వివరించేందుకు ఏర్పాటు, క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయాలని కమిషన్ ప్రతిపాదించింది. ప్రతి పాఠశాలకు సుమారు 1500 మంది విద్యార్థు ల సామర్థ్యం ఉండేలా చూస్తూ, చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులను తీసుకు రావడానికి ప్రత్యేక స్కూల్ బస్సు నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రీస్కూల్ నుండి యూనివర్సిటీ విద్య వరకు, అలాగే ఓపెన్ లెర్నింగ్, సాంకేతిక విద్య, పాలనా సంస్కరణలపై 12 అధ్యాయాలతో కూడిన సమగ్ర నివేదికను కమిషన్ రూపొందించింది.

**నాణ్యమైన విద్యకే...ప్రభుత్వం కసరత్తులు**

విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, డాక్టర్ చరకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డిలు గత 14నెలలుగా ఈ నివేదికపై విస్తృత కసరత్తు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 305 విద్యా సంస్థలను సందర్శించారు. పంజాబ్, హర్యానా, కేరళ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా, వియత్నాం, అమెరికా వంటి దేశాల్లోని ప్రభుత్వ పాఠశాలల పనితీరును అధ్యయ నం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, గ్లోబల్ ఎక్స్‌పర్ట్స్‌తో కలిపి మొత్తం 54 సమావేశాలు, 10 సెమినార్లు నిర్వహించి, ఈ ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ సరికొత్త విద్యా విధానం ద్వారా తెలంగాణ పిల్లలకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఉపాధి కోర్సులకు ఊతమివ్వాలి**

మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను ఆధునికీకరించి, విద్యార్థులకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా లభించేందుకు మరిన్ని నూతన ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే విద్యార్థులకు సంబంధిత కోర్సుల్లో మెలకువలు, నైపుణ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తూ తగిన అర్హత,అనుభవజ్ఞులచే బోధన చేయించాలి. తద్వారా విద్యార్థులతో పాటు ఆయా రంగాల్లో నిపుణులకు, సంబంధిత కోర్సులు పూర్తి చేసి న నిరుద్యోగులకు సైతం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

ఈదునూరి మహేష్

లేఖలు

## ప్రజాస్వామ్యంలో వారసత్వ రాజకీయాలు

ప్రపంచ రాజకీయ యవనికిపై వారసత్వ రాజకీయాలు అనేటివి కొత్తేమీ కాదు. వారసత్వ రాజకీయాలు కొందరికి మాత్రమే కలిసి వస్తాయి. మరికొందరికి మరిచిపోలేని అనుభవాన్ని మిగులుస్తాయి. మన సమాజంలో వ్యాపార నేపథ్యం కలిగిన కుటుంబాల నుంచి వచ్చే వారసులు వ్యాపారాలనే కొనసాగించడం, కుల వృత్తి నేపథ్యం నుండి వచ్చిన వారు అదే వృత్తిని కొనసాగించడం ఆనవాయితీగా చూస్తుంటాం. అలాగే రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబాల నుంచి వస్తున్న వారసులు రాజకీయాలనే ఎంచుకొని కొనసాగాలనుకోవడం కూడా సహజం. కానీ వారసత్వ రాజకీయాల వల్ల జరిగే లాభనష్టాలను ఒక్కసారి విశ్లేషించి చూస్తే, అంబేద్కర్ చెప్పినట్టు సంఘంలో అందరికీ సమానస్థాయి అవకాశాలు కల్పించాలి అంటే ముందుగా యువ నాయకత్వానికి అవకాశాలు ఇవ్వాలి. అలాగే యువత రాజకీయాల్లోకి రావాలి అనే నినాదం రాజకీయ వారసుల ఆగమనంతో ప్రశ్నార్ధకంగా మారే అవకాశం ఉందా అనేదే ఇక్కడ ప్రశ్న. ఎందుకంటే వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి సవాలుగా మారాయనే విమర్శ లు సమాజంలో ఎలాగూ ఉన్నాయి కాబట్టి. అమెరికా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో మరియు ఆసియా దేశాలైన భారత్, జపాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, సింగపూర్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలలోని ప్రధాన రాజకీయ పార్టీలలో వారసత్వ రాజకీయాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అలాగే మన దేశ రాజకీయాలను, రాజకీయ పార్టీలను పరికించి చూస్తే లెక్కకు మిక్కిలి రాజకీయ వారసులు కనిపిస్తారు. జాతీయ పార్టీలు మొదలు ప్రాంతీయ పార్టీల వరకు వారసుల ఆగమనంతో ఆయా పార్టీలు వారసులకు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. దేశంలో ప్రధానంగా వారసత్వాన్ని కొనసాగిస్తు న్న రాజకీయ పార్టీలు కాంగ్రెస్, ఎస్పీ, ఆర్‌జెడి, ఎన్సీపి, శివసేన, డిఎంకె, టిడిపి, జెకెఎన్సీ, జెకెపిడిపి, ఐఎన్‌ఎల్ డి, జెడిఎస్‌లతో పాటు తెలంగాణలోని బిఆర్‌ఎస్ తదితర పార్టీ లు తమ తమ వారసులను నాయకులుగా ప్రజాక్షేత్రంలో నిలబెట్టాయి. ఇక వీటికి తోడు కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న బిజెపి వారసత్వంలో కాంగ్రెస్‌ను వెనక్కు నెట్టి ఉత్తర భారతదేశంలో అనేక రాష్ట్రాలలో వారసులతోనే విరాజిల్లుతూ వారసత్వ రాజకీయ క్రీడలో అగ్రభాగాన ఉందని చెప్పక తప్పదు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం వల్ల వారివారి రాజకీయ పార్టీలను వేదికగా చేసుకొని అధికారాన్ని చేపట్టడం అంటే పరోక్షంగా కుటుంబ పాలనను బలోపేతం చేస్తూ, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే యువ నాయకత్వాన్ని సవాలు చేయడంగానే భావించాలి. తెలుగు రాష్ట్రాల్లో పాతతరం రాజకీ య నాయకుల వారసులుగా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారు చాలామంది ఉన్నారు. తెలంగాణ ఉద్యమానికి, మరియు రాష్ట్ర రాజకీయాల్లో మెరికల్లాంటి యువనాయకత్వాన్ని అందించిన బిఆర్‌ఎస్ పార్టీలో కూడా వారసత్వ రాజకీయాలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చాలామంది వారసత్వ రాజకీయ నాయకులు రాజకీయ నేపథ్యంలేని వారి తో పోలిస్తే తక్కువ ప్రయత్నంతో రాజకీయ స్థానాలను చేరుకోగలిగారు. ఇందుకు వాళ్లు పెద్దగా శ్రమ పడాల్సిన పనిలేదు. పైగా పూర్వీకుల నుండి వస్తున్న రాజకీయ సంబంధాల నేపథ్యం వారికి ఇతోధికంగా ఉపయోగపడుతుంది. నెపోటిజం (బంధుప్రీతి) రాజకీయ, సినిమారంగాల్లో విపరీతంగా కనిపిస్తుంది.వివిధ రాజకీయ వేదికల నుండి వచ్చిన వారసత్వ నాయకులకు చట్టాలు, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం ఉండదు అనే అపోహ జనంలో ఉంది. రాజకీయ వారసులు అందరు ఈ కోవ లో కి రాకపోవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో వారిపట్ల కొన్ని అపోహలు ఉన్న మాట మాత్రం వాస్తవం. రాజకీయ వారసుల ఆరంగేట్రం వల్ల రాజకీయాల్లో నిబద్ధతగా కొనసాగాలనుకునే సామాన్య మధ్యతరగతి యువతకు సమాన అవకాశాలు దక్కవనే వదంతులు కూడా లేక పోలేదు. ఈ నేపథ్యంలో ఎప్పుడో ఆదిమజాతి సమాజం నుండి ('సమూహానికి పెద్ద తరహా లో) అమలవుతున్న వారసత్వ విధానాలను ఇంకా ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా కొనసాగించాలని చూడటం బాధాకరం.

దేశంలో సుమారు 150 కోట్ల జనాభా, వేల కులాలు, ఎక్కడాలేని అసమానతలు, సామాజిక రుగ్మతలు, వీటన్నింటి నడుమ రాజకీయంగా సమాన అవకాశాలు అందరికీ దక్కాలంటే అమెరికా లాంటి దేశాల్లో అధ్యక్ష్య పదవికి అమలవుతున్నట్లు మన దేశంలో కూడా రాజకీయ పదవులకు ఎన్నికైన రెండు పర్యాయాల తర్వాత మళ్ళీ రాజకీయ పదవులకు అర్హత లేకుండా చట్టం ఉంటేనే ఆర్థిక లేమితో రాజకీయాలు అందని ద్రాక్షలా ఉన్న కింది జాతు ల యువత రాజకీయంగా సమాన అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. నిజానికి ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలి అంటే విలువలతో కూడిన రాజకీయం అవసరం కనుక రాజకీయ పక్షాలు ప్రజా సమస్యలపై కొట్లాడుతూ, ప్రజల ను చైతన్య పరుస్తున్న చదువుకున్న యువతకు రాజకీయ అవకాశాలు కల్పించి ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టాలి. అప్పుడు మాత్రమే సమ సమాజ స్థాపనకు ముందడుగు పడుతుంది.

ధీరన్ కొడారి

## అంగన్ వాడీ కేంద్రాలకు విద్యుత్ వెలుగులు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు ఉచిత కనెక్షన్లతో విద్యుత్ వెలుగులు అందిస్తున్నట్లు జగిత్యాల ఎన్పిడిసిఎల్ ఎస్ఇ సుదర్శనం పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఇ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్‌కు వెలుగులు నింపే అంగన్‌వాడీ కేంద్రాలకు విధ్యుత్ సౌకర్యం కల్పించడంలో ఎన్పిడీసీఎల్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ లేని అంగన్ వాడీ కేంద్రాల నిర్వాహకులు ఉచిత విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించి కనెక్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ వెలుగులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తీగునీటి మోటార్లు తదితర పరికరాలు సక్రమంగా పనిచేయడంతో పిల్లలు సౌకర్యమంతమైన వాతావరణంలో విధ్యను అభ్యసించగలుగుతున్నారన్నారు.

## అర్ధరాత్రి దొంగల హల్ చల్

### మల్యాల ఎక్స్ రోడ్ లో బైక్ చోరీ

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల అడ్డరోడ్‌లో అర్ధరాత్రి దొంగలు హల్ చల్ సృష్టించారు. సోమవారం అర్ధరాత్రి ఒకే సమయంలో గ్రామానికి చెందిన బుదారపు జితేందర్‌కు చెందిన ద్విచక్ర వాహనంతో పాటు అక్కడే దగ్గర్లో ఉన్న మన ఇంటి భోజనశాల,చిచ్చా చాయి హోటల్స్,చెన్న మురళీధర్‌కి చెందిన పాన్ షాప్,లక్కీ క్రికెట్ బాక్స్ దుకాణాలలోకి గుర్తు తెలియని దుండగులు అక్రమంగా ప్రవేశించి అందులోని సామాగ్రి, సిగిరెట్ పెట్టెలు కొంత నగదును దోచుకెళ్ళారని మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ వివరించారు. ద్విచక్ర వాహన యజమాని జితేందర్,హోటల్స్ పాన్ షాప్ యజమానులు కలిసి మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వేములవాడలో పిచ్చి కుక్క బీభత్సం



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి సుమారు 25 మందికి పైగా ప్రజలను కరిచి గాయపరిచిన ఘటన కలకలం రేపింది. పలు కాలనీలు, ప్రధాన వీధుల్లో సంచరించిన కుక్క దాడితో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారిలో రాజన్న భక్తులు కూడా ఉన్నారు. గాయపడిన వారిని వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారికి రేబీస్ నిరోధక టీకాలు,అవసరమైన చికిత్స అందిస్తున్నారు. కొందరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బాధితులకు పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తగ్గించేందుకు 15 రోజుల క్రితమే 40 కుక్కలను ఏ.బి.సి కేంద్రానికి తరలించామని తెలిపారు. మరిన్ని కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో చైర్మన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కుక్కల నియంత్రణ చర్యలను వేగవంతం చేశారు.

## హోలీ పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో ఆనందం నింపాలి: ఎస్పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరి గిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎస్పి జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనం దం, ఐక్యత,కోత్త ఉత్సాహం, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పోలీసు అధికారులతో రంగులు చల్లుకుంటూ స్టెప్పులు వేశారు. పోలీసు కుటుంబంలో స్నేహభావం, ఐక్యత మరింత బలపడేలా ఈ వేడుకలు నిర్వహించబడినట్లు తెలిపారు. డిఎస్పినాగేంద్రచారి,సిఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

## లెవెన్ కె.వి విద్యుత్ వైర్లు తగిలి స్వల్పంగా దగ్ధమైన హార్వెస్టర్




**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ మండలంలోని కొత్తదామ రాజు పల్లి గ్రామంలో రైతుకు చెందిన పంట పొలంలోకి కోతకు వెళ్లిన హార్వెస్టర్ ఆకస్మాత్తుగా లెవెన్ కె.వి వైర్లు తగిలి స్వల్పంగా కాలిపోయింది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన రాజేందర్ అనే రైతుకు చెందిన హార్వెస్టర్ అదే గ్రామానికి చెందిన మరో రైతు తోటలోకి పంట కోతకు వెళ్తుండగా 11 కె.వి విద్యుత్ వైర్లను డ్రైవర్ గమనించకపోవడంతో ఒక్కసారిగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన కొద్ది క్షణాల్లోనే విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదమే తప్పినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో హార్వెస్టర్ వెనుక భాగం స్వల్పంగా దగ్ధమవగా ఎలాంటి ప్రాణ ప్రాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలోని పలు దేవాలయాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం ప్రభావంతో మంగళవారం ఉదయం నుండి ఆలయాలను మూసివేశారు. జిల్లా లోని ప్రముఖ ఆలయాలైన కొమురవెల్లి మల్లికార్జున క్షేత్రం, నాచారం నర్సింహ్మాస్వామి క్షేత్రం, జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరాలయం, కోటిలింగేశ్వరాలయం, శరబేశ్వరాలయం, సంతోషిమాత ఆలయంతో పాటు పలు ఆలయాలను సంపూర్ణ చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 8 గంటల లోపు మూసివేశారు. గ్రహణం వీడిన తర్వాత మరునాడు బుధవారం పలు ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం తిరిగి యధావిధిగా ఆలయంలో అర్చనలు, ఆరేగింపులు తీర్ధప్రసాద వితరణ చేయనున్నారు.

# పేదల ఆసరా.. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

వైద్య సేవలలో దూసుకుపోతున్న ప్రభుత్వ ఆసుపత్రి
కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో పేదలకు వైద్య సేవలు




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పేదల ఆసరాగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలలో దూసుకుపోతుంది. ప్రభుత్వాసుపత్రిలో జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామనారావు ల చొరవతో పేద ప్రజలకు అన్ని వైద్య సేవలు అందుతున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ కే శ్రీధర్ తెలిపారు. వివరాల్లోకెళితే ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే స్థాయి నుండి ఇప్పుడు మేము వస్తాము సర్కార్ దవాఖానకు అని పెద్దపల్లి జిల్లా ప్రజలు వస్తున్నారు. అని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన కొన్ని రోజుల నుండి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రోజు రోజుకి వైద్య సేవలలో దూసుకుపోతుందనీ,గడిచిన ఫిబ్రవరి నెలలో నమోదు అయిన సేవల వివరాలు మొత్తం 22447 మంది ఔట్ పేషెంట్లు, ఇందులో 9758 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 660 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 4263 మంది చిన్న పిల్లల విభాగంలో, 3364 మంది గైనిక్ విభాగంలో, 410 మంది ఆర్థో విభాగంలో, 1509 మంది కంటి విభాగంలో, 675 మంది ఈ ఎన్ టి విభాగంలో, 1039 మంది చర్మ విభాగంలో మరియు 574 మంది దంత విభాగంలో వైద్య సేవలు పొందారు. అదే విధంగా 1872 మంది ఇన్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందారు, ఇందులో 849 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 50 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 433 మంది చిన్న పిల్లల విభాగంలో, 273 గైనిక్ విభాగంలో, 90 మంది ఆర్థో విభాగంలో మరియు 174 మంది కంటి విభాగంలో ఇన్ పేషెంట్ వైద్య సేవలు పొందారు.వీటితో పాటు 54 ఆర్థో శస్త్ర చికిత్సలు, 81 జనరల్ సర్జరీ శస్త్ర చికిత్సలు, 164 కంటి శస్త్ర చికిత్సలు, 25 చెవి ముక్కు & గొంతు శస్త్ర చికిత్సలు మరియు 409 డెంటల్ శస్త్ర చికిత్సలు జరిగాయని గడిచిన నెలలో మొత్తం 184 డెలివరీలు చేయగ, 27859 ల్యాబ్ టెస్టులు, 2062 అల్ట్రా సౌండ్ స్కానింగ్, 133 టిఫ్ఫా స్కానింగ్, 722 ఈ సి జి, 255 2 డి ఎకో, 1880 ఎక్స్ రే, 724 ఫిజియో థెరపీ మరియునవజాత శిశువులకు ఇప్పటి వరకు దాదాపుగా700 మంది శిశువుల కి ట్రీట్మెంట్ చెయ్యడం జరిగిందనీ, 308 ఆరోగ్య శ్రీ సేవలు అందించడం జరిగిందనీ, వీటితో పాటు ప్రత్యేకంగా 8 లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు1 యూరాలజీ శస్త్ర చికిత్స,9 రూట్ కెనాల్ శస్త్ర చికిత్సలు చేశామని తెలిపారు.

**ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ కె శ్రీధర్ సూపరింటెం-డెంట్...** పెద్దపల్లి జిల్లా ప్రజలు పెద్దపల్లి ఆసుపత్రిలో అందుతున్న అన్ని రకాల వైద్య సేవలు ఉపయోగించుకోవాలి అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. సేవలలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.హాస్పిటల్ లోఎక్కడైనా ,ఏదైనా సేవలలో ఇబ్బంది కలిగినా,లేదంటే పేషెంట్ సర్వీస్ గురించి ఏమైనా సలహాలు ,సూచనలు ఉంటె ,ఇవ్వగలరని సూపరింటెండెంట్ ఒక ప్రకటన లో తెలిపారు.

## రంగుల కేళి...హోలి


### వేడుకల్లో పాల్గొన్న ఎస్‌పి, మాజీ మంత్రి



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం హోలి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే వీధుల్లో సందడి నెలకొంది. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళుతూ స్వీట్లు పంచుకుంటూ సంజరాలు జరుపుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌తో పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లు, తదితర ప్రజాప్రతినిధులు హోలి వేడుకల్లో పాల్గొన్నారు. హోలి హోలి రంగ హోలి..చెమ్మ కేలిన హోలి..రంగ్ బర్‌సే..హోలి ఆయారే అంటూ నిర్వహించిన హోలి సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలోని వీధులన్ని రంగుల మరివిల్లులను తలపించాయి. ఎటు చూసినా రంగుల మయమే అనిపించింది. రహదారులు సైతం రంగులమయమయ్యాయి. ఉదయం నుంచే ఉరకలేసిన ఉత్సాహంతో వయస్సు నిమిత్తం లేకుండా అన్ని వర్గాల ప్రజలు రంగులు తీసుకుని వీదుల్లోకి వచ్చారు. కుర్రకారు హుషారుగా బైక్‌లపై షికారు చేస్తూ రంగులను చల్లుకున్నారు. కేరింతలు కొడుతూ పోటీతత్వంతో ఒకరిపై ఒకరు పడి రంగులు పులుముకున్నారు. బిగ్గరగా హోలి అని అరుస్తూ టమాటాలు, కోడిగ్రుడ్లను తలపై, శరీర బాగాలపై పగులగొట్టుకున్నారు. ఆత్మీయంగా అలింగనం చేసుకుని స్వీట్లు తినిపించికుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ హోలి పండుగ ఐక్యతకు చిహ్నా అని పేర్కొన్నారు. అలాగే ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో హోలి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్ని ఎస్పీకి రంగులు పూస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, రాములు తదితరులు ఉన్నారు.

## సెక్రటరీ గారూ.. మీ నోటీసుకు మీరే అడ్డా?

### ఎంపిఓ విచారణ చేసినా చర్యలు శూన్యం



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామ ఎస్.సి కాలనీలో వారిది కాని స్థలంలో షెడ్డు నిర్మాణం చేపట్టి వారికి సంబంధించిన వాహనాలను పార్క్ చేస్తున్నారని గత ఏడాది అక్టోబర్ నెలలో ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు జగిత్యాల మండల ఎంపిఓ గత సంవత్సరం అక్టోబర్ నెల 28వ తేదీన విచారణ చేపట్టి షెడ్డును తొలగించాలని ఆదేశాలు ఇవ్వగా కల్లెడ గ్రామ పంచాయతీ తరుపున గ్రామ సెక్రెటరీనీ సంబంధిత వ్యక్తులకు నోటీసు ఇవ్వాలని మండల ఎంపిఓ అదేశాలు జారీ చేశారు. కల్లెడ గ్రామ పంచాయతీ తరుపున నోటీసు జారీ చేస్తూ నోటీసు ఇచ్చిన మూడు రోజులలో షెడ్డును తొలగించాలని లేనియెడల గ్రామ పంచాయతీ తరుపున షెడ్డును తొలగించబడునని తెలిపినారు. నోటీసు జారీ చేసి 4 నెలలు గడుస్తున్న షెడ్డును తొలగించడం లేదని గ్రామ సెక్రటరీనీ పలుమార్లు షెడ్డును ప్రస్తావన తీసుకురాగా అడిగిన ప్రతిసారీ షెడ్డు వేసినవారికి వత్తాసు పలుకుతూ మాట దాట వేస్తూ కాలం గడుపుతున్నారని ఫిర్యాదుదారుడు గాలిపెల్లి అరుణ్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి షెడ్డును తొలగించి ఎంపిఓఆదేశాలను నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కల్లెడ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు గాలిపెల్లి అరుణ్ కోరుతున్నారు.

## మైనర్‌పై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

### రూ. 15 వేల జరిమానా, బాధితురాలికి రూ. 3లక్షల పరిహారం

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి 20 సంవత్సరాల కఠిన కారాగారా జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా, బాధిత మైనర్ బాలికకు రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని పేర్కొంటూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని మల్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మైనర్ బాలికను మహమ్మద్ రజాక్ అనే 50 ఏళ్ల వ్యక్తి 2022 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణా రావు కేసు వాదించగా సీఐ రమణ మూర్తి, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు సాగర్, శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారుజ నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారూ ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరన్నారు. అనంతరం నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్‌పి అభినందించారు.

## పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి

### బిఆర్ఎస్ నేతల డిమాండ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజక వర్గ పరిధిలో పొద్దు తిరుగుడు పంటను పెద్ద ఎత్తున సాగుచేశారని..ఇట్టి పంట విక్రయించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాఉల ఏర్పాటు చేయనందున రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని బిఆర్ఎస్ పార్టీ చిన్నకోడూరు మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సన్‌ఫ్లవర్ పంట కోతకు వచ్చిన ఇప్పటి వరకు ఎక్కడ సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటం వల్ల రైతులకు తీవ్రనష్టాన్ని కలుగచేస్తుందన్నారు. ఒక చిన్నకోడూరుమండల పరిధిలో 2వేలకు ఎకరాలకు పైగా సన్‌ఫ్లవర్ పంటను సాగుచేశారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటల్‌కు 7721రూపాయలు ఉన్నప్పటికి ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తులనుఅమ్ముకుంటే క్వింటల్‌కు 6వేలకు మించి ఒక్క రైతుకు దొరకటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు యూరియా కష్టాలు. రైతుభరోసా ఇవ్వలేదని,విత్తనాల సరైన సమయంలో పంపిణిచేయలేదని, 24గంటల విద్యుత్‌ను సైతం పూర్తి స్థాయిలో అందించలేదన్నారు. రైతులు అన్ని విధాలుగా నష్టపోయే విధంగా ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతుందన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ సర్కార్ కళ్లు తెరిచి వెంటనే పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈసమావేశంలో బిఆర్ఎస్ నేతలు సర్పంచ్‌లు సదానంద్‌గౌడ్, ఇట్టబోయిన శ్రీనివాస్, రాజిరెడ్డి, ములకల కుంటయ్య, మధుసూదన్‌రెడ్డి, యాదయ్య, కీసర పాపయ్య , కొండం రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా హోలీ వేడుకలు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** హోలీ..రంగేలీ చేమ్మకేళీల హేళీ అంటూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో వసంతోత్సవ పర్వదినాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. హళీ పండుగ సందర్భంగా చిన్న, పెద్ద తేడ లేకుండ అందరు రంగులు చల్లుకుంటు ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు ద్వి చక్ర వాహనాలపై గుంపులుగా తిరుగుతూ హోలీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని కాంచీట్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, భారత్‌నగర్, గాంధీ చౌక్. లాల్ కమాన్, కూరగాయాల మార్కెట్ ఏరియా, పారుపల్లి వీధీ. ముస్తాబాద్ చౌరస్తా కోమటి చెరువు, అంబేద్కర్ నగర్, శివాజీనగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాలు, పలు అపార్టు మెంట్లలో హోలీ పర్వదిన వేడుకలు అత్యంత ఉత్సాహంగా,. ఉల్లాసంగా జరుపుకన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు హోలీ పర్వదిన వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, విద్యార్థినీలు సైతం పరస్పరం రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

## ఇసుక క్వారీల్లో అక్రమ వసూళ్ల పర్వం

### లోడింగ్ పేరిట నిర్వాహకుల చేతివాటం.. చూసీచూడనట్లు అధికారుల తీరు

**ప్రజాపక్షం/చెన్నూరు:** చెన్నూరు నియోజకవర్గంలోని ఇసుక క్వారీల్లో లోడింగ్ పేరిట సాగుతున్న అక్రమ వసూళ్ల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చింతలపల్లి సమీపంలోని ఇసుక క్వారీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ లారీ డ్రైవర్ల నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వకూడదని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. క్వారీల్లో అదనపు బకెట్లకు అనుమతి లేకపోవడంతో నిర్వాహకులు కొత్త దారి వెతికారు. లోడింగ్ చార్జీల పేరుతో ఒక్కో వాహనం నుంచి 15వందల నుంచి 2వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని డ్రైవర్ల నుంచి ఈ స్థాయిలో వసూళ్లకు పాల్పడటంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానాలు బలపడుతున్నాయి. అధికారులు, స్థానిక నాయకుల అండదండలు ఉండబట్టే నిర్వాహకులు ఇంతటి అక్రమాలకు తెగబడుతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బహిరంగంగానే అనధికార లావాదేవీలు సాగుతున్నా నియంత్రణ చర్యలు కరువయ్యాయి. ఇప్పటికైనా స్థానిక మంత్రి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకులతో పాటు వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శివకల్యాణ మహోత్సవానికి ఘనమైన ఏర్పాట్లు

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం లో జరగబోయే శివకళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.ఆలయం అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా తూర్పు రాజగోపురం ముందు ప్రత్యేకంగా యాగశాల నిర్మాణం చేపట్టి, విద్యుత్ దీపాలతో పాటు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. శ్రీ స్వామివారికి ఐదు రోజుల పాటు అర్చకులు ఏకాంతంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కళ్యాణ మహోత్సవం పార్కింగ్ ప్రదేశంలో గల శివార్చన వేదిక వద్ద నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని అధికారులు భావిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం కూడా నిర్వహించబడనుంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థానం అధికారులు కోరారు.

# ఫైర్ స్టేషన్ భవనానికి మోక్షమెప్పుడు?

చొప్పదండిలో పదేళ్లుగా నిలిచిపోయిన నిర్మాణం * మున్సిపల్ కార్యాలయంలోనే కొనసాగుతున్న ఫైర్ సేవలు * ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో శాశ్వత కార్యాలయం అందుబాటులోకి రాక ఫైర్ సేవలు మున్సిపల్ కార్యాలయంలోనే కొనసాగుతున్నాయి. 2017లో గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఫైర్ స్టేషన్ ఉండాలని నిర్ణయించింది. అదే సంవత్సరంలో చొప్పదండికి రూ.28 లక్షల నిధులతో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అనువైన స్థలం దొరకకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయని తెలిసింది. తదుపరి 2022లో రూ.28 లక్షల నిధులతో మండల కేంద్రంలోని నవోదయ పాఠశాల ఎదురుగా ఉన్న స్థలాన్ని ఫైర్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మాణం చేస్తూ అర్ధాంతరంగా వదిలేశాడు. కేవలం వాహనం నిలిచేందుకు రేకుల షెడ్డు నిర్మించి రెండు గదులను నిర్మిస్తూ కిటికీలు, తలుపులు, కరెంటు పనులను పూర్తి చేయకుండానే వదిలేశాడు. రూ.28 లక్షల నిధులతో కేవలం వాహనం నిలపడానికి రేకుల షెడ్డు, రెండు రూములు నిర్మించారు.

**మున్సిపల్‌లోనే ఫైర్ స్టేషన్ సేవలు**

ఫైర్ స్టేషన్ నిర్మాణం పూర్తికాకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయంపై అంతస్తులు ఫైర్ సేవలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం ముందు ఫైర్ స్టేషన్ వాహనాన్ని ఉంచడంతో ఎండకు ఎండుతూ, వానకు నానుతూ అత్యవసర సమయంలో అనేకమార్లు మురాయించిన సంధర్బాలు లేకపోలేదు. చొప్పదండి మండలంతో పాటు ధర్మారం, జూలపల్లి, రామడుగు మండలాలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

**గత ప్రభుత్వం హడావుడి పనులు**

గత ప్రభుత్వం ఫైర్ స్టేషన్ నిర్మాణం కొరకు హడావుడిగా పనులు చేపట్టగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. అసంపూర్తిగా వదిలేయడంతో సిబ్బందికి అవసరాలకు ఇబ్బంది ఉంది. కాంపౌండ్ నిర్మాణం లేకపోవడంతో విషపురుగుల ప్రమాదం పొంచి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తుండగా ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఫైర్ స్టేషన్ కొనసాగుతుండడంతో అటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో పాటు రోజువారి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అసౌకర్యంగా ఉంటున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మధ్యంతరంగా ఆగిపోయిన ఫైర్ స్టేషన్‌కు సరిపడా నిధులను కేటాయించి పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## అన్నారంలో అగ్నిప్రమాదం

### రూ.6 లక్షల ఆస్తి నష్టం



**ప్రజాపక్షం/కోటపల్లి:** మండలంలోని అన్నారం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఒక ఇల్లు పూర్తిగా దహనమైంది. తెప్పల సమ్మిరెడ్డికి చెందిన ఇంట్లో దూరికే శారదా, అంజలి అనే ఇద్దరు మహిళలు అద్దెకు ఉంటున్నారు. వీరు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదం సంభవించడంతో సుమారు 6 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణ ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే మంటలు చెలరేగి ఇల్లు దహనమైనట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడు తెప్పల సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## ఎస్‌పి కార్యాలయంలో వైభవంగా హోలీ వేడుకలు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో రంగుల వేడుకలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్‌పి నితిక పంత్ ఐపిఎస్ పాల్గొని సిబ్బందితో కలిసి రంగులు చల్లుకున్నారు. ఈ వేడుకలు స్నేహభావం, ఐక్యత, సోదరభావాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగును, ఆనందాన్ని నింపాలని కోరారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబ సభ్యులని, నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువంటి వేడుకలు మానసిక ఉల్లాసాన్ని కలిగించి పరస్పర ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు బాలాజీ వర ప్రసాద్, సతీష్, వామన మూర్తి, సత్యనారాయణ, కుమార స్వామి, సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాలతో జర్నలిస్టులు హోలీ



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణం నవనాథపురం ప్రెస్‌క్లబ్‌లోని జర్నలిస్టులు మంగళవారం ఆనందోత్సవాల మధ్య హోలీ పండగను జరిపారు. జర్నలిస్టులు సాత్‌పుతే శ్రీనివాస్, నరేందర్, శ్రావణ్, గోజూరు మహిపాల్, బారడ్ గణేష్, మహేష్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి తమ్మి వినోద్, రాకేష్, వెంకటేశం గుప్తా, మ్యాక దినేష్, వినోద్, సామ సురేష్, అరుణ్, సాయి, అనిఫ్‌లు ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ సంబురాలు జరిపారు. ఆర్మూర్ ఏసీపీ కార్యాలయానికి వెళ్లి ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఆలూర్ రోడ్డు వద్ద మున్సిపల్ వైస్‌చైర్మన్ కాట్‌పల్లి వెంకట్‌రెడ్డి వద్దకు వెళ్లి జర్నలిస్టులు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు చెప్పారు. ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెట్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ హౌసింగ్ బోర్డు వద్ద ఉండటంతో ఆయన వద్దకు వెళ్లి జర్నలిస్టులు రంగులు పూసి హోలీ సంబురాలు జరిపారు. మహాలక్ష్మి కాలనీలో నివసిస్తున్న అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ వద్దకు వెళ్లి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్కె కాంప్లెక్స్ వద్ద యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు విజయ్ అగర్వాల్‌ను జర్నలిస్టులు కలిసి రంగులు పూసి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్‌వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్లు రాజశేఖర్, అయ్యప్ప శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు విజయ్ అగర్వాల్ మాట్లాడుతూ పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలు హోలీ పండగను ఆనందోత్సవాల మధ్య శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు రజనీష్ కిరాడ్, సాత్‌పుతే గంగాధర్, రాంసింగ్ పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ




**ప్రజాపక్షం/ జన్నారం :** అడవులు, వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి లక్ష్మీ నారాయణ తెలిపారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా మంగళవారం జన్నారం రేంజ్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు, వృక్షజాల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర కీలకమని ఆయన వివరించారు. ఐక్యరాజ్యసమితి 2013లో ప్రకటించిన నిర్ణయం మేరకు ప్రతి ఏటా మార్చి 3న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1973 మార్చి 3న అంతరించిపోతున్న వన్యప్రాణుల జాతుల అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందం (సిఐటిఇఎస్)పై సంతకాలు జరిగిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. 2026 సంవత్సరానికి గాను ఔషధ, సుగంధ మొక్కలు: ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధిని కాపాడటం అనే ఇతివృత్తంతో ఈ ఏడాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. ఔషధ మొక్కల ప్రాముఖ్యత, సంప్రదాయ వైద్యం, మానవ జీవనోపాధిలో వాటి ప్రాధాన్యతను చాటిచెప్పడమే దీని ప్రధాన లక్ష్యమని వివరించారు. అడవుల నరికివేతను తగ్గించాలని, వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## నకిలీ బ్యాంకు గ్యారంటీలతో ధాన్యం మాయం

### ఒకరి అరెస్ట్.. ఎస్ఐ సురేష్ వెల్లడి

**ప్రజాపక్షం /సిర్పూర్ టి :** మండలంలో ప్రభుత్వ ధాన్యం సేకరణ ప్రక్రియలో నకిలీ బ్యాంకు గ్యారంటీల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిర్పూర్ ఎస్ఐ సురేష్ తెలిపారు. 202324 రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు అప్పగించే క్రమంలో కొందరు మిల్లర్లు నిబంధనలకు విరుద్ధంగా నకిలీ గ్యారంటీ పత్రాలు సమర్పించినట్లు తనిఖీల్లో బయటపడిందని, సుమారు 900 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సంబంధించి దాదాపు రూ. 7.50 కోట్ల విలువైన బ్యాంకు గ్యారంటీ పత్రాలు నకిలీవని అధికారులు నిర్ధారించారని వెల్లడించారు. కౌటాల సిఐ సంతోష్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించి ఈ కేసులో మనీష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

# ‘మంగి’లో మారని రాత.. తీరని అడవి పల్లె కష్టాలు

### నక్సల్ ముద్ర పోయినా చేరని అభివృద్ధి
### నిధులు వస్తున్నా వసతులు శూన్యం
### వైద్యం అందక ఇబ్బందులు
### రోడ్లు లేక అగచాట్లు..



**ప్రజాపక్షం / తిర్యాణి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండలంలోని మంగి గ్రామపంచాయతీ ఒకప్పుడు నక్సలిజం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. దట్టమైన అడవులు, ఎత్తైన గుట్టలు, భౌగోళికంగా జిల్లా కేంద్రానికి అత్యంత దూరంగా ఉండటంతో గతంలో ఈ గ్రామం అతి సున్నిత ప్రాంతంగా ఉండేది. నాడు తుపాకుల మోతతో దద్దరిల్లిన ఈ అడవి పల్లెలో, ఇప్పుడు శాంతి నెలకొన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నక్సలిజం పూర్తిగా అంతరించిపోయినా, అభివృద్ధి మాత్రం ఇంకా గ్రామ ద్వారం తట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా అడవి పల్లె బతుకులు ఇంకా అంధకారంలోనే మగ్గుతున్నాయి.

### తాగునీటి కోసం మైళ్ల దూరం..

గ్రామంలో శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం లేకపోవడంతో ప్రజలు బోర్లు, వాగులపైనే ఆధారపడుతున్నారు. వేసవి కాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండటంతో మహిళలు కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న తాగునీటి పథకాలు ఈ గ్రామానికి పూర్తిస్థాయిలో అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కనీసం దాహార్తిని తీర్చే నాథుడు కూడా కరువయ్యాడని గిరిజనులు వాపోతున్నారు. మంగి గ్రామానికి చేరుకునే ప్రధాన రహదారి దారుణ స్థితిలో ఉంది. వర్షాకాలం వస్తే ఈ దారి బురదమయంగా మారి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో గర్భిణులు, వృద్ధులు, రోగులు ఆసుపత్రికి వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారు. పక్కా రహదారి నిర్మాణం ఏళ్లుగా కేవలం హామీలకే పరిమితమవుతోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక ఈ పల్లె బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన స్థితిలో కనిపిస్తోంది.

### వైద్యం, విద్య అందని ద్రాక్షే



గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడం వల్ల చిన్నపాటి అనారోగ్యం వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. వైద్య సిబ్బంది నియామకం లేకపోవడంతో అత్యవసర వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు విద్యావ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమితో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. హైస్కూల్ విద్య కోసం ఇతర గ్రామాలకు వెళ్లలేక చాలామంది విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారు.

### నిధులు ఏమౌతున్నాయి?

నక్సల్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్, రోడ్ రిక్వైర్మెంట్ ప్లాన్ వంటి పథకాల ద్వారా భారీగా నిధులు కేటాయిస్తోంది. రహదారులు, విద్య, ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు విడుదల అవుతున్నా, మంగి గ్రామానికి ఆ నిధులు ఎందుకు చేరడం లేదని మేధావులు ప్రశ్నిస్తున్నారు. శాంతి నెలకొన్న ఈ అడవి పల్లెకు ఇప్పుడు మౌలిక వసతులు అత్యవసరమని, ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

## అంతర్రాష్ట్ర కాపర్ కాయిల్స్ దొంగల ముఠా గుట్టు రట్టు

### పోలీసు కమిషనర్ సాయి చైతన్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌కాయిల్ దొంగిలిస్తున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను నూతన సాంకేతిక విధానం ద్వారా చాకచక్యంగా నిజామాబాద్ పోలీసులు 34 కేసులలో నిందితులను మంగళవారం అరెస్టు చేయడం జరిగిందని పోలీసుకమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. ఇట్టి దొంగల ముఠా నుండి రికవరి చేసిన ప్రాపర్టీ1.20 క్వింటాళ్ల కాపర్ కాయిల్స్, 2 లక్షల 75 వేల నగదు, రెండు టూ వీలర్‌లు, ఒక ఆటో, దొంగతనానికి వాడిన పరికరాలను జప్తు చేయడం జరిగింది. కేసు వివరాలు గత మూడునెలల నుండి నిజామాబాద్ జిల్లాలోని నవీపేట, నందిపేట్, బోదన్ రూరల్, ఎడపల్లిలకు సంబంధించిన శివారులలో, నిర్మల్ జిల్లాకు సంబంధించిన బాసర, ముథోల్, తానూరు, భైంసా, కుంటాల సర్సాపూర్ జిలకు సంబంధించిన మండలాలకు సంబంధించినటువంటి శివారులలో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన రాగి తీగల దొంగతనం జరుగుతుండడం వల్ల ఎలక్ట్రిసిటి డిపార్టుమెంట్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. ఇట్టి కేసును నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు.ఇట్టి దొంగతనం చేసిన కాపర్ కాయిల్స్ సొత్తును నిజామాబాద్‌లోని ఏపిహెచ్‌బి కాలనీలో ఒక చిన్న రూము కిరాయి తీసుకొని అక్కడ దాచిపెట్టుకొని వాటినిసంచులలో నింపుకొని వారికి అనుకూలంగా ఉన్న సమయంలో మెయిన్ రిసీవర్ అయిన భైంసాకు సంబంధించిన మహబూబ్‌ఖాన్‌కు కిలోకి రూ. 800 చొప్పున అమ్మేవారు. అయితే పోలీసులు చాకచక్యంతో తమకున్న ఆధారాలు సమాచారం, సాంకేతిక పరిజ్ఞానంతో ఇట్టి గ్యాంగ్‌ని పట్టుకుని రెండు జిల్లాలకు సంబంధించిన దాదాపు 34 కేసులని డిటెక్ట్ చేయడం జరిగింది. నిందితులను అరెస్టు చేసి న్యాయస్తానంలో హాజరుపరచగా రిమాండ్‌కు పంపడం జరిగింది. ఈకేసును ఛేదించడంలో బి. శ్రీనివాస్, నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్, కె. శ్రీకాంత్ సబ్ ఇన్స్‌పెక్టర్ పిఎస్ నవీపేట్, ఎస్ఐ యాదగిరి గౌడ్, ఎస్ఐ రాజశేఖర్, మాక్లూర్ పిఎస్, ఎస్ఐ గంగాధర్ ఐదవ టౌన్, ఏఎస్ఐ గఫర్, హెచ్‌సి రాజేశ్వర్, రాజారెడ్డి, సందీప్, అబ్బులు, శ్రీకాంత్‌గౌడ్, దత్తాత్రేయగౌడ్, నాగరాజు, శంకర్, సాయిలు, రామకృష్ణ, సచిన్, ఇతర సిబ్బంది అందరిని సాయి చైతన్య అభినందించారు.

## సిఎంకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన జుక్కల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం హోలీ పండగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో ఈ మధ్యకాలంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాతల గురించి ఎమ్మెల్యే సీఎంతో చర్చించారు. బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నందుకు ఎమ్మెల్యేను సీఎం అభినందించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

## మియాపూర్ మక్తలో విషాదం

### ప్రేమ వ్యవహారంతో యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలోని నారాయణ ఖేడ్ గ్రామానికి చెందిన మేఘవత్ సోని బాయి (20) మియాపూర్ మక్తలోని ఫస్ట్ హెల్త్ ల్యాబ్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ రెడ్డి ఎంక్లేవ్ లో పీజి హాస్టల్‌లో ఉంటూ జీవనం కొనసాగుతుంది. ఒక సంవత్సరం నుండి ఫస్ట్ క్లినిక్ లో పనిచేస్తుంది . సోమవారం సోని పని వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉంది గదిలో తోటి స్నేహితులు ,ఉద్యాగాలకు వెళ్లారు. స్నేహితులు రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ రూమ్‌కు వచ్చి చూసేసరికి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా ఉలుకు ,పలుకు లేదు. స్నేహితులు హాస్టల్ యాజమాన్యం కిటికి లో నుండి చూడగా సోని పైకప్పు ఉక్కు కు చున్నితో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలపులు బద్దల కొట్టి లోపలికి వెళ్లి కిందికి దించి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సహచరులు గుర్తించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గత కొంతకాలంగా తన సొంత గ్రామానికి చెందిన యువకుడు ఆమె ప్రేమించుకుంటున్నారు.

## నిర్మల్ పోలీస్ క్యాంపు కార్యాలయంలో మిన్నంటిన హోలీ సంబరాలు

### శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం మంగళవారం రంగుల మయంగా మారింది.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు,సిబ్బంది తమ ఒత్తిడిని పక్కన పెట్టి,ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పోలీస్ అధికారులతో కలిసి రంగులు పూసుకుని వేడుకల్లో పాలుపంచుకున్నారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,హోలీ పండుగ కేవలం రంగులన పండుగ మాత్రమే కాదని,అది సమాజంలో పరస్పర స్నేహభావం,ఐక్యత,సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.జిల్లా ప్రజలందరికీ,పోలీస్ శాఖలోని తోటి అధికారులకు,సిబ్బందికి ఆమె మనస్ఫూర్తిగా హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.పండుగను సురక్షితంగా,పరస్పర గౌరవంతో జరుపుకోవాలని,సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ భాధ్యతగా మెలగాలని ఆమె కోరారు.ముఖ్యంగా వేడుకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని,యువత రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు.పాటు అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి,బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్.నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్,పలువురు ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు ,ఎస్.ఐలు ,ఆర్.ఎస్.ఐలు, పోలీస్ పాల్గొని సందడి చేశారు.

## గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్



**ప్రజాపక్షం / గజ్వేల్:** గజ్వేల్ లోని జిల్లా ఆసుపత్రిలో అరుదైన గర్భాశయ ఫైబ్రైడ్ (లియోమయోమస్) శస్త్ర చికిత్స నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మహిళ (43) ఆసుపత్రి వైద్యులను సంప్రదించింది. ఈ క్రమంలో గర్భాశయ (గర్భసంచి) కండర గోడలలో పెరిగే కణిత పెద్ద గర్భాశయ ఫైబ్రైడ్ 24 వారం పరిమాణంలో 13/11/10 సెంటీమీటర్లు కలిగిన పెద్ద ఫైబ్రైడ్ లేదా లియోమయోమాస్ అనే అరుదైన ఆపరేషన్ ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్ర చికిత్సలో వైద్యులు డాక్టర్ త్రివేణి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ప్రేమ్ కిషోర్, అనస్థీషియా డాక్టర్ మైపాల్, డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ సునీత, సునీల్, థియేటర్ అసిస్టెంట్లు వెంకట్ రాజకుమార్, రాజు, అస్ర, పేషంట్ కేర్ యాదమ్మ టీం గా ఏర్పడి ఫైబ్రేడ్ తొలగించడం సంతోషంగా ఉందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, ఇది మహిళల గర్భాశయంలో కనిపించే అత్యంత, అసాధారణమైన కణితి కాగా, చాలామంది రోగులలో కనిపించవని చెప్పారు. 30 శాతం మందిలో అసాధారమైన గర్భాశయ రక్తస్రావము, కడుపులో నొప్పి, రక్తహీనతకు కారణం, కట్టి నొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చని అన్నారు. పొత్తికడుపు పూర్తిగా నిండడం వంటి భావన, అత్యవసర మూత్ర విసర్జన, నొప్పితో కూడిన అలసట, అంతర్గత రుతుస్రావము, దిగువ వెన్నునొప్పి, సంతానలేమి, బహుళ గర్భస్రావాలు, గర్భ దారణలో ఇబ్బందులు కలుగుతాయని డాక్టర్ అన్నపూర్ణ స్పష్టం చేశారు. ఇలాంటి లక్షణాలు ఉంటే గజ్వేల్ లోని వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

## రమణీయంగా సాగిన మల్లికార్జున స్వామి రథోత్సవం

**ప్రజాపక్షం/కొల్చారం :** శ్రీ శ్రీ శ్రీ బ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున పైతర గ్రామంలో రథోత్సవం ఊరేగింపు రమణీయంగా సాగింది. రథోత్సవం అలంకరణ గ్రామానికి చెందిన ఎల్లుగారి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు బంతిపూలతో విశేషంగా అలంకరణ చేశారు. అనంతరం పల్లకిపై ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని స్వామి వార్లను రథంపై కొలువుదీర్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ త్రిపాఠీ ఆచార్య, రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మాదవానంధ సరస్వతి స్వామి పర్యవేక్షణలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గుమ్మడి కాయలు కొట్టిన తరువాత సాంప్రదాయ బద్ధంగా రథోత్సవానికి నైవేద్యం సమర్పించి, రథాన్ని ముందుకు లాగారు. రథంపై మల్లికార్జున స్వామి వార్లను విహరించగా భక్తులు దర్శించుకొని పెద్ద ఎత్తున గోవింద నామస్మరణలు చేస్తూ గ్రామస్తులు నీళ్ల సాకలు పెడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్ల నడుమ, శివసత్తుల పూనకాలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రకాష్ రెడ్డి, కోశాధికారి కుమ్మరి శివకుమార్, సభ్యులు మాడబోయిన మల్లేశం, శేఖర్, లక్ష్మీ నారాయణ, భూమయ్య, అంతయ్య, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బార్ పై చర్యలేవి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ బార్ అండ్ రెస్టారెంట్ ప్రభుత్వ నిర్దేశిత సమయాలకు విరుద్ధంగా ఉదయం ముందుగానే తెరవడంతో పాటు రాత్రి అలస్యంగ కొనసాగుతున్నదని సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన సమయపాలన లేకుండా బార్ నిర్వహణ కొనసాగడం చట్టవిరుద్ధమైన అధికారులు దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి.అలాగే పట్టణంతో పాటుఉ మండలంలో ప్రతి గ్రామంలో నిర్లక్ష్యంగా బెల్ట్ నడవడం వల్ల యువతపై తీవ్ర ప్రభావం పడుతోందని,దీనిపై ప్రజలు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపించడం సమంజసం కాదని ఖానాపూర్ లో బార్ కార్యకలాపాలపై తక్షణ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,పార్కింగ్ స్థలం లేకుండా జానావాసాలో ఉండుట వలన అనేక మందికి ఇబ్బందులకు గురవుతుంది.వెంటనే దీని పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సిఎం సమావేశంలో జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం కలెక్టర్లతో సిఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. 6నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ఇతర పలు అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు.



## గంజాయి విక్రయవారుడి అరెస్టు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ ముస్తాచ్‌పుర కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ ఖైజర్ఇంట్లో ఎండుగంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయసమాచారం మేరకు ఎక్సైజ్ అదికారులు నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో స్వప్న ఆద్వర్యంలో షేక్ అబ్దుల్ ఖైజర్ ఇంటిపై దాడులు నిర్వహించి 1.6 కేజీల ఎండు గంజాను స్వాధీన పరుచుకుని నిందితుడిని తదుపరి చర్యలనిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ఇట్టి దాడులలో నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో స్వప్నతో పాటు ఎస్ఐ మల్లేష్, సిబ్బంది సునీల్, మోహన్‌సింగ్, రవి, షబ్బీర్, సంజయ్, ప్రభాకర్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.



# పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు

### గగనతలాల మూసివేతతో పలు ప్రధాన టోర్నీల షెడ్యూల్ వాయిదా
### నిలిచిపోయిన క్రీడాకారులు

**దుబాయ్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మధ్య ఆసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలతో సాధారణ జనజీవితంతో పాటు క్రీడాకారులూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు కీలక టోర్నీలు ఆడేందుకు గాను దుబాయ్, దోహా, ఖతార్‌కు వచ్చిన, ఆ దేశం మీదుగా వెళ్తున్న పలువురు క్రీడాకారులు.. ఆయా దేశాల గగనతలాలు మూసేయడంతో ఎక్కడివారక్కడే నిలిచిపోయారు. అదీగాక గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో ఆ దేశాల్లో జరగాల్సిన ప్రధాన టోర్నీలు కొన్ని వాయిదాపడ్డాయి. గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలే లక్ష్యంగా ఇరాన్ చేస్తున్న దాడులతో వారంతా అక్కడి విమానాశ్రయాలు, సంబంధిత టోర్నీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన హోటల్స్‌లో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంటున్నారు.





### సింధు.. కీలక టోర్నీకి దూరం!

రెండుసార్లు ఒలింపిక్ విజేత పివి.సింధు దుబాయ్‌లో చిక్కుకుంది. బ్రిటన్‌లో మంగళవారం నుంచి మొదలు కాబోయే ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆడేందుకు దుబాయ్ మీదుగా లండన్ వెళ్లాల్సిన ఆమె.. ఇరాన్ దాడుల కారణంగా దుబాయ్‌లోనే ఆగిపోయింది. షెడ్యూల్ ప్రకారం ఆమె మంగళవారం.. తన మొదటి రౌండ్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్న నేపథ్యంలో ఆ దేశ గగనతలాన్ని మరికొన్ని రోజులు మూసి ఉంచే అవకాశమే ఎక్కువ. ఈ నేపథ్యంలో సింధు ఈ టోర్నీలో పాల్గొనడం ఇక కష్టమే. ఆదివారం సింధు తానుంటున్న విమానాశ్రయానికి చేరువలోనే భారీ పేలుళ్లు సంభవించాయని, అయితే ఆ తర్వాత తమను సురక్షిత ప్రాంతానికి తరలించారని వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే.

### ఫ్రెండ్ ఇంట్లో మెద్వెదెవ్

దుబాయ్‌లో ఇటీవలే ముగిసిన ఎటిపి దుబాయ్ డ్యూటీ ఫ్రీ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఆడేందుకు వచ్చి సింగిల్స్ విభాగంలో టైటిల్ గెలిచిన రష్యా ఆటగాడు డేనిల్ మెద్వెదెవ్.. ఇరాన్ దాడులతో అక్కడే ఆగిపోయాడు. ఈ మాజీ ప్రపంచ నంబర్ ఒన్.. తన కుటుంబ సభ్యులు, కోచింగ్ సిబ్బందితో కలిసి స్నేహితుడి ఇంట్లో తలదాచుకుంటున్నాడు. దుబాయ్ ఎటిపి నిర్వాహకులు అందుకు సంబంధించిన ఏర్పాట్లను చూసుకుంటున్నారు. మెద్వెదెవ్‌తో పాటు పలువురు టెన్నిస్ ఆటగాళ్లు దుబాయ్‌లోనే చిక్కుకుపోయినట్టు తెలుస్తున్నది.

### ఫిబా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ వాయిదా

లెబనాన్‌లో సోమవారం మొదలు కావాల్సిన ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి బాస్కెట్‌బాల్ (ఫిబా) వరల్డ్ కప్ 2027 క్వాలిఫయర్ టోర్నీ వాయిదాపడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఈ టోర్నీని వాయిదా వేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. గ్రూప్–డిలో భారత్.. శుక్రవారం ఖతార్‌తో మ్యాచ్‌లో ఓడగా లెబనాన్‌తో మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ప్రస్తుతానికి భారత బాస్కెట్‌బాల్ జట్టు ఆటగాళ్లు దోహాలో ఉన్నారు.

### అల్బేనియాలో రెజ్లర్లు

అల్బేనియాలో ఇటీవలే ముగిసిన యునైటెడ్ వరల్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ ఆడేందుకు వెళ్లిన 16 మంది భారత రెజ్లర్లు అక్కడే నిలిచిపోయారు. ఈ టోర్నీలో ఒక స్వర్ణం, మూడు రజతాలు, మూడు కాంస్యాలు సాధించి స్వదేశానికి బయల్దేరిన భారత రెజ్లర్లు.. మధ్య ఆసియాలో ఎయిర్‌స్పేస్ మూసేయడంతో అల్బేనియాలోనే ఆగిపోయినట్టు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) తెలిపింది.

### ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రిక్స్‌పై అనిశ్చితి

ఈనెల 68 మధ్య మెల్బోర్న్‌లో మొదలుకావాల్సి ఉన్న ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రిక్స్‌పై అనిశ్చితి కొనసాగుతున్నది. ఫార్ములా వన్ సీజన్ తొలి రేస్ అయిన ఈ టోర్నీలో పాల్గొనేందుకు పలువురు రేసర్లు దుబాయ్, దోహా మీదుగానే రావాల్సి ఉంది. అయితే పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని తెలిపిన ఆస్ట్రేలియా ఫార్ములా1 చీఫ్ ట్రావిస్ ఆల్డ్.. టోర్నీని షెడ్యూల్ ప్రకారం జరిపించేందుకు అన్ని యత్నాలు చేస్తున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశాడు.

### లంక, ఆఫ్ఘాన్ సిరీస్ కష్టమే..

శ్రీలంక, ఆఫ్ఘానిస్థాన్ మధ్య దుబాయ్‌లో ఈనెల 13 నుంచి 25 వరకు జరుగబోయే టి–20, వన్డే సిరీస్‌లు కూడా భద్రతాకారణాలతో వాయిదా పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

### ఇరాన్.. ఫిఫా ఆడుతుందా?


తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది వేసవిలో యూఎస్, కెనడా, మెక్సికోలో జరుగబోయే ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్ (ఫిఫా)లో ఇరాన్ ఆడుతుందా? లేదా? అన్నది అనుమానంగానే ఉంది. ఫిఫా వరల్డ్ కప్‌కు అర్హత సాధించిన ఇరాన్.. బెల్జియం, ఈజిప్ట్, న్యూజిలాండ్‌తో కలిసి గ్రూప్–జిలో ఉంది. తమ దేశంలో యుఎస్ జరుపుతున్న దాడుల నేపథ్యంలో ఇరాన్.. అమెరికాలో ప్రపంచకప్ ఆడుతుందా? అన్నదానిపై ఆ దేశ ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు మెహ్ది తాజ్ మాట్లాడుతూ.. 'ఈ దాడుల తర్వాత మనం ప్రపంచకప్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నామని ఆశించలేం' అని చెప్పడం గమనార్హం. ఇప్పటికే ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఎఫ్‌సి).. చాంపియన్స్ లీగ్ వెస్ట్ జోన్ ప్లేఆఫ్ మ్యాచ్‌లను వాయిదా వేసిన విషయం తెలిసిందే. పర్షియన్ గల్ఫ్ ప్రో లీగ్‌లో మ్యాచ్‌లు కూడా రద్దయ్యాయి.



## మహిళ

# హెచ్‌ఐవి నుంచి రక్షణకు టీకాలు


మానవ చరిత్రలో కొన్ని వ్యాధులు సైలెంట్‌గా దాడి చేస్తాయి. అవి శబ్దం చేయవు, కానీ జీవితం మార్చేస్తాయి. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) అలాంటిదే. ఈ వైరస్ వల్ల గర్భాశయ కేన్సర్ సహా పలు రకాల కేన్సర్లు వస్తాయి. వాటిని నివారించడానికి రూపొందించిన హెచ్‌పివి టీకాలు ప్రజారోగ్య రంగంలో ఒక పెద్ద ముందడుగు. 2006లో మొదటి టీకా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆరు లైసెన్స్ పొందిన టీకాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రోటీన్ సబ్‌యూనిట్ టీకాలు, అంటే వైరస్‌లోని ఒక భాగాన్ని ఉపయోగించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి అంతా అత్యంత సురక్షితమైనవిగా నిరూపితమయ్యాయి. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న టీకాలు మూడు బైవేలెంట్ (రెండు రకాల హెచ్‌పివిపై రక్షణ), రెండు క్వాడ్రివేలెంట్ (నాలుగు రకాలపై), ఒక నోనావేలెంట్ (తొమ్మిది రకాలపై)గా విభజించబడ్డాయి. ప్రముఖ బ్రాండ్‌లలో గార్డసిల్, గార్డసిల్ 9, సెర్వారిక్స్ వంటి టీకాలు ఉన్నాయి. ఈ టీకాలన్నీ హెచ్‌పివి 16, 18 రకాల నుంచి రక్షణనిస్తాయి. క్వాడ్రివేలెంట్ టీకాలు అదనంగా హెచ్‌పివి 6తోపాటు 11 రకాలపై వ్యాధికారకాల నుంచి రక్షణ ఇస్తాయి, ఇవి జననాంగ మసూరికాలకు ప్రధాన కారణాలు. నోనావేలెంట్ టీకా మరింత ముందుకెళ్లి 31, 33, 45, 52, 58 రకాలపై కూడా రక్షణ ఇస్తుంది. హెచ్‌పివి టీకాలు సుమారు 70 శాతం గర్భాశయ కేన్సర్, 80 శాతం మలద్వార కేన్సర్, 60 శాతం యోని కేన్సర్, 40 శాతం వల్వార్ కేన్సర్‌ను నివారించగలవని అంచనా. హెచ్‌పివిపాజిటివ్ ఒరోఫెరింజియల్ కేన్సర్లను 90 శాతం కంటే ఎక్కువగా తగ్గిస్తాయి. అదనంగా, లింగ కేన్సర్‌పైనా రక్షణ ఇస్తాయి. జననాంగ మసూరికాల విషయంలో క్వాడ్రివేలెంట్, నోనావేలెంట్ టీకాలు దాదాపు సంపూర్ణ రక్షణ అందిస్తాయి. ఇవి కనీసం 5 నుంచి 10 సంవత్సరాలపాటు రక్షణ ఇస్తాయని ఆధారాలు సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాలు దీని కంటే ఎక్కువకాలం కూడా రక్షణ కొనసాగవచ్చని సూచిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌ఒ) హెచ్‌పివి టీకాలను తన అత్యవసర ఔషధాల జాబితాలో చేర్చింది. గర్భాశయ కేన్సర్ నివారణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని దేశాలు ఈ టీకాను సాధారణ రోగనిరోధక కార్యక్రమంలో భాగంగా చేర్చాలని సూచిస్తోంది. ప్రధాన లక్ష్యంగా 9 నుంచి 14 సంవత్సరాల మధ్య బాలికలకు టీకాలు ఇప్పించాలని నిర్ణయించింది. లైంగిక కార్యకలాపాలు ప్రారంభమయ్యే ముందే టీకా ఇవ్వడం అత్యుత్తమం. డబ్ల్యుహెచ్‌ఒ సిఫారసు ప్రకారం 9–14 సంవత్సరాల బాలికలకు ఒక లేదా రెండు డోసులు సరిపోతాయి. 15–20 సంవత్సరాల యువతులకు కూడా అదే విధానం వర్తిస్తుంది. 21 సంవత్సరాలకంటే పైబడిన మహిళలకు ఆరు నెలల విరామంతో రెండు డోసులు అవసరం. ఒకే డోసుతో సరిపోతుందనే మార్గదర్శకం కొత్తగా వచ్చింది.




హెచ్‌పివితో సంబంధమున్న కేన్సర్లలో 82 శాతం గర్భాశయ కేన్సర్లే కావడం గమనార్హం. వాటిలో 95 శాతం కంటే ఎక్కువ కేసుల్లో హెచ్‌పివియే కారణం. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గర్భాశయ కేన్సర్ కేసుల్లో 88 శాతం తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోనే నమోదయ్యాయి. మరణాల్లో 90 శాతం కూడా అదే దేశాల్లోనే. అధిక ఆదాయ దేశాల్లో ఈ శాతం కేవలం 2 మాత్రమే. సహారా దక్షిణ ఆఫ్రికాలో మరణాల రేటు ప్రతి లక్ష మహిళల్లో 40 కంటే ఎక్కువగా ఉండగా, కొన్ని అధిక ఆదాయ దేశాల్లో అది ప్రతి లక్షకు 2కంటే తక్కువ. అత్యధిక ప్రభావిత దేశాల్లో 20లో 19 ఆఫ్రికాలోనే ఉన్నాయి. హెచ్‌ఐవితో జీవిస్తున్న మహిళల్లో హెచ్‌పివి ఇన్ఫెక్షన్ ఎక్కువకాలం నిలిచి కేన్సర్‌గా మారే అవకాశమూ ఎక్కువ. వికసిస్తున్న దేశాల్లో 2008 నాటికి గర్భాశయ కేన్సర్ ఉన్న మహిళల్లో కేవలం 41 శాతం మందికే సరైన వైద్య చికిత్స లభించింది. స్క్రీనింగ్ సదుపాయాలు పరిమితం. అందువల్ల ముందస్తు నిరోధక టీకా అత్యంత వ్యయసమర్థ ప్రజారోగ్య చర్యగా మారింది. అమెరికా జాతీయ కేన్సర్ సంస్థ ప్రకారం విస్తృత టీకా కార్యక్రమం అమలు అయితే ప్రపంచవ్యాప్తంగా గర్భాశయ కేన్సర్ మరణాలను రెండు మూడవ వంతు వరకు తగ్గించవచ్చు. టీకా తీసుకున్నా కూడా స్క్రీనింగ్ అవసరం. ఎందుకంటే టీకాలు అన్ని అధిక ప్రమాద రకాలపై రక్షణ ఇవ్వవు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021 నుంచి హెచ్‌పివి డిఎన్ఎ పరీక్షను ప్రాధాన్య స్క్రీనింగ్ విధానంగా సూచిస్తోంది. సారాంశంగా చూస్తే, హెచ్‌పివి టీకా ఒక సాధారణ ఇంజెక్షన్ మాత్రమే కాదు. అది ముఖ్యంగా వేలాది మహిళల ప్రాణాలను కాపాడగల సామర్థ్యం కలిగిన సాధనం. టీకా, స్క్రీనింగ్, అవగాహన ఈ మూడు కలిస్తేనే పూర్తి రక్షణ సాధ్యం. మనకు చేతిలో ఉన్న ఒక సురక్షితమైన, సమర్థమైన సాధనాన్ని విస్తృతంగా ఉపయోగించడం ద్వారా ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యను తగ్గించవచ్చు. టీకా విషయంలో నిర్లక్ష్యం కంటే సమాచార ఆధారిత నిర్ణయం మంచిది.


## మహిళాభ్యుదయానికి కృషి

దేశ వ్యాప్తంగా వివిధ విద్యా, స్వచ్ఛంద సంస్థలు మహిళాభ్యుదయానికి విశేషంగా కృషి చేస్తున్నాయి. ఆ క్రమంలోనే ఒపి జిందాల్ గ్లోబ్ యూనివర్సిటీ హర్యానాలోని సోనెపట్‌లో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకూ రెండు రోజుల మహిళా సదస్సు నిర్వహించనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుసర్కరించుకొని నిర్వహించే ఈ కార్యక్రమం, మహిళా అభివృద్ధి అనేది కేవలం సంక్షేమ కార్యక్రమాల పరిమితిలో ఉండే అంశంకాదని, అది జ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వం, సామాజిక భాగస్వామ్యంతో ముడిపడిన సమగ్ర పరివర్తన ప్రక్రియగా చూడాలని స్పష్టం చేయనుంది. ఈ దృక్కోణాన్ని ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నంగా మహిళలపై జాతీయస్థాయి సమావేశం, కళాసాహిత్య ఉత్సవం జరపనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సదస్సు మహిళా సాధికారతకు కొత్త దిశను సూచిస్తుంది. దేశంలో గత దశాబ్దా ల్లో మహిళల విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో పురోగతి జరిగినప్పటికీ, లింగ అసమానత ఇంకా వివిధస్థాయిల్లో కొనసాగుతోంది. కుటుంబ వ్యవస్థల్లో, ఉద్యోగప్రదేశాల్లో, విద్యాసంస్థల్లో, సాంస్కృతిక వేదికల్లో మహిళలు ఎదుర్కొనే అవరోధాలు సమాజ నిర్మాణంలో ఉన్న లోతైన అసమానతలను ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ రంగంలో సమానఅవకాశాలు, విధాన నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం, డిజిటల్ భవిష్యత్తులో మహిళల పాత్ర వంటి అంశాలు కీలకంగా నిలుస్తాయి. ఇలాంటి సమావేశాలు, సదస్సులు ఎంత ఎక్కువగా జరిగితే, మహిళలకు అంత ప్రయోజనకరం.




## సింగరేణి లారీ డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలి

### ఎఐటియుసి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/రెబ్బన :** సింగరేణి సంస్థలోని బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్ల వేతనాలు పెంచి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో యూనియన్ రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ మంగళవారం టిటిసి యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు లాభాలు రావడంలో రవాణా కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, కానీ వారికి కనీస కార్మిక చట్టాలు అమలు కాక శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 17 తర్వాత ఏ రోజైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ముఖ్యంగా బొగ్గు రవాణా చేసే లారీ డ్రైవర్లకు నెలకు రూ.32,000, క్లీనర్లకు రూ.18,000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, కార్మికులకు రూ. 25 లక్షల ఆరోగ్య బీమా, రూ. 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సింగరేణి లాభాల్లో శాశ్వత కార్మికులతో సమానంగా రవాణా కార్మికులకు వాటా ఇవ్వాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాస్, ప్రశాంత్, కృష్ణ, రాజు, ఛాందర్ లాల్, మనోహర్, సతీష్ పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : రంగయ్య




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెండింగ్‌లో ఉన్న కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య కోరారు. బుధవారం స్థానిక శేషగిరిభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కార్మిక సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న కార్మిక సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం మానుకోవాలన్నారు. మెడికల్ బోర్డు నిర్వహణ లేకపోవడం వల్ల అనారోగ్యం పాలైన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంతింటి పథకం, మారుపేర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆదాయ పన్నును కోల్ ఇండియా తరహాలో యాజమాన్యమే భరించాలని, డిస్మస్ అయిన ఉద్యోగులకు మరోసారి అవకాశం ఇవ్వాలని, దీర్ఘ కాలిక కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వంగ వెంకట్, రమణ మూర్తి, గట్టయ్య, చందయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి

### సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/ఆలేరు :** అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో కొలనుపాకలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భూపోరాటాలలో భాగంగా మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 8లో పేదలకు ఇండ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అనేక రోజులుగా భూ పోరాటాలు కొనసాగుతున్నప్పటికీ పేదలకు న్యాయం జరగలేదన్నారు. ఇంటి స్థలాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు పేదల పక్షాన నిలిచి గుడిసెల పోరాటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి పున్నబోయిన రవి, భూ పోరాట కమిటీ సభ్యులు మోతే భవాని, సంపతి పార్వతి, బిక్షపతి, భాగ్యలక్ష్మి, కర్ర సరిత, సుశీల, సంధ్య, మౌనిక, రేణుక, వర్దేస్ బాల్రాజ్, కందుల రమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై ఆధారపడిన మానవ మనుగడ

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య అన్నారు. మంగళవారం భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అడవిని, అటవీ సంపద కాపాడుకునే బాధ్యత కేవలం ఫారెస్ట్ అధికారులచే కాదని ప్రజలందరిదన్నారు. స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో సమతుల్యత ఉండాలంటే అడవులు ఉండాలని, మనిషికి ప్రాణవాయు వు అడవులు నుంచే వస్తుందని, అడవి జంతువులని నా చిన్నతనం నుండి ఇప్పటి వరకు చేసుకున్నట్లయితే చాలా వరకు అంతరించిపోయాయని, వాటిని కాపాడుకునే బాధ్యత కూడా మనదేనన్నారు, భావితరాలకు జంతువులు ఉన్నాయని చెప్పడమే కాకుండా, వారికి జంతువులు చూపెట్టాలన్నారు. ఫారెస్ట్ అధికారులకి మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఆళ్లపల్లి మండలంలో గల కొన్ని గ్రామాలు సరైన రహదారులు లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయని సింగారం, పెద్ద వెంకటాపురం, దొంగతోగు వంటి గ్రామాలకి రహదారులు లేవని వాటికి అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆళ్లపల్లి మండల కేంద్రం నుండి అనిశెట్టిపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరులో ఉందని, దానికి కూడా ఫారెస్ట్ వారు అనుమతులు ఇవ్వాలని కోరారు. పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీకి 11కెవి త్రీ ఫేస్ లైన్‌కి అనుమతులు ఇవ్వాలని కోరారు. సిపిఐ నాయకుడు ఎల్లయ్య అడగడమే ఫారెస్ట్ అధికారులు సానుకూలంగా స్పందించారు. మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.




## ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ము కాస్తున్న విద్యాశాఖ అధికారులు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రైవేట్ పాఠశాలల కొమ్ముకాస్తున్న మండల విద్యాధికారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా స మావేశంలో ఆకాష్‌నాయక్ మాట్లాడుతూ జిల్లేడు చౌదరిగూడ మండల విద్యాధికారి ప్రైవేట్ పాఠశాలల కొమ్ముకాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాల్సిన విద్యాధికారి ప్రైవేట్ పాఠశాలలకు ప్రచారకర్తగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవ కరపత్రాన్ని ఎంఇఒ వ్యక్తిగతంగా వాట్సాప్ స్టేటస్ పెట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే మరోవైపు విద్యాధికారి మాత్రం ప్రైవేట్ పాఠశాల కార్యక్రమాలను ప్రమోట్ చేయడం ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ఎంఇఒపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బిసి డిక్లరేషన్ అమలుపర్చకుండా

# ఇంకెంత కాలం మోసం?

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభ బిల్లులు ఆమోదించిన తరువాత జరిగిన పార్లమెంటు సమావేశాలలో ఆ అంశంపై ప్రస్తావించని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పంచాయితీ ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత తీరికగా రాబోయే పార్లమెంటు సమావేశాలలో బిసి కోట పెంపుపై కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ బిల్లు ప్రవేశం పెడుతుందని హైదరాబాదులో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇండియా కూటమి సభ్యులను కలుపుకొని గతంలో జరిగిన పార్లమెంటు సమావేశాలలోనే బిల్లు ప్రవేశపెట్టేదన్నారు. బిసిలను వంచించడంలో కాంగ్రెస్, బిజెపి దొందు దొందేనన్నారు. దేశ జన గణనలో కుల గణన సక్రమంగా చేసి జనాభా ప్రాతిపదికన బిసిలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పించాలన్నారు. చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు మహిళా రిజర్వేషన్లలో బిసి కోట కల్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్రంలో మొదటి అసెంబ్లీ సమావేశంలోనే చట్టబద్ధమైన హోదాతో మహాత్మా జ్యోతిరావు పూలే బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి రూ.20 వేల కోట్ల ఐదేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చేసిన వాగ్దానం ఏమైందన్నారు. ఈ బడ్జెట్ సందర్భంగానైనా బిసిల అభివృద్ధికి సంక్షేమానికి రూ.60 వేల కోట్లు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో వృత్తి బజార్ పేరుతో 50 దుకాణాల కాంప్లెక్స్‌లు నిర్మాణం చేసి చేతువృత్తుల వారికి ఇస్తామన్న వాగ్దానం ఇంకెప్పుడు అమలు జరుపుతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో బిసి ఐక్యత భవనాలు, ప్రతి మండలంలో బిసిలకు ఒక కొత్త ప్రభుత్వ గురుకులవిద్యాలయం ఏర్పాటు చేయడం, బిసి విద్యార్థులకు అందరికి మొత్తం ఫీజు రియంబర్‌మెంట్స్, వృత్తిదారుల సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ ఆర్థిక వనరులు సమకూర్చడం, చేనేత గీత కార్మికులకు ఇస్తున్న విధంగానే చేతి వృత్తుల వారికి 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చేసిన వాగ్దానాలను అమలు పరచరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బిసి డిక్లరేషన్ లో చేసిన వాగ్దానాలను అమలు పరిచేందుకు కార్యాచరణ ప్రకటించాలని లేనిచో బిసిల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. బిసిలు న్యాయమైన డిమాండ్స్ సాధనకై చైతన్యంతో సంఘటితమై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని చేశారు.

## సిపిఐ కార్యాలయంలో హోలీ వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** నగరంలో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.చిన్న పెద్ద తేడా అనే లేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. హోలీ సంబరాల్లో చిన్నారులు విద్యార్థులు, యువకులు పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ రంగులు చల్లుకుంటూ పాటల నృత్యాలతో డ్యాన్సులు చేస్తూ సంబరాలు నిర్వహించారు. నగరంలోని గణేష్ నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో గణేశ్ నగర్ వాసులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే తీగలగుట్ట పల్లి గాయత్రి నగర్‌లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కాలనీవాసులంతా ఒకచోట చేరి రంగులు చల్లుకుని హోలీ శుబాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంబరాల్లో కానిగంటి రాజమౌళి, అంజన్న, విద్యాసాగర్, నరేందర్, వెంకటరాజు, కిరణ్, కుమార రాజా,శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.



## చరిత్రలో విద్యుత్ వినియోగం సరికొత్త రికార్డు

### ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పిడిసిఎల్ ) చరిత్రలో విద్యుత్ వినియోగం సరికొత్త గరిష్ట స్థాయిని తాకిందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం నాడు సంస్థ పరిధిలో 6441 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైందని, ఇది సంస్థ చరిత్రలోనే లిఖించదగ్గ రోజు అని అన్నారు. రికార్డు స్థాయి డిమాండ్ నిన్న (సోమవారం) నమోదైన 6,273 మెగావాట్ల రికార్డును అధిగమిస్తూ, మంగళవారం 6441 మెగావాట్లకు డిమాండ్ చేరుకుందన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని సీఎండీ పేర్కొన్నారు. డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కోవడానికి సంస్థ ఇప్పటికే పూర్తిస్థాయిలో సిద్ధమైందని సీఎండీ అన్నారు. ముందస్తు ప్రణాళికలతో, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

## ఎస్‌పి కార్యాలయంలో హోలీ వేడుకలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** స్నేహభావానికి, ఐక్యతకు ప్రతీక హోలీ పండుగ నిలుస్తుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా హోలీ శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, పాత్రికేయ మిత్రులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డిఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ మండలంలోని బత్తినివానిపల్లి, గూడూరు గ్రామాలకు చెందిన సంఘ నవీన్, సుదర్శన్‌లకు సంబంధించిన రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయగా వారిపై కేసు నమోదు చేసి మండల తహశీల్దార్ సురేష్ కు బైండోవర్ చేసినట్లు కమలాపూర్ సిఐ నవీన్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కాంగ్రెస్ నాయకుడు నర్సయ్య మృతి

### నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సిరబోయిన రాజు తండ్రి సిరబోయిన నర్సయ్య మరణం పట్ల కాంగ్రెస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మంగళవారం దమ్మన్నపేటలోని నర్సయ్య నివాసానికి వెళ్లిన నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబ్బ అంజయ్య, మార్కెట్ డైరెక్టర్ అల్లా చిన్న కొమురయ్య, మండల పార్టీ సీనియర్ నాయకులు మరుపట్ల సాయికుమార్, అబిడి సోమిరెడ్డి, మెరుగు రమేష్, లింగా రాజు, మెరుగు రాజాలు, దుబ్బ యాకయ్య, రంజిత్, దుబ్బ ఎల్లయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## నూతన వేతనాల ఒప్పందం



**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట హైర్ బస్ డ్రైవర్ నూతన జీతభత్యాల విషయంలో యజమానులు, డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు చేసుకున్నవేతనాల ఒప్పంద సమయం డిసెంబర్ 2025తో ముగిసినందున నూతన ఒప్పందం చేసుకోవడానికి డ్రైవర్ యూనియన్ నాయకులు యాజమాన్యాలకు వేతనాల డిమాండ్ నోటీసు ఇవ్వగా మంగళవారం నర్సంపేట పట్టణంలో కార్మికులకు యజమాలకు మధ్య చర్చలు జరిపి నూతన వేతనాల అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని జరిగిందని వరంగల్ జిల్లా ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగిశెట్టి ప్రసాద్ తెలంగాణ హైర్ బస్‌ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లక్కం ప్రభాకర్ దినేష్ రవీందర్ రెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె వెలుగు డ్రైవర్‌కు 15 రోజులకు వేతనం రూ.18,500, ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు 15 రోజులకు వేతనం 20,500, టెంపరరీ డ్రైవర్ కు పల్లె వెలుగు బస్సుకు ఒక రోజుకు రూ.1250, ఎక్స్‌ప్రెస్ టెంపరరీ డ్రైవర్‌కు ఒక్కరోజుకు రూ.1400, దసరా పండుగ సందర్భంగా ఒక సంవత్సరం సీనియారిటి ఉన్న ప్రతి డ్రైవర్‌కు బోనస్‌గా రూ.2000, క్లీనర్‌కు 30 రోజులకు వేతనం రూ.4500 ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ అగ్రిమెంట్ 01/01/2026 నుండి 31/12/2028 సంవత్సరం వరకు వరిస్తుందన్నారు. ప్రతి రెండు సంవత్సరములకు ఒకసారి ఇకనుండి ఉన్న వేతనాల పైన 10శాతంపెంచి ఇవ్వాలని ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందికొండ రాజు, ప్రధాన కార్యదర్శి కట్ల ప్రశాంత్, కోశాధికారి ఎరుకల రాజు, సోడ రంజిత్ కుమార్, రంజిత్, ప్రకాష్, శ్రీకాంత్, శ్రావణ్ తదితరు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

### తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సమీక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ :** వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వేసవిలో జరిగిన నీటి వినియోగం, ఎల్ఎండీ నుంచి నీటి అందుబాటు, చలివాగు నుంచి ధర్మసాగర్ పంపు హౌస్‌కు నీటి పంపింగ్, అక్కడి నుంచి జిల్లాకు నీటి సరఫరా వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పరంగా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నట్లు అధికారులు వివరించారు. జిల్లాకు నీరు సరఫరా అయ్యే మూడు సెగ్మెంట్ల వివరాలు, రోజువారీ సరఫరా స్థితి తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించిన రిజర్వాయర్లలో నీటిమట్టం తగ్గకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లలో లీకేజీలు లేకుండా ముందస్తు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి సరఫరా కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాలీక రూపొందించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ చలమారెడ్డి, ఈఈలు రామాంజనేయులు, రామ్ కుమార్, గాయత్రి, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఆటో బోల్తా పడి ఒకరు దుర్మరణం

**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన బోయిని తిరుపతి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆటో యూనియన్ సభ్యులతో కలిసి నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ సమ్మక్క సారక్క గద్దెల వద్దకు విందుకు వచ్చారు. తిరిగి తిరుపతి తన ఏపీ15 డబ్ల్యు 2410 నెంబర్ గల ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా కౌకొండ గ్రామ శివారులోని గుట్టల వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడి తీవ్ర గాయాలతో మృతి చెందారు. మృతుని తల్లి అయిన బోయిని జానకి భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు దామెర ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భూములు లాక్కోవద్దని ఆందోళన



**ప్రజాపక్షం/తాడ్వాయి :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములలో అటవీ శాఖ అధికారులు జేసిబిలతో కందకాలు తవ్వే ప్రయత్నం చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోడు రైతులు అక్కడికి అధిక సంఖ్యలో చేరుకొని 25 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ బతుకుతున్నామని, తమ జీవనాధారమైన భూములను లాక్కోవద్దని రైతులు ఆందోళనకు దిగారు. కందకాలు తీయకుండా జేసిబి ఎక్కి పనులు నిలిపివేయాలని నిరసన చేశారు.

## రైల్వే కోర్టుకు ఉద్యమకారులు

**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన పలువురు ఉద్యమకారులు 2011లో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం నిర్వహించిన రైల్ రోకో, మహా ధర్నా సందర్భంగా నమోదైన రైల్వే కేసు పిసి నెంబర్. 437/22/2011 విచారణ నిమిత్తం మంగళవారం వరంగల్ జిల్లా రైల్వే కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు ఆవరణలోనే హోలీ పండగను గుర్తు చేసుకుంటు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉదృతంగా సాగిన ఉద్యమంలో భాగంగా అలంకానిపేటకు చెందిన పలువురు నాయకులు రైల్ రోకోలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా నమోదైన కేసు విచారణ ప్రస్తుతం కొనసాగుతుంది. ఈ కేసులో నెక్కొండ మార్కెట్ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, గ్రామ మాజీ సర్పంచ్ భర్త మాదాసు రవి, తదితరులు కోర్టులో హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడిచినా, ఉద్యమ కాలంలో నమోదైన కొన్ని కేసులు ఇంకా కొనసాగుతున్నాయని కేసులో ఉన్న వారు పేర్కొన్నారు. నాటి బిఆర్ఎస్ నేటి కాంగ్రెస్ నేతలు ప్రజా ప్రతినిధులు ఉద్యమకారులపై మొసలి కన్నీరు కారుస్తున్నారు తప్ప ఇలాంటి కేసులను కొట్టి వేయించకుండా ఇంకా సాగదీయడం బాధాకరమని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. హోలీ పండగ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో కలుసుకున్న ఉద్యమకారులు, ప్రత్యేక తెలంగాణ సాధనలో తమ పాత్రను స్మరించుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు పంచుకున్నారు.



## కమిషనరేట్ కార్యాలయంలో హోలీ సంబరాలు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హోలీ పండుగను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. బ్యాండ్ వాయిద్యాల మధ్య పోలీస్ అధికారులు, సిబ్బంది కమిషనర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు, రంగులతో ముంచెత్తారు. అనంతరం పోలీస్ కమిషనర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పరస్పరం ఒకరికి ఒకరు రంగులు జల్లుకుంటూ పోలీస్ కమిషనర్ దంపతులతో పాటు అధికారులు, సిబ్బంది తీన్మార్, నాగిన్ డాన్స్ స్టెప్పులతో నృత్యాలు చేస్తూ సాంప్రదాయ పద్ధతిలో, ఆనందోత్సాహాల నడుమ హోలీ పండుగ వేడుకలను జరుపుకుంటూ అధికారులు, సిబ్బందికి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, హోలీ పండుగ సౌహార్దం, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సంతోషాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, ఏ.ఎస్పీ శుభం, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డీసీపీ సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్. ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పలువురు పోలీస్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ప్రజాపక్షం/కాటారం:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘనటన కాటారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పొలం రాజేందర్ ఈనెల 1న రాత్రి పది గంటల సమయంలో తన ఇంటినుండి హోండా బైక్‌మీద కాటారం వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కాటారం సమీపంలోని జెన్‌కో కార్యాలయం ముందు ఉన్న సంపులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మూడు రోజులుగా గాలిస్తున్న క్రమంలో మంగళవారం విషయం తెలుసుకున్న ఇంటి సభ్యులు పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాటారం ఎస్సై ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

## వన్యప్రాణుల రక్షణతోనే పర్యావరణ పరిరక్షణ




డిఆర్ఓ మాధవి

**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికీ అటవీశాఖ అధికారులు రేంజ్ కార్యాలయం నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా డిఆర్ఓలు మాధవి శ్రీనువాస్‌న్ మాట్లాడుతూ వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ప్రాణాధారం అని పేర్కోన్నారు. అడవులు వన్యప్రాణులు సంరక్షితంగా ఉన్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని వారు అన్నారు. ప్రకృతి వ్యవస్థలో ప్రతి జీవికి ప్రత్యేకమైన పాత్ర ఉందని అడవులు శాశనం కావడం వల్ల వన్యప్రాణులతో పాటు మానవ జీవనానికి కూడా ఏర్పడుతుందని డిఆర్ఓ మాధవి శ్రీనువాస్‌న్ హెచ్చరించారు. వన్యప్రాణుల అక్రమ వేటను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ అటవీశాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా వన్యప్రాణుల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత విద్యార్థులు ఈ విషయంలో ముందుకు రావాలని పర్యావరణ పరిరక్షణలో తమ వంతు ప్రాత పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణులు సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. వన్యప్రాణుల రక్షణకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమలు అవగాహన సదస్సులు అటవీ అభివృద్ధి పనులు గురించి తెలిపారు. కార్యక్రమం చివరగా వన్యప్రాణులను రక్షించుకుందాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నివాదంతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

## వైభవంగా గోపయ్యస్వామి కల్యాణోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



**ప్రజాపక్షం/నర్సింహులపేట :** మండల కేంద్రంలో కొలువుదీరిన గోపయ్య స్వామి, సహిత తిరుపతమ్మ తల్లి 16వ వార్షిక కళ్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కుమారాచార్యులు అధ్వర్యంలో గణపతి పూజా, పుణ్యావాచకం, కంకనాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ గోపయ్యస్వామి తిరుపతమ్మ తల్లి కళ్యాణ ఘట్టం కమనీమంగా జరిగింది. కాగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో తిరుపతమ్మ తల్లికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. కళ్యాణం ఆనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

## అంబరాన్నంటిన హోలీ వేడుకలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** హోలీ పండుగ సంబురాలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అంబరాన్నంటాయి. జిల్లా ఎస్పి డా.శబరీష్‌తో సహా యువకులు, మహిళలు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు హోలీ సంబరాల్లో పాల్గొని రంగులు పూసుకుంటూ కేరింతలు కొడుతూ డాన్స్‌లు చేసుకుంటూ సంబురాల్లో పాల్గొన్నారు. వాడవాడల్లోనూ, పలు కాలనీల్లోనూ హోలీ వేడుకలు జరుపుకున్నారు. సిపిఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ వాకర్స్ హోలీ రంగులు పూసుకుని వేడుక జరుపుకున్నారు. జిల్లా ఎస్‌సి డాక్టర్ శబరీష్ ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేంగా హోలీ వేడుకల్లో పాల్గొని పోలీసు అధికారులతో కలిసి డాన్స్‌లు వేశారు.

**సిపిఐ ఆధ్వర్యంలో...**

నేడు హోలీ పర్వదినం సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోటీ చేసిన వార్డులలో తెలియ తిరుగుతూ అందరికీ రంగులు పూస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి మాట్లాడుతూ ఈ హోలీ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రతి ఇంట్లో రంగులు వలె సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొత్త బజార్ పాత బజార్లలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా హోలీ పండుగ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి , వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, కేదాసు రమేష్, ఆబోతు అశోక్, జనగాం ప్రవీణ్, అజ్మీర వేణు తదితరులు పాల్గొన్నారు.

**ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో హోలీ సంబురాలు జరుపుకున్నారు. కుల, మత, వర్గ, ప్రాంత బంధాలతో సంబంధం లేకుండా రంగులు చల్లుకొని సంతోషాలతో కేరింతలతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల శంభయ్య, ఉపాధ్యక్షులు నల్లు సుధాకర్ రెడ్డి కళ్ళెం వెంకట్ రెడ్డి, దాసరి ప్రసాద్, సాధు మైపాల్ రెడ్డి కాపరమైన శ్రీనివాస్ పమ్మీ రాజు, బొడ్డుపల్లి ఉపేంద్రం, ఇమ్మడి కృష్ణమూర్తి, కామ సంజీవరావు, సుంకర పరంధామయ్య ముల్లంగి వెంకటరెడ్డి, మార్కండేయులు, జంగం రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా హోలీ సంబురాలు



**ప్రజాపక్షం/జనగామ :** జనగామలో ప్రజలు ఎంతో ఘనంగా హోలీ సంబురాలు జరుపుకున్నారు. వేద పండితులు నేడు, రేపు జరుపుకోవాలో అనేది తేల్చని సమయంలో జనగామలో మంగళవారం సంబురాలు జరిగాయి. జర్నలిస్టులతో పాటు పుర ప్రముఖులు డిసిపి కార్యాలయంతో పాటు పలు కార్యాలయాలు, రాజకీయ నాయకుల నివాసాల్లో హోలీ సంబురాలు జరుపుకున్నారు. జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్ నివాసంలో ఘనంగా హోలీ సంబురాలు జరిగాయి. డిసిపి రాజమహేంద్రనాయక్ అందరికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంబురాల్లో జరల్నిస్టులు ఇర్రి మల్లారెడ్డి, పార్నంది వెంకటస్వామి, కిరన్, సురిగెల బిక్షపతి, తిప్పారపు ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, చౌదరపల్లి ఉపేందర్, కేమిడి ఉపేందర్ పాల్గొన్నారు. డాక్టర్ సుగుణాకర్ రాజు నివాసంలోనూ హోలీ సంబురాలు జరిగాయి. డాక్టర్ సుగుణాకర్‌రాజుతో పాటు పలువురు జర్నలిస్టులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## రామకృష్ణ విద్యాలయ సిల్వర్ జూబ్లీ వేడుకలు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యాబోధనలో పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న బచ్చన్నపేట రామకృష్ణ విద్యాలయం సిల్వర్ జూబ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంది. స్థానిక శ్రీనివాస గార్డెన్స్‌లో జరిగిన ఈ రజతోత్సవ వేడుకలు విద్యా కుసుమాల కోలాహలంతో, సాంస్కృతిక ప్రదర్శనలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ వేడుకలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డిసిపి రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అనేది కేవలం పుస్తక పరిజ్ఞానం మాత్రమే కాదని వ్యక్తిత్వ వికాసానికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అష్టకాల విశ్వేశ్వర శర్మ, సర్పంచ్ అల్వాల నర్సింగరావు, ఊర్మిల ప్రసాద్, రాంరెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, మురలీ, రాజు, ఆంజనేయులు గౌడ్, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



## గంజాయి కేసులో జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఒకోక్క కేసులో ఏడాది పాటు జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె ఉమాదేవి తీర్పు చెప్పారు. పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి బోయిన వెంకటరమణ రెండు వేల ఇరవై నాలుగు, ఇరవై ఐదు సంవత్సరాలలో వియం బంజర పోలీసులు చేపట్టిన తనిఖీలలో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కలిమేరు మండలం కురుమనూరు గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని వియం బంజర పరిసర ప్రాంతాల్లో చిన్నచిన్న పోట్లాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నట్లు పోలీసు విచారణలో తెలింది. ఇతనిపై పోలీసులు ఎన్‌డిపిఎస్ 1985 చట్టం కింద కేసునమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖాలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ ముత్తు లింగం, ఎస్సై వెంకటేష్, అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ జె శరత్ కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సైదులు, రామారావు, కోర్టు లైజనింగ్, ఎస్సై కె.శ్రీకాంత్, హోంగార్డ్ ఆఫీసర్ ఎండి ఆయూబ్ ను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు.

## పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలి

పిఆర్‌పిఎ జిల్లా కన్వీనర్ యలమద్ది



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించాలని పిఆర్‌పిఎ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) తెలిపారు. మంగళవారం పిఆర్‌పిఎ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రోటరీనగర్‌లో నివాసం ఉంటున్న పెన్షనర్లకు పిఆర్‌పిఎ సభ్యత్వాన్ని యలమద్ది వెంకటేశ్వర్లు అందజేశారు. అనంతరం జరిగిన పిఆర్‌పిఎ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉద్యోగ సమయంలో దాచుకున్న నగదును వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యూటీ, కమ్యుటేషన్, జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ వంటివి ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులుపడుతూ మనోవేదన చెందుతున్నారన్నారు. పిఆర్‌సిని వెంటనే ప్రకటించడంతో పాటు డిఎ బకాయిలను కూడా విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్. సీతారామయ్య, జగన్‌మోహన్ రావు, జిఎస్ నారాయణ, పి. కొండలరావు, కొత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 'స్పోర్ట్స్ స్కూల్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహించబడుతున్న రెండు మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని (బాలురు) 40 సీట్లు, కాచినపల్లి (బాలికలు) 40 సీట్లు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోవేనపల్లి హైదరాబాద్ నందు ఐదవ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు బాలురకు 10, బాలికలకు 10 సీట్లు భర్తీ చేయుటకు కొత్త ప్రవేశాలకు, గత సంవత్సరానికి చెందిన ఖాళీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ స్కూల్ నందు 24, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ నందు 11 మొత్తం 35 సీట్లు నింపుటకు తగు క్రీడలను ఎంపికల కొరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ప్రవేశాలకు ఎంపిక జిల్లా స్థాయి నందు ఈనెల 16 నుండి 18 వరకు, తుది ఎంపికలు ఐటిడిఎ (ఉమ్మడి జిల్లా ) స్థాయిలో ఈనెల 28 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ఐదవ తరగతి నందు ప్రవేశం కొరకు 2026 ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్ల వయస్సు వారు తగు ధృవీకరణ పత్రాలు (విద్యార్థి ఆధార్ కార్డు, నాల్గవ తరగతి స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 14లోపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విద్యార్థులు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ నందు, ఖమ్మం జిల్లా వారి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉసిరికాయలపల్లి నందు సమర్పించాలన్నారు.

## భూదాన్ బాధితులకు అండగా పువ్వాడ ఫౌండేషన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితులకు పువ్వాడ ఫౌండేషన్ అండగా నిలిచింది. నివాసం కోల్పోయిన వారికి బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇచ్చిన హామీ మేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు పువ్వాడ ఫౌండేషన్, బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులకు భోజనం, మంచినీటి వసతిని ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ బాధితులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ ఇండ్లు కూల్చివేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను అన్యాయంగా రోడ్డున పడేయటమే గాక మంత్రులు వారిని అపహాస్యం చేస్తున్నారన్నారు. బాధితులకు గూడు దొరికే వరకూ బిఆర్‌ఎస్ అండగా ఉంటుందని వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడతామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత సహాయకుడు రవికిరణ్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మహిళా నాయకులు పద్మ, షకీనా, మాధవి, బోజడ్ల రాంమోహన్, వీరభద్రం, ఎర్ర అప్పారావు, వీరేంద్రగౌడ్, వెంకట్, ఉస్మాన్, వెంకన్న, తిరుమల్, సతీష్, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక నవభారత్ సెంటర్‌లో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీనితో నవభారత్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహేష్ (35)కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన చికిత్స కోసం కొత్తగూడెంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు చికిత్స అందించిన వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎక్కడైనా.. పేదలే సమిధలు

### క్రమబద్ధీకరణ పేదలకు వర్తించదా?





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఘటన ఏదైనా.. ఎటువంటిదైనా పేదలే సమిధులవుతున్నారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినా, అమలులో మాత్రం తద్విరుద్ధంగా జరుగుతుంది. నాటి నుంచి నిన్న మొన్నటి వెలుగుమట్ల రెవెన్యూలో పేదల నివాసాల కూల్చివేత వరకు పేదల పట్ల వివక్ష జరుగుతుంది. గత ప్రభుత్వం ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ కొరకు 58, 59 జిఒలను తీసుకొచ్చింది. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉంటే క్రమబద్ధీకరించేందుకు ఈ జిఒలు తీసుకువచ్చారు. జిఒ నెం. 58 ప్రకారం పేదలై ఉండి 125 గజాల లోపు ఉంటే ఉచితంగా ప్రభుత్వమే పేదల పేరున క్రమబద్ధీకరణ చేయవచ్చు. ఈవిధంగా ఖమ్మంలో గత ప్రభుత్వం కొద్ది మంది పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించింది. జిఒ నెం. 59 ప్రకారం 125 గజాలకు మించిన ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంటే ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చెల్లిస్తే భూములను క్రమబద్ధీకరించారు. ఖమ్మంలో అనేక మంది సంపన్నులు వేల గజాలను జిఒ నెం. 59 ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరించుకున్నారు. ఈ క్రమబద్ధీకరణ చేసుకున్న వారిలో రాజకీయ నాయకులు మొదలు చాలా మంది ఉన్నారు. ఈ క్రమబద్ధీకరణపై అప్పుడు రాజకీయ దుమారం లేసింది. అయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్రమబద్ధీకరించామని ప్రభుత్వం తెలిపింది. వెలుగుమట్ల పేదల విషయంలో జిఒ నెం. 58 ఎందుకు అమలు కాలేదన్నది ఇప్పటి ప్రశ్న. వెలుగుమట్ల రెవెన్యూలో వినోబానగర్‌లో నివాసం ఉంటున్న పేదల నివాసాలకు సంబంధించి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి అర్హుల జాబితా తేల్చి అక్కడే 125 గజాల లోపు ప్రభుత్వ స్థలాలను పేదల పేరున క్రమబద్ధీకరించవచ్చు లేదంటే నిజమైన పేదలు ఉంటే వెలుగుమట్ల రెవెన్యూలో వీలు కాని పక్షంలో మరో చోట పేదలకు నివాస స్థలాలను అప్పగించవచ్చు.

గత ప్రభుత్వంలో ఎన్నెస్పి కాలువ కట్టలపై, గోళ్లపాడు చానెళ్లపై నివసించే వారికి రఘునాథపాలెం మండలం, ఖమ్మం అర్బన్ మండలంలోని వెలుగుమట్ల రెవెన్యూలో నివాస స్థలాలను కేటాయించారు. ఇప్పుడు వెలుగుమట్ల విషయంలోనూ కూల్చివేతలకు ముందే సర్వే నిర్వహించి క్రమబద్ధీకరణ చేస్తే బాగుండేదన్న భావన ఇప్పుడు ప్రజల్లో ఉంది. నివాసాలు ఏర్పా టు చేసుకుని అనేక ఏళ్ల పాటు జీవించిన తర్వాత ఆ భూమిపై హక్కుల కోసం వాళ్లు ప్రయత్నిస్తున్న నేపథ్యం లో బుల్డోజర్లతో దాడి చేసి వీధికి నెట్టడమే ఇప్పుడు స ర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం చెబుతున్న ప్ర కారమే పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తే అది కూడా పేదలకు నష్టం కలిగించే విషయమే. ప్రభు త్వ చర్యల కారణంగా అటు ప్రభుత్వం ఇటు దళారుల మధ్యలో పేదలే సమిధులుగా మారారు. డబ్బు పోగొట్టుకుని వస్తుందనుకున్న స్థలం దక్కక పేదల పరిస్థితి రెంటి కి చెడ్డ రేవడిలా మారారు.

ఇదే సమయంలో ఇండ్ల తొలగింపు, బుల్డోజర్ల ప్రవేశం ఇది రాజకీయ దుమారానికి కారణమైంది. ప్రభుత్వ అనుకూల వ్యతిరేక ప్రచారాలు మొదలయ్యాయి. భూదాన్ భూములకు సంబంధించి వాస్తవ, అవాస్తవాలు కూడా ప్రచారం జరుగుతున్నాయి. ప్రతిపక్ష విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. కానీ ఉన్న చట్టాలను ఉపయోగించి కాస్త సమన్వయం పాటించి పేదలకు న్యాయం చేసే దిశగా ఆలోచన చేస్తే బాగుండేదన్న భావన ప్రతి ఒక్కరిలో ఉంది. ఈ భావన అధికార పార్టీలోనూ ఉండటం గమనార్హం. ఇప్పుడు పార్టీల మధ్య రాజకీయ రగడకు, వ్యక్తులపై నిందలకు ఇది అవకాశం కల్పిస్తుంది. మొత్తంగా వెలుగుమట్ల పేదలే సమిధలయ్యారు. కాలిపోతున్న ఆ సమిధల వెలుగులో కొందరు రాజకీయ లబ్ధి పొందేందు కు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ లాభ నష్టాలను పక్కన పెడితే ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారమే లక్షలు వెచ్చించిన తర్వాత కనీస విచారణ లేకుండా బుల్డోజర్లతో కూల్చివేయడం ఒక రకంగా పేదలను వీధిన పాలు చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తున్న హామీ ప్రకా రం పేదలకు న్యాయం జరిగేవిధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో భూదాన్ భూ ములకు సంబంధించి మొత్తం వ్యవహారాన్ని ప్రజల ముందు ఉంచాలి. అపోహలకు తావులేనివిధంగా రాజకీయ వివక్ష పాటించకుండా పేదలకు న్యాయం చేయడమే ఇప్పుడు ప్రభుత్వం ముందు ఉన్న కర్తవ్యం.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షమెన్నడో?

### అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా భవనం!
### సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న బడాబాబులు



**ప్రజాపక్షం/మణుగూరు :** పట్టణ పరిధిలో వ్యాపారుల సౌలభ్యం కోసం రూ. 4.70 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షం ఎప్పుడు కలుగుతుందా.. అని చిరు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వ్యాపార సముదాయాలను ఏక ప్రాంతంలో తేవాలని అభీష్టంతో 2021లో స్థానిక రాజీవ్‌గాంధీనగర్ ఏరియాలో కోట్ల రూపాయలతో ప్రారంభించిన మార్కెట్ భవనం నేటి వరకు అసంపూర్తిగా నిర్మాణం కావడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ భవనం పూర్తయితే వ్యాపారాలు చక్కడా చేసుకోవచ్చని ఎదురుచూస్తున్న వ్యాపారులకు ఈ సంవత్సర వర్షాకాలం కూడా నిరాశే మిగిల్చింది. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారిపై నిత్యం బొగ్గు, ఇసుక లారీలతో నిండి ఉండటం ఇక్కడ వ్యాపారులకు శాపంగా మారింది. పట్టణప్రాంతంలో వ్యాపారాలు లేక అనేకమంది వ్యాపారస్తులు అప్పుల పాలై, ఐపీలు పెట్టి కుటుంబ పోషణ కోసం వేరే ప్రాంతాలకు వలస పోతున్న దుస్థితి మన మణుగూరు ప్రాంతంలో ఉంది. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా అనేక మంది వ్యాపారులకు ఆసరా లభిస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ భవన నిర్మాణం నత్తనడకన నడవడంతో ఈ భవన సముదాయాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని, రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాలుగా మారాయని, అదేవిధంగా గంజాయి బ్యాచ్‌కు కూడా అనువుగా ఈ ప్రాంతం ఉండటంతో రాత్రి వేళలో అనేకమంది ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోప ణలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ ఇంటిగ్రేట్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి మణుగూరు వ్యాపారులకు అండగా నిలవాలని అదే విధంగా ఈ ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించాలని ప్రభుత్వ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## నేత్రదానం అభినందనీయం

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఆ యువతి మరణించినా.. తన రెండు కళ్లు మరొకరికి కంటి చూపై ఈ లోకాన్ని చూడబోతున్నాయి. ఇంటి బిడ్డను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్నపటికీ ఆ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం మరొకరికి చూపును ప్రసాదించనున్నాయి. ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డుకు చెందిన సోమంచి నరసింహ, గిరిజకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం అవ్వగా చిన్న కుమార్తె శ్రీ వల్లి(30) పుట్టుక నుంచే అనారోగ్యానికి గురయ్యింది. తల్లి కడుపులో ఉన్నప్పుడే ఉమ్మ నీరు తాగడంతో బ్రేన్ సమస్య ఏర్పడి మంచానికే పరిమితం అయ్యింది. అటు తర్వాత కొంచెం కొలుకొని, వికాలంగత్వంతో డిగ్రీ ఫస్ట్ ఇయర్ వరకు చదివింది. ఈ నేపథ్యంలో పూర్తిగా ఆరోగ్యం క్షీనించి ఇంట్లోనే ఉంటూ మంగళవారం మృతి చెందింది. కాగా తల్లి దండ్రులు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా చైతన్యంగా ఆలోచించారు. అన్నం ఫౌండేషన్‌కు తమ కుమార్తె రెండు కండ్లను దానం చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 28,30 వార్డుల కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, స్థానికి సిపిఐ నాయకులు గుడివాడ శ్రీను, సురభి సాయి, నాగమణి టీచర్, అయ్యగారు, రమేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## 8 నుండి ఉచిత హెచ్‌పివి టీకాలు

### ప్రణాళికలు సిద్ధంచేసిన వైద్యారోగ్యశాఖ
### విడతల వారిగా అందరికీ వ్యాక్సిన్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సర్వేకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ భారి నుండి 14 నుంచి 15 ఏళ్ల బాలికలను బయటపడేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం హెచ్‌పివి వ్యాక్సిన్ జిల్యావ్యాప్తంగా ఉన్న 1.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా అందించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా హెచ్‌పివి టీకాలను 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు క్రింద గతనెల 28న రాష్ట్రంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా మార్చి 8 లేదా 9 తేదీల్లో జిల్లావ్యాప్తంగా అమలు చేసేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది.

**హెచ్‌పివి వైరస్ :** హెచ్‌పివి (హ్యూమన్ పయప్పిల్లోమ్ వైరస్) ఇది సాధారణమైన వైరసే అయినప్పటికీ ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. శరీరంలో దానంతట అదే తగ్గించుకునే శక్తి శరీరంలో ఉన్నప్పటికీ కొన్ని సార్లు ప్రాణాల మీదికి తెచ్చి పెడుతుంది. ఇది ప్రధానంగా చర్మం సంపర్కం లేదా లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. ప్రధానంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్), అంతే కాకుండా స్త్రీలతోపాటు పురుషుల్లో ఆనల్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, జననేంద్రియ క్యాన్సర్ వంటివి వ్యాపిస్థాయి. టీకాలు తీసుకున్నప్పటికీ పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది పురుషులకు కూడా సోకే అవకాశం ఉడటంతో లైంగిక సబంధాలు నెరిపే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలిః డా.తేజశ్రీ**

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పివి టీకాలను మార్గదర్శకాల ప్రకారం అర్హులంతా తీసుకోవడం మంచిది. ఈ టీకా వేసుకోవడం వల్ల పూర్తి సురక్షితమైన జీవితాన్ని సాగించవచ్చు. టీకాలు తీసుకున్న సమయంలో జ్వరం, టీకా వేసుకున్న ప్రదేశంలో నొప్పి లాంటి చిన్నపాటి సాధారణ సమస్యలు ఉండే అవకాశం ఉంది.

## 5న ఖమ్మంలో కమ్యూనిస్టు సదస్సు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభకు నూరేళ్లు నిండిన సందర్భంగా మార్చి 5న ఖమ్మం పట్టణంలోని జుబ్లీక్లబ్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్ తెలిపారు. సదస్సు వాల్ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పివోడబ్ల్యు నాయకురాలు లలిత అధ్యక్షతన జరిగిన సభలో సురేందర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేసే క్రమంలో ఖమ్మం జుబ్లీక్లబ్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు యలమద్ది కళాధర్, కె. నాగేశ్వరరావు, ఉపేందర్, రాజు, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐటిసి అనుమతులలో అక్రమాలు

### గుత్తేదారు తీరుపై ఆరోపణలు..
### పోలీసులకు ఫిర్యాదు




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఐటిసి రా మెటీరియల్స్(కలప విభాగం)అనుమతుల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దరఖాస్తు చేసిన పొలం ఒకటైతే, అనుమతి వచ్చిన తర్వాత కర్ర నరికింది మరొక పొలం నుండి అనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మంగళవారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్‌లో రైతు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగినేని ప్రోలు శివారులో ఉన్న రెండు ఎకరాల పొలంలో జామాయిల్ పంట ఉందని చూపిస్తూ, సౌమ్య అనే యువతి గుత్తేదారు మద్ది బక్కారెడ్డి ద్వారా ఐటిసి రా మెటీరియల్స్ విభాగానికి అనుమతి కోసం దరఖాస్తు చేశారు. అయితే ఆ పొలంలో జామాయిల్ పంట లేకపోయినా, సంబంధిత అధికారులు పరిశీలన చేయకుండానే అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. అనుమతి వచ్చిన అనంతరం జామాయిల్ కర్రను నరికింది మాత్రం సారపాక శివారులో తనకు చెందిన పొలం నుండి అని శంకర్‌రెడ్డి అనివాపోయారు. దీనిపై గుత్తేదారు మద్ది బక్కారెడ్డిని ప్రశ్నించగా ఐటీసీ అధికారుల ప్రోత్సాహంతోనే వేరే పొలం నుండి కట్ చేస్తున్నానని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. తాను అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ వినకుండా, నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులతో కలిసి కు మ్మక్కై కర్రను నరికి ఐటీసీకి అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే ఈ విషయాన్ని ఐటీసీ రా మెటీరియల్స్ అధికారి శ్రీ ధర్, జనరల్ మేనేజర్ అమిత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమ అనుమతులు పొంది వేరే పొలం నుండి కలప నరికిన గుత్తేదారుపై ఐటీసీ అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ఇలాంటి అక్రమాలకు ప్రోత్సహిస్తారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది.

## భద్రాద్రిలో వసంతోత్సవానికి అంకురార్పణ

### రామాలయంలో నేడు కల్యాణ తలంబ్రాల తయారీ
### తొలిరోజు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారీ
### మొదలైన రామయ్య పెళ్లి సందడి



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం డోలోత్సవం, వసంతోత్సవానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా పావన గోదావరి నది నుండి తీర్థ బిందెను తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి హారతులు పట్టారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవాన్ని ఆలయ ప్రాగణంలో నిర్వహించనున్నారు. ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. హోలీ పౌర్ణమి సందర్భంగా సహస్రధారలతో ప్రత్యేక స్నపనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఊయలలో ఆశీనులను చేసి డోలో త్సవాన్ని నిర్వహిస్తారు. అదే విధంగా శ్రీరామ నవమికి సంబంధించి స్వామివారి తలంబ్రాల తయారీ కూడా నేడే జరగనుంది. మొత్తం 400 క్వింటాళ్ల కళ్యాణ తలంబ్రాలు తయారీ చేయాలని నిర్ణయించగా, హోలీ పౌర్ణమి నాడు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారు చేసేందుకు రామాలయం అధికారులు శ్రీకారం చుట్టారు.

ఇదిలా ఉండగా, ఈ నెల 19 నుండి వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మార్చి 27న శ్రీరామ నవమి, 28న పట్టాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

**మొదలైన పెళ్లి సందడి :** హోలీ పౌర్ణమి సందర్భంగా తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు మొదలవనున్నాయి. ఇప్పటికే రామాలయం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు మొదలయ్యాయి. తలంబ్రా తయారీతో ఒక్కొక్క పని మొదలు కానుండగా ఈనెల 19 నుండి తిరుకళ్యాణ మహోత్సవాలు మొదలుకానున్నాయి. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నవమి ఏర్పాట్లపై సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు.

**చంద్రగ్రహణంతో ఆలయం మూసివేత :** చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని ఉ.9.30 గం.లకు మూసివేశారు. ఈ సందర్భంగా ప్రధాన ద్వారాన్ని మూసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గం.లకు గ్రహణం వీడటంతో గోదావరి నది నుండి తీర్థ జలాలను తీసుకొచ్చి ఆలయాన్ని ప్రత్యేక పూజల నడుమ సంప్రోక్షణ చేశారు. అనంతరం రాత్రి .8.30 గం.ల నుండి భక్తులకు సర్వదర్శనాలు ప్రారంభించారు.

### ఘనంగా హోలీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** హోలీ పండుగను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఉదయం రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందోత్సహాలతో గడిపారు. కుల మతాలకు అతీతంగా హోలీ జరుపుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ హోలీ పండుగను నిర్వహించారు. ఖమ్మం ఎస్సి బాలికల వసతి గృహంలో సంక్షేమ అధికారి కోమలి ఆధ్వర్యంలో హోలీని ఆనందోత్సహాల మధ్య నిర్వహించారు.

"పాన్ ఇండియా స్టార్స్ విజయ్ దేవరకొండ, రష్మిక రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. విజయ్ దేవరకొండ స్వగ్రామం నాగర్ కర్నూల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. బంధు మిత్రులు, గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. పలువురు మోడల్స్ రిసెప్షన్ వేడుకలో హంగామా చేశారు."

## రీల్

## 'రేపు ఉదయం 10 గంటలకు'



### ఫస్ట్ లుక్ విడుదల

'ఓ పిట్ట కథ', 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' సినిమాలకు దర్శకత్వం వహించిన చెందు ముద్దు నుంచి వస్తున్న తాజా సస్పెన్స్ థ్రిల్లర్ 'రేపు ఉదయం 10 గంటలకు'. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో విడుదలవుతోన్న చిత్రమిది. మంగళవారం ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'రేపు ఉదయం పది గంటలకు' సినిమాలో అభినవ్ గోమటం, హెబ్బాపటేల్, చైతన్య రావు, కిరీటి దామరాజు, వాసు ఇంటూరి, సాహితి అవంచ, మోహిత్ ప్రధాన తారాగణం. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తే... గడియారాన్ని హైలైట్ చేశారు. టైటిల్ వెనుక ఒక క్లాక్, నటీనటులు అందరి వెనుక మరొక క్లాక్ ఉన్నాయి. టైటిల్ వెనుక గడియారంలో పది గంటలు చూపిస్తే... ఆర్టిస్టుల వెనుక గడియారంలో రెండు గంటల సమయాన్ని చూపించారు. ఈ సినిమాను రామ్ వీరపనేని నిర్మిస్తున్నారు. త్వరలో థియేటర్లలో విడుదల చేయనున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభినవ్ గోమటం, హెబ్బాపటేల్, చైతన్య రావు, కిరీటి దామరాజు, వాసు ఇంటూరి, సాహితి అవంచ, మోహిత్ తదితరులు నటించిన 'రేపు ఉదయం పది గంటలకు' చిత్రానికి సమర్పకులు: మాంగో మాస్ మీడియా, సినిమాటోగ్రాఫర్: సునీల్ కుమార్ నామా, సంగీత దర్శకుడు: ప్రిన్స్ హెన్రీ, ఎడిటర్: డి. వెంకట ప్రభు, పీఆర్వో: పులగం చిన్నారాయణ, నిర్మాత: రామ్ వీరపనేని, దర్శకుడు: చెందు ముద్దు.

## శివాజీ రాజాకు పితృ వియోగం



క్యారెక్టర్ నటుడు శివాజీ రాజా తండ్రి జి. రామరాజు (85) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం 8 గంటలకు మధురానగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. వయోభారం కారణంగా ఆరోగ్యం క్షీణించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న శివాజీ రాజా కుటుంబానికి సినీ ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

## 'కాక్రోచ్'లో డార్క్ సైడ్ చూపిస్తున్నాం

**దర్శక నిర్మాతలు సునీల్ కుమార్ రెడ్డి, బాపిరాజు**

సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్, వలస వంటి చిత్రాలతో అవార్డులు, ప్రేక్షకుల రివార్డులు అందుకున్న డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం 'కాక్రోచ్'. ఈ చిత్రంలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'కాక్రోచ్' సినిమాను శ్రీ లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్యనారాయణ నిర్మిస్తున్నారు.ఈ సినిమా మార్చి 6న గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి, నిర్మాత బి.బాపిరాజు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ నేను 70వ దశకంలో డిస్ట్రిబ్యూటర్ గా కెరీర్ స్టార్ట్ చేశాను. తమిళ సినిమాలను కొని తెలుగులో రిలీజ్ చేసేవాళ్లం. అప్పుడు డబ్బింగ్ ద్వారానే ఇతర చిత్రాలను ప్రేక్షకులు చూడగలిగేవారు. అలా చాలా సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేశాను. కొన్నాళ్లకు పి.సునీల్ కుమార్ రెడ్డి గారితో పరిచయం ఏర్పడింది. స్వర్గీయ రవీంద్రబాబుతో కలిసి సునీల్ కుమార్‌రెడ్డి కాంబినేషన్‌లో వరుసగా చిత్రాలు చేస్తూ వచ్చాం. ఈ సినిమాలన్నీ మాకు నిర్మాతలుగా మంచి పేరు తీసుకొచ్చాయి.మా కాంబినేషన్‌లో చేస్తున్న మరో వినూత్న సినిమా 'కాక్రోచ్'. ఎవరూ కావాలని తప్పులు చేయరు. ఆకలి, నిరుద్యోగం, పేదరికం వారితో తప్పులు చేయిస్తాయి. సమాజంలో వేల కోట్ల రూపాయలు ఉన్న ధనవంతులు ఉంటారు. వారిలో కొందరు రూపాయి సాయం చేయరు. పని దొరకని యువత విధిలేని పరిస్థితుల్లో తప్పుదారిలో వెళ్తుంటారు. పొట్ట కూటికోసం కొందరు మహిళలు వ్యభిచార వృత్తిలోకి



వస్తుంటారు. అలాంటి కొందరు క్రిమినల్స్, వేశ్య మధ్య సాగిన ప్రేమ కథ ఈ సినిమాకు నేపథ్యం. ఈ కథను వీలైనంత బోల్డ్‌గా తెరకెక్కించారు మా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి.సమాజంలో జరుగుతున్న ఘటనలకు వాస్తవిక రూపంగా ఈ సినిమాను నిర్మించాం. తన పేదరికమే శాపమై వ్యభిచార వృత్తిలోకి వచ్చే వేశ్య కొద్దిపాటి ఆదాయం కోసం ఎన్నో బాధలు పడుతుంది. ఈ నెల 6న మా 'కాక్రోచ్' సినిమాను విడుదల చేస్తున్నాం. రియల్ లైఫ్ స్టోరీని రా అండ్ రస్టిక్ మేకింగ్ తో చూడాలనుకునే ప్రేక్షకులకు మా మూవీ బాగా నచ్చుతుంది. డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూనేను విశాఖలో జర్నలిస్ట్‌గా పనిచేశాను. సొంతంగా ఒక పత్రిక నిర్వహించాను. వార్తల సేకరణలో భాగంగా పోలీసులు, నేరస్తులతో మాట్లాడుతుండేవాడిని. ఈ క్రమంలో వారు చెప్పే విషయాలు ఎంతో ఆసక్తిని కలిగిస్తుండేవి. కొందరు పోలీసులు, నేరస్తులతో కలిసి నేరాలు చేసేవారు. అలాంటివన్నీ విన్న తర్వాత ఈ నేపథ్యంతో సినిమా రూపొందిస్తే బాగుంటుంది అనిపించింది. మన నేరస్తుల గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకుని ఉంటాం. కానీ వాళ్ల జీవితాలను దగ్గరగా చూశాక నా అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. వాళ్లలో కొందరు ఉన్నత స్థాయికి వెళ్లాలని కలగన్న వారున్నారు. డాక్టర్ చదివి వైద్య సేవ చేయాలనుకునే వారూ ఉన్నారు. వాళ్ల కుటుంబాల్లో, వ్యక్తిగత జీవితాల్లో జరిగిన అనేక సంఘటనల వల్ల అనుకున్న దారిలో వెళ్లలేక క్రిమినల్స్ గా మారారు.మన సినిమాల్లో సమాజంలో ఉండే పువ్వుల్లాంటి జీవితాలే చూపించారు. కానీ మొక్క దగ్గర ఉండే మట్టిని, పువ్వు చుట్టూ ఉండే ముల్లు లాంటి జీవితాలను ఎవరూ తెరకెక్కించలేదు. 'కాక్రోచ్' సినిమాతో నేను ఆ ప్రయత్నం చేశాను. ఈ సినిమా పిల్లలకు, సున్నిత మనస్కులకు కాదని ప్రచార కార్యక్రమాల్లోనే స్పష్టంగా చెబుతున్నాం. సెన్సార్ వారికి కూడా మాకు ఎ సర్టిఫికెట్ కావాలనే చెప్పాం. మా మూవీ రివైజింగ్ కమిటీకి వెళ్లిన తర్వాత ఈ సినిమా తీయడంలో నా దృక్పథం ఏంటో క్లియర్ గా చెప్పాను. ఒక ఉన్నత స్థాయి వృత్తిలో ఉన్నవారు తమ వృత్తి గురించి గర్వంగా చెప్పుకున్నట్లే వేశ్య వృత్తిలో ఉన్న మహిళ తన ప్రొఫెషన్ గురించి గర్వంగానే చెప్పుకుంటుంది. నా వివరణ తర్వాత సెన్సార్ వారు అంగీకరించి ఎ సర్టిఫికెట్ జారీ చేశారు.మా మూవీలోని పాత్రలు ఎమోషనల్ గానే కాదు ఫిజికల్‌గా కూడా స్ట్రాంగ్‌గా ఉండాలి. అందుకే నటీనటుల ఎంపిక జాగ్రత్తగా చేశాం. ఈ మూవీని బోల్డ్ గా రూపొందించాం. నేను చూసిన సమాజాన్ని ఉన్నది ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేశాను. సినిమాల మేకింగ్ సులువైంది. కానీ దాన్ని ప్రేక్షకుడికి చేర్చి, ప్రేక్షకుడిని థియేటర్‌కు రప్పించడం పెద్ద టాస్క్ గా మారింది. టెక్నాలజీ అందుబాటులో ఉండటంతో విరివిగా సినిమాలు తెరకెక్కిస్తున్నారు. మరోవైపు ప్రేక్షకుడికి ఓటీటీ సహా ఎన్నో ఎంటర్ టైన్ మెంట్ ఆప్షన్స్ వచ్చాయి. దాంతో చిన్న చిత్రాలకు ఆడియెన్ ను రప్పించడం చాలా కష్టంగా మారింది.


## 'ఏడ్పు పాత్రలే' కాదు కామెడీ కూడా చేయగలను



### హీరోయిన్ లయ

మిస్సమ్మ', 'అదిరందయ్యా చంద్రం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' లాంటి క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ తర్వాత శివాజీ, లయ జంటగా నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రిక్కి సమర్పణలో హీరో శివాజీ స్వయంగా నిర్మిస్తుండగా.. సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. మార్చి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా హీరోయిన్ లయ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు శివాజీ నేను కలిసి నటించి 20 ఏళ్లు అవుతుంది. ఈ చిత్రంలో నటించాలి అనగానే ఫ్యామిలీ డ్రామా అనుకున్నాను. కానీ ఇది అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ అనగానే నాకు ఇష్టమైన జోనర్‌లో ఉంది అనిపించింది. నాకు కామెడీ సినిమాలంటే ఇష్టం. అందరికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. కామెడీ జోనర్ అనేది అన్ని ఏజ్‌ల వారికి నచ్చుతుంది. ఈ కామెడీ సినిమాలో ఓ ఇంట్రెస్టింగ్ ట్విస్ట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇది డార్క్ కామెడీ జోనర్. కామెడీ క్రైమ్ థ్రిల్లర్ ఇది. ఈ చిత్రంలో నేనుఉత్తర పాత్రలో నటించాను. ఇప్పటి వరకు నన్ను నేను ఇలాంటి పాత్రలో చూసుకోలేదు. మంగపతిలాంటి పవర్‌ఫుల్ పాత్ర చేసిన హీరోను డామినేట్ చేసే పాత్ర నాది. ప్రారంభంలో థియేటర్‌కే అనుకున్నాం. కానీ మధ్యలో అనుకోకుండా ఓటీటీలో స్ట్రీమింగ్ అన్నారు. అయితే మళ్లీ చాలా మంది ప్రముఖులు సినిమా చూసి ఇది థియేటర్‌లో విడుదల చేసే సినిమా అని అనడంతో మళ్లీ థియేటర్‌లోకి రాబోతుంది. . మా అమ్మాయి ఓటీటీలో సినిమా అనగానే ఎంతో బాధపడింది. నా సినిమా అంటే వెండితెరపై చూడాలనేది తన కోరిక. ఇప్పుడు థియేటర్ అనగానే ఎంతో ఆనందంగా ఉంది. స్టోరీ ఎంత బాగా రాసుకున్నాడో. అంత క్లారిటీగా తెరకెక్కించాడు. చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. సినిమాను ఎంతో హిలేరియస్‌గా తెరకెక్కించాడు. తనకు ఎలా కావాలో అలాంటి నటనను నటీనటుల నుండి తీసుకున్నాడు. కాంప్రమైజ్ అవ్వని దర్శకుడు. అతనికి ఏం కావాలో అది బాగా తెలుసు. మంచి ప్రతిభ గల దర్శకుడు. లయ అంటే ఏడిపించడం. ఏడవటం.. అనే గుర్తింపు ఉంది. కానీ ఈ సినిమాలో నేనే ఏడిపిస్తాను. ఎంతో ఎంజాయ్ చేసిన పాత్ర ఇది. స్వార్థంగా, తన భర్త, ఫ్యామిలీ గురించి ఆలోచించే స్వార్థపరులు పాత్ర. నా భర్త బాగుండాలి అని కోరుకునే మనస్తత్వం ఉన్న పాత్ర ఇది. లీడ్‌రోల్ పర్మినెట్ కాదు. లీడ్ రోల్స్ వస్తే చేస్తాను. కానీ కథ, నా పాత్ర నచ్చితే చిన్న పాత్రలైనా చేస్తాను. అమ్మాయిలకు పాత్రలకు పరిధి తక్కువ. వచ్చే పాత్రల్లో బెస్ట్ పాత్రలను చేస్తాను. సాఫ్ట్ రోల్స్ ఆల్రెడీ చేశాను. కాబట్టి స్ట్రాంగ్ క్యారెకర్స్ చేయాలని ఉంది. వదల అనే సినిమాలో జగపతిబాబు భార్యగా చేస్తున్నాను. శ్రీకాంత్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నాను. నాగేశ్వర రెడ్డి దర్వకుడు. యమలీల తరహాలో సోషియో ఫాంటసీ సినిమా. వదల అనేది సైకలాజికల్ థ్రిల్లర్. డిఫరెంట్ జోనర్‌లో ప్రయత్నిస్తున్నాను.

## ఏప్రిల్ 30న వస్తున్న పెద్ది



రామ్ చరణ్ తాజాగా పెద్ది సినిమాతో సిద్ధమవుతున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ షాట్ గ్లింప్స్, అలాగే ఫస్ట్ సింగిల్ చికిరి చికిరికు వచ్చిన సెన్సేషనల్ రెస్పాన్స్‌తో సినిమా ట్రెండ్ క్రియేట్ చేసింది.తాజాగా రెండో సింగిల్ రై రై రా రాను విడుదల చేశారు. ఏఆర్ రెహ్మాన్ స్వయంగా ఆలపించిన ఈ పవర్ ఫుల్ డ్యాన్స్ నంబర్ పవర్ బీట్స్, ఇన్‌ఫెక్షియస్ రిథమ్‌తో అదిరిపోయే మాస్ ఎనర్జీని అందిస్తోంది. స్టార్ ఎంట్రీ సాంగ్ ఎలా ఉండాలో కొత్త బెంచ్ మార్క్ సెట్ చేస్తూ రామ్ చరణ్ తన ట్రేడ్ మార్క్ మాస్ ఎనర్జీ, గ్రేస్‌ఫుల్ ఫిట్‌నెస్‌తో అదరగొట్టారు. ఆయన ఫ్లూయిడ్ మూవ్ మెంట్స్, పవర్‌ఫుల్ ఫుట్‌వర్క్, కరిస్మాటిక్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మార్చేశాయి. జానీ మాస్టర్ అందించిన డైనమిక్ కొరియోగ్రఫీ విజువల్ ట్రీట్ గా నిలిచింది. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పూర్తి మాస్ అప్పీల్‌తో ఆకట్టుకుంది, ప్రతి లైన్ రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు గ్రాండియర్ లెన్సింగ్‌తో ఈ సాంగ్ లార్జ్ స్క్రీన్ ఫీస్ట్‌గా నిలిచింది.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బో మన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.

## మావోయిస్టులను ఆహ్వానిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన గుర్తు చేశారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. మావోయిస్టుల సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు.

**రాజ్యసభ స్థానాలపై నేడు స్పష్టత :**

రాజ్యసభ స్థానాల పోటీకి సంబంధించి రాష్ట్రం నుంచి ఒకరికా, ఇద్దరికా అనేది బుధవారం స్పష్టత రానుందని మహేశ్ కుమార్ తెలిపారు. నలుగురు బిసి నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారన్నారు. రాజ్యసభ సభ్యుల ఎంపికకు సంబంధించి సోమవారం అరగంట పాటు చర్చ జరిగిందని వివరించారు.సామాజిక వర్గాల వారిగా 16 మంది పేర్లను ఇచ్చామని, అయితే ఢిల్లీకి పిలుస్తారా? ఫోన్లో చర్చిస్తామా అనేది నిర్ణయించనున్నామని తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు.8 చోట్ల ఎంఎల్‌ఎలు సహకరించడం లేదని డిసిసి అధ్యక్షులు ఫిర్యాదు చేశారని, దీంతో ఈ అంశంపై దృష్టి సారించాల్సిందిగా రాహుల్ గాంధీ తనను ఆదేశించగా వెంటనే ఆ ఎంఎల్‌ఎలతో మాట్లాడినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెలలో పలు కార్పొరేషన్ పదవులు భర్తీ చేయనున్నామని ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. అమాయకుడైన తమ అగ్రనేత రాహుల్ గాంధీని బిజెపి ఆడిపోసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మోదీ ఎప్స్టిన్ ఫైల్స్ లో అడ్డంగా దొరికిపోయ్యారని ఈ వ్యవహారంపై బిజెపి, ఆర్ఎస్ఎస్ సమాధానం చెప్పాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.


**బిఆర్ఎస్ తెలంగాణ కోసం పని చేసినా వారికి ఒక్క టికెటైనా ఇచ్చిందా ?**

బిఆర్ఎస్ రాజ్యసభ స్థానాలను కార్పొరేట్ శక్తులకు తప్ప తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా అవకాశం ఇచ్చారా అన్ని ప్రశ్నించారు. రాజకీయాల కోసమే కేరళంముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే సమాధానం ఇచ్చారని చెప్పారు. కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## షార్ట్ రన్ వే?

(మొదటి పేజీ తరువాయి)

విమానాలు (వైడ్ బాడీ) దిగడానికి వీలు కాదు. అలాంటప్పుడు కేవలం 2.5 కిలోమీటర్ల పొడవైన రన్ వే తో వరంగల్ విమానాశ్రయం కట్టాలని నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కాగా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ ఎయిర్ పోర్టును 3.9 కిలోమీటర్ల పొడవైన రన్ వే తో నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు. అలా కట్టి ఉంటే ప్రపంచంలోని అతిపెద్ద విమానం కూడా ఇక్కడ ల్యాండ్ అయ్యే సౌకర్యం ఉండేది. వరంగల్ ఎయిర్ పోర్టు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టులో కూడా రన్ వే పొడవు 2.9 కిలోమీటర్లు ఉంటుందని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ వారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడు సమావేశమైన అనంతరం విడుదల చేసిన ప్రకటనలో ఎయిర్ పోర్టు రన్ వే పొడవును 2.5 కిలోమీటర్లుగా పేర్కొన్నారు. అంటే దీని అర్థం వరంగల్ ఎయిర్ పోర్టులో కేవలం చిన్న డొమెస్టిక్ విమానాలు మాత్రమే దిగేందుకు వీలుంటుంది. పెద్ద డొమెస్టిక్ విమానాలు కానీ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కానీ నడపడానికి ఈ రన్ వే సరిపోదు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి వరంగల్ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో వందేళ్ల క్రితం కట్టిన హైదరాబాద్ బేగంపేట ఎయిర్ పోర్టులోనే 3.2 కిలోమీటర్ల రన్ వే ఉంది. ఇక 2008లో మొదలైన శంషాబాద్ విమానాశ్రయం రన్ వే ఏకంగా 4.2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. పక్క రాష్ట్రంలోని విజయవాడ ఎయిర్ పోర్టు రన్ వే పొడవు 3.36 కిలోమీటర్లు ఉండగా, వైజాగ్ విమానాశ్రయంలో రన్ వే పొడవు 3.0 కిలోమీటర్లు ఉంది. మరి అత్యాధునికంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కడతామంటున్న వరంగల్ ఎయిర్ పోర్టును కేవలం 2.5 కిలోమీటర్ల బుజ్జి రన్ వే తో కడితే ఏం ప్రయోజనం అనే చర్చ నడుస్తోంది.



## రికార్డు స్థాయి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రలోనే గరిష్ట డిమాండ్‌ను ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తిచేసి మెరుగైన విద్యుత్ సరఫరా చేసిన విద్యుత్తు రంగంలోని ఉన్నతాధికారులు, యావత్ సిబ్బందికి ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఈ మైలురాయి తెలంగాణ ఆర్థిక వృద్ధి, కార్యనిర్వహణ సామర్థ్యం, అద్భుత సమన్వయానికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ కేవలం సమకాలీన అవసరాలను తీర్చడం మాత్రమే కాకుండా రానున్న వేసవి గరిష్ట డిమాండ్లకు ముందస్తు ప్రణాళికలతో పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. బలమైన గ్రిడ్ వ్యవస్థ, ముందుచూపు ప్రణాళిక, సమన్వయంతో ఉన్న వ్యవస్థ తెలంగాణ బలమని డిప్యూటీ సిఎం తెలిపారు.

## లబ్ధిదారులకు ముఖ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

పి.సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ జి.చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ బి.శివధర్ రెడ్డితో వివిధ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

మావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలనప్రగతి ప్రణాళికను అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ, 16న మండల స్థాయిలో కార్యక్రమం, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం, మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక, శాఖల వారీగా 10 వివిధ థీమ్‌లతో 99 రోజుల కార్యక్రమం నిర్వహించాలని సిఎం ఆదేశించారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు, 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించాలని సిఎం సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్.. అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం తదితర అంశాలకు ఈ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం వివరించారు.

**ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి**

రాష్ట్రంలో 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లను భాగస్వాములను చేయాలని, వారందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని, వారి విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు ప్రింటెడ్ మెటీరియల్ అందించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. ఇళ్లపై సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం, సోలార్ విద్యుత్ వాడుకోవటంతో పాటు గ్రిడ్‌కు కనెక్ట్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలని, పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలని, మెడికల్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు,



వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారని, వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనర్హులు లబ్ధిపొందకూడదు

**ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్)** చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన ప్రజలకు కచ్చితంగా లబ్ధి జరగాలని, అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదని సిఎం స్పష్టం చేశారు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగామని, సాంకేతికతను సరిగా వినియోగించుకోకపోవడంతోనే ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందారన్నారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలని, వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించాలని, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

ప్రమాదం జరిగే స్థలాల వివరాలకు వాట్సాప్ నెంబర్

రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్‌ను రవాణా శాఖ ఇవ్వాలని, ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు చేపట్టడం, ఇతర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రవాణా శాఖ డాటా ఆన్‌లైన్ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని, ఆర్‌టిసి బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని, ఎక్కువ సంఖ్యలో డ్రైవర్లు కలుసుకునే చోట్లనే ఈ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారని, వ్యర్థాలను తీసుకు వచ్చే వాహనాలను పట్టుకుని జరిమానాలు విధించాలని, అవసరమైతే కేసులు పెట్టాలని, ఓఆర్ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలని సిఎం ఆదేశించారు.

**విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత**

పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈసిగరెట్ల వినియోగం జరిగితే అందుకు సంబంధిత విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పిఈటి ఎలా ఉంటారో అలానే సైకాలజిస్ట్ ఉండేలా చూడాలన్నారు. మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాలలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గరల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలని, సంబంధిత హాస్టళ్ల ఏర్పాటుకు అనుమతులు, వాటిపై పర్యవేక్షణ ఉండాలని, వాటి యాజమాన్యాలకు జవాబుదారీతనం ఉండాలన్నారు.

మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలి

వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలని, ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుంది అనే విషయం రైతులకు తెలియజేయాలని, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలని, పంట మార్పిడి, పంటల వైవిధ్యత ప్రయోజనాలను వివరించాలన్నారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలని, పంటలు వేసే మొదలు పంట ఉత్పత్తుల అమ్మకం వరకు సరైన కార్యాచరణ ప్రణాళిక ఉంటేనే ఇబ్బందులు ఎదురుకావన్నారు. ఈ విషయంలో ఈ రెండు శాఖలు పరస్పర సహకారంతో ముందుకుసాగాలని, కలెక్టర్లు తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. యూరియా యాప్‌లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని, దానిని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలన్నారు. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు చూపించాలని సిఎం సూచించారు.

**పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించదు**

'రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించదు' అని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రతీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ఒక అధికారికి బాధ్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులతో పాటు పాఠశాలలో వారానికి ఒకసారి ఆ అధికారి, కలెక్టర్ భోజనం చేయాల్సిందేనన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక మండల కేంద్రంలో నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు తెలంగాణలో వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**ఎస్‌పిని అక్కడికక్కడే సస్పెండ్ చేస్తాం**

ఇసుక మాఫియా , అక్రమ మైనింగ్ పట్ల కఠినంగా వ్యవహరించకపోతే కలెక్టర్, ఎస్‌పిని అక్కడికక్కడే సస్పెండ్ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల విషయంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని సిఎం స్పష్టం చేశారు. మిల్లర్ల దగ్గర నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాల్సిందేనని సిఎం స్పష్టం చేశారు.

"ఆషామాషీగా ఐఎఎస్ కాలేరు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి సార్థకత ఉంటుంది. క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తేనే కలెక్టర్లుగా కొనసాగుతారు. కలెక్టర్లుగా క్షేత్ర స్థాయిలో పర్యటించకపోతే ఎప్పటికీ మీకు ప్రజల సమస్యలు అర్థం కావు. కనీసం నెలకు 10 రోజులైనా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశిస్తున్నా. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే. కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలి. ఈ ప్రభుత్వం మిమ్మల్ని నిశితంగా గమనిస్తుంది. మీరు మంచి పని చేస్తే మిమ్మల్ని అభినందిస్తుంది. వార్షిక పర్ఫామెన్స్ రిపోర్ట్ ఆధారంగా మీ పనితీరు తెలుసుకుంటాం. జూన్ లో కలెక్టర్ల పనితీరుపై మరోసారి సమావేశం నిర్వహిస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com